సాహితి
గత నాలుగేళ్లుగా వెలుగుతున్న
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
కడప
: fb.com/vaartha Digital
Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-4-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 59 పేజీలు: 10+4 వెల: 6.50

మూడోసారి కూడా 'కుర్చీ' నాదే: ట్రంప్

30 లక్షల మంది అఫ్ఘాన్‌లపై పాక్ బహిష్కరణ వేటు

5లో

# వడివడిగా 'పోలవరం'



## తొమ్మిది నెలల్లోనే 6.11 శాతం పనులు పూర్తి

## అంతకు ముందు ఐదేళ్లలో సాగిన పనులు 11.58 శాతమే

## 2026 డిసెంబర్‌లోగా నిర్వాశితులకు పునరావాసం

## ప్రాజెక్టు అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపికి జీవనాడి పోలవరం ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి ఎట్టి పరిస్థితుల్లోను పూర్తి చేసి తీరుతామని సిఎం చంద్రబాబు అన్నారు. దానికంటే ముందే ప్రాజెక్టుకోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 2026 నాటికి పునరావాసం పూర్తి చేయాలని సంకల్పంతో ముందుకెళ్తున్నామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు వదలకముందే నిర్వాసితు లందరికీ పునరావాసం పూర్తి చేస్తామని తెలిపారు. పోలవరం అంశంపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి, 2026 డిసెంబర్‌కే పునరావాసం కల్పించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కూటమి ప్రభుత్వం వచ్చాక పరుగులుపెడుతోంది. సవాళ్లను దాటుకొని ముందడుగు వేస్తోంది. 9నెలల కాలంలోనే ప్రాజెక్టు మొత్తం మీద 6.11 శాతం పనులు జరిగాయి. జగన్ హయాం ఐదేళ్లలో మాత్రం 11.58 శాతం పనులు మాత్రమే చేశారు.

కూటమి ప్రభుత్వంలో 9 నెలల్లోనే అందులో సగంపనులు పూర్తి చేసింది. ప్రధాన డ్యాంలో 3.80 శాతం భూసేకరణ, పునరావాసానికి సంబంధించి 2.56 శాతం మేర పురోగతి కనిపిస్తోంది. కూటమిప్రభుత్వవచ్చాక పోలవరం ప్రాజెక్టు సమస్యలకు పరిష్కారాలు దొరుకుతున్నాయి. కేంద్ర జల్‌శక్తి, కేంద్ర జలసంఘం కలిపి విదేశీ నిపుణుల కమిటీని నియమించగా, దేశ, విదేశాలకు చెందిన నిపుణులు వచ్చి ప్రాజెక్టును సందర్శించారు. మేధోమథనం చేసి, ఎలా ముందుకు వెళ్లాలన్నఅంశాలను కొలిక్కితీసుకొచ్చారు. ఈ క్రమంలో కొత్తగా డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభమైంది. ఈ ఏడాది జనవరిలో డీ వాల్ నిర్మాణం ప్రారంభించారు. మొత్తం 13 వందల 96 మీటర్లమేర దీన్ని నిర్మించాల్సి ఉంది. ఇంత >>2



# రెండు రోజులు ఉష్ణోగ్రతలు తగ్గుదల!

**విజయవాడ,మార్చి31.ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి ఎండలతో ఇబ్బంది పడుతున్న ఎపి ప్రజలకు మంగళ, బుధవారాల్లో కొంత ఊరట కలగనుంది. మంగళ, బుధవారాల్లో ఉష్ణోగ్రతలు తగ్గి, చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండు రోజులు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం కూడా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు భారత వాతావరణశాఖ తెలిపిన సమాచారాన్ని అనుసరించి. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి దక్షిణ తమిళ నాడు వరకు ఉన్న ద్రోణి సోమవారం దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి మధ్య మహారాష్ట్ర, అంతర్గత విదర్భ మీదుగా మరట్వాడ ప్రాంతంపై నున్న ఉపరితల ఆవర్తనం వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి కొనసాగుతోంది. ఉత్తర దక్షిణ ద్రోణి మరట్వాడ ప్రాంతముపై నున్న ఉపరితల ఆవర్తనంనుండి ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 నుండి 1.5 కి.మీ ఎత్తులో విస్తరించిఉన్నది. ఆగ్నేయ బంగాళా ఖాతంలో నున్న ఉపరితల ఆవర్తనం ఈరోజు నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో విస్తరించి ఉన్నది నిన్నటి దక్షిణ తమిళనాడు పరిసరాల్లో ఉన్న ఈరోజు తక్కువగా గుర్తించబడినది.

ఈ కారణంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్. సమీపంలోని యానాంలో ఈరోజు సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఉరుములతో కూడిన జల్లులు పడ్డాయి. ఒకటి లేదా రెండు చోట్ల ఇదే పరిస్థితి ఏర్పడింది. రాత్రికి ఉరుములతో కూడిన మెరుపులు బలమైన ఈదురు గాలులు గంటకు 30- 40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. ఈ రోజు నిన్నటితో మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో >>2

## కాకాణి అరెస్టుకు అంతా సిద్ధం

### వైఎస్సార్సీ శ్రేణుల్లో ఉత్కంఠ



**పొదలకూరు (నెల్లూరు), మార్చి 31, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా వైఎస్సార్సీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని ఎట్టకేలకు అరెస్టు చేసేందుకు రంగం సిద్ధమైనట్టు విశ్వసనీయంగా అందుతున్న సమచారం. గత వారం రోజులనుంచి కాకాణి అరెస్టుకు పుకార్లు, షికార్లు చేశాయి. ఈ నేపథ్యంలో వైసిపి శ్రేణులు కాకాణి నివాసం వద్దకు భారీ ఎత్తున చేరుకుని కాకాణి నివాసం చుట్టూ మొహరించారు. విషయం పసిగట్టిన కాకాణి ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. బెయిల్ విచారణ వాయిదా పడడంతో ఈ సమయంలో కాకాణి అరెస్టుచేయాలని పోలీసు యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన రంగం సిద్ధం చేసింది. గత రెండు రోజుల క్రితం కాకాణి గోవర్ధన్ రెడ్డి హైదరాబాద్‌కు తన కుటుంబ సభ్యులను కలిసేందుకు వెళ్లి ఉగాది పర్వదినాన్ని ఆయన నివాసంలో చేసుకుంటూ అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు >>2

# వైజాగ్ 'ఉక్కు' బలోపేతం

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమగ్ర కార్యాచరణ

## సిఎం చంద్రబాబుతో చర్చలు జరిపిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

## ఎస్‌పిఎఫ్‌తో స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక భద్రత

**విజయవాడ, మార్చి 31.ప్రభాతవార్తప్రతినిధి:** వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నాయి. ఈ మేరకు భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సోమవారం ఉండవల్లిలోని ముఖ్య మంత్రి నివాసంలో చర్చలు జరిపింది. కేంద్రంలోని ఎన్డీఎ ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి ప్యాకేజీని మంజూరు చేసిన తర్వాత తదనంతర పరిణామాలపైనా, తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రధానంగా చర్చజరిగింది. సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ప్రత్యేక రక్షణదళం (ఎస్పీఎఫ్)తో ప్లాంట్‌కు భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు స్టీల్ ప్లాంట్ పురోగతిని క్రమంతప్పకుండా సమీక్షించడం, ప్రస్తుతం పనిచేస్తున్న 2 బ్లాస్ట్ ఫర్నేసులతో పాటు, 3వ ఫర్నేస్‌ను కూడా తిరిగి ప్రారంభించడం వంటి అంశాలను ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌తో తమ రాష్ట్రానికి భావోద్వేగ అనుబంధం ఉందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. స్టీల్ ప్లాంట్ బలోపేతం చేసేందుకు తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, ఆర్థిక సాయం ప్రకటించినందుకు ప్రధాని నరేంద్రమోడీకి, కేంద్రానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమన్వయంతో కలిసి పనిచేయాలని, ఉక్కు కర్మాగారానికి తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలని చెప్పారు.

ఇందుకు అవసరమైన సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిర్వహణ వ్యయం తగ్గించుకోవడంతో సమర్థత, సామర్థ్యం పెంచుకోకపోతే ఆశించిన ఫలితాలురావని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర, ఎన్ఎండీ సిఎండీ అమితవముఖర్జీ, ఆర్ఐఎన్ఎల్ ఇన్చార్జ్ సిఎండీ అజిత్ కుమార్ సక్సేనా, మెకాన్ సీఎండీ ఎస్కె వర్మ, ఎంఎస్‌టిసి లిమిటెడ్ సిఎండీ మనోబేంద్ర ఘోషల్ పాల్గొన్నారు.



సోమవారం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో చర్చలు జరుపుతున్న సిఎం చంద్రబాబు

## ఆరు జిల్లాలలో 51 కరవు మండలాలు

### - ప్రభుత్వం వెల్లడి


**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరువు ప్రభావిత మండలాలను ప్రకటించింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా 6 జిల్లాల పరిధిలో 51 కరువు ప్రభావిత మండలాలు గుర్తించామని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఈ 51 కరువు ప్రభావిత మండలాలను ఉన్నట్టు పేర్కొన్నారు.. డ్రౌట్ మేనేజ్మెంట్ మాన్యువల్ ప్రకారం, రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు.

ప్రభుత్వం వేసవి తీవ్రతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోందని, అవసరమైన నిధులు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

## సిఎం చంద్రబాబు ఆలోచనలు అద్భుతం

### - ఆనంద్ మహీంద్ర



**విజయవాడ మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు అద్భుతంగా ఉంటాయని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర అన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. అరకు కేఫ్‌లు విస్తరిస్తున్న తీరును చూసి ఆయన సంతోషిస్తారని పేర్కొన్నారు. పారిస్ కేఫ్‌ల్లోని ఎలక్ట్రానిక్ స్క్రీన్లపై అరకులోని గిరిజనుల జీవనశైలికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఇక్కడి కాఫీ ప్యాకేజింగ్ గిరిజనుల వేషధారణ, భారతదేశం >>2

# మరో భారీ ఎన్‌కౌంటర్

## దండకారణ్య సబ్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక మృతి

### ఈమెపై 45 లక్షల రివార్డు, స్వస్థలం తెలంగాణలోని కడవెండి గ్రామం



రేణుక (ఫైల్)

**చర్ల, మార్చి 31, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులపై భద్రతా బలగాలు విరుచుకు పడుతున్నాయి. భద్రాతా బలగాలు మావో అగ్ర నేతలే లక్ష్యంగా చేసుకొని విస్తృత కూబింబ్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో వరస ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. ఈ ఎన్ కౌంటర్లలో మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరుగా నేలకొరుగుతున్నారు..గడిచిన మూడు నెలల వ్యవధిలో కేంద్ర కమిటీ సభ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులతోపాటు డివిజన్ కమిటీ సభ్యులు మృత్యువాత పడ్డారు. అబూజ్ మఢ్ దండకారణ్య లక్ష్యంగా చేసుకొని భద్రతా బలగాలు ముందుకు సాగుతుండటంలో ఆ ప్రాంతం యుద్ధవాతావరణాన్ని తలపిస్తుంది. భద్రతా బలగాలు దూకుడుకు మావోలు ఏం చెయ్యాలో పాలుపోని స్థితిలో సేఫ్‌గా తలదాకుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను నిఘా వర్గాలు పసిగట్టి అదిశగా అడుగులు వేస్తుండటంలో ఎన్‌కౌంటర్లు చోటుచేసుకుంటున్నారు. తాజాగా మావోయిస్టు అగ్రనాయకురాలు రేణుక మృతిచెందడం పార్టీ మరో అగ్రనాయకురాలిని కోల్పోయింది. దంతెవాడ బీజాపూర్ సరిహద్దులోని గీదం భైరంఘడ్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని నెల్గోడ ఆకేలి బెల్నార్ అటవి ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారని నీఘా వర్గాల సమాచారం మేరకు డిఆర్జీ సిఆర్పీఎఫ్ సోమవారం బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోలస్థావరాన్ని గుర్తించిన భద్రతా బలగాలు కాల్పులు జరపారు. భద్రతా బలగాల కాల్పులనుండి తేరుకున్నమావోలు విధిగా కాల్పులు జరపడంతో ఇరువురి మధ్య ఎదురుకాల్పులు పెద్ద ఎత్తున జరిగాయి. ఈ ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్ర నాయకురాలు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక >>2

## విజయవాడ -హైదరాబాద్ 65వ జాతీయ రహదారిపై

# టోల్ టాక్స్ తగ్గింపు

## నేటినుంచి అమలు



**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ -హైదరాబాద్ మార్గంలోని 65 జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలకు టోల్ ట్యాక్స్ తగ్గిస్తూ ఎన్‌హెచ్‌ఎఐ నిర్ణయం తీసుకుంది. తగ్గిన టోల్‌ట్యాక్స్ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుంది. హైదరాబాద్-విజయవాడ మార్గానికి సంబంధించి తెలంగాణలోని చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ సమీపంలోని చిల్లకల్లు టోల్ ప్లాజాల ద్వారా ప్రస్తుతం టోల్ ట్యాక్స్ వసూలు చేస్తు >>2

## శ్రీవారి ఆలయంలో కుర్చీలు వదలని

# అన్యమతస్థులు

## ఇంకా అదే స్థానాల్లో కొనసాగింపు!

### టిటిడిలో సిఎం ఆదేశాలు అమలయ్యేదెన్నడో?



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంతోబాటు తిరుమల శ్రీవారి ఆలయంలో హిందూ ఉద్యోగులు మాత్రమే ఉండాలని, ఇతర మతస్థులు ఉండటానికి వీలులేదని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేసి పదిరోజులు కావస్తున్నా ఆ దిశగా తీసుకున్న చర్యలు మచ్చుకైనా లేదని ఉద్యోగులు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఇతర మతస్థులు టిటిడిలో ఉద్యోగులుగా ఉండటానికి వీలులేదని, అలాంటి వ్యవస్థ కొనసాగడానికి అవకాశం ఉండదని సూచించారు. అన్యమతస్థులను గుర్తించి వారిని ఇతర శాఖలకు బదిలీ చేయడమో. లేక విఆర్ఎస్ ఇవ్వడమా అనేది చూడాలని సిఎం ఆదేశించినా టిటిడి అధికారులు ఆచరణలో పెట్టలేదనేది హిందూ ఉద్యోగుల వాదన. ఇప్పటికీ అన్యమతస్థులుగా ముద్రపడిన అధికారులు, ఉద్యోగులు యధాతథంగా ఆయా కుర్చీల్లోనే కొనసాగుతున్నారని చెబుతున్నారు. గతనెల 21వతేదీ తిరుమల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా క్రైస్తవులు, ముస్లింలు ఆయా సంస్థల్లో,ఆయా మతాలకు సంబంధించిన కార్యాలయాల్లో వారే పని చేస్తున్నారని, ఇతర మతస్థులను అనుమతించరనేది వివరించారు. మరీ అలాంటిది ప్రపంచ ప్రసిద్ధి చెందిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్యమతస్థులు వివిధ కేడర్‌లలో ఇంకా పనిచేస్తున్నారు.వారి సేవలను టిటిడి వినియోగించుకొంటుండటం కొసమెరుపు.

ఏడుకొండలవెంకన్న చెంత కొలువులో ఉంటూ భక్తులు సమర్పించే కానుకలతో గోవిందుని సేవ చేయాల్సిన ఉద్యోగులు ఇతర మతాల ఆచారాలు పాటిస్తూ లక్షలాదిరూపాయలు వేతనాలు తీసుకుంటుండటం విశేషం.దీనిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసిన టిటిడి పాలకమండలి రాష్ట్ర దేవాదాయ శాఖ చట్టం 1060, 24-10-1989 ప్రకారం హిందుమత సాంప్రదాయాన్ని అనుసరిస్తామని ప్రమాణం చేసి టిటిడిలో ఉద్యోగం పొందిన తరువాత కూడా నిబంధనలకు విరుద్ధంగా, దేవుని పవిత్రతను దెబ్బతీస్తున్న కొందరు ఉద్యోగులను గుర్తించి, అలాంటి అన్యమతస్థులు వారికి ఇష్టమైన మతాన్ని, ఆ దేవుడ్ని ప్రార్థించడం ఏంటనేది తిరుపతిలో గుప్పుమంటున్న విషయం.

ఈ అంశంపై టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు తొలిరోజునుండే తీవ్రంగా పరిగణించి వారిని సాగనంపుతామని ప్రకటించారు. ఐదు నెలలు పాలకమండలి పదవీకాలం పూర్తయినా అన్య మతస్థులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. టిటిడిలో ప్రస్తుతం 6,800పైచిలుకు వరకు శాశ్వతఉద్యోగులుమాత్రమే కొనసాగు >>2

## కొడాలి నాని ముంబయికి తరలింపు

### మెరుగైన చికిత్స అందించేందుకు ఏర్పాట్లు



**విజయవాడ, మార్చి 31. పభాత వార్త ప్రతినిధి:** మాజీ మంత్రి, వైఎస్సార్సీ నేత కొడాలి నానిని మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలించారు. కొద్దిరోజుల క్రితం కొడాలి నాని తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. గత ఐదు రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతు >>2

## పులిగడ్డ వారధివద్ద

# కారు, లారీ ఢీ

### ముగ్గురు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అవనిగడ్డ మండలం పులిగడ్డ పెనుమూడి వారధి సమీపంలో ఎదురువస్తున్న లారీని కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో పసికందు సహా ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతుల్లో ఒకరు తెనాలికి చెందిన జీఆర్ మోహన్ బాబుగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులను అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వారిని మెరుగైన వైద్య కోసం మచిలీపట్నం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



సోమవారం హిస్సార్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న హర్యానా సిఎం నయాబ్‌సింగ్ సూనీ

# భారత్‌పై నోరుపారేసుకున్న బంగ్లా చీఫ్ యూనస్!

**బీజింగ్, మార్చి 31:** బంగ్లాదేశ్ తాత్కాలిక పాలకుడు మహమ్మద్ యూనస్ చైనా పర్యటనలో భారత్‌పై నోరుపారేసుకున్నారు. ఈశాన్య భారతదేశంలోని ఏడు రాష్ట్రాలు భూపరివేష్టిత ప్రాంతాలని, బంగ్లాదేశ్ మాత్రమే సముద్రానికి సంరక్షకురాలు అని పేర్కొంటూ, తమ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టాలని చైనాను ఆహ్వానించారు. యూనస్ వ్యాఖ్యలు భారత రాజకీయ, రక్షణ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. యూనస్ మాట్లాడుతూ, "భారతదేశంలోని ఈశాన్యంలో ఉన్న ఏడు రాష్ట్రాలకు సముద్ర మార్గం లేదు. ఈ ప్రాంతానికి బంగ్లాదేశ్ మాత్రమే సముద్ర సంరక్షకురాలు. కాబట్టి ఇది చైనా ఆర్థిక వ్యవస్థకు విస్తరణగా ఉపయోగపడుతుంది. ఇక్కడ వస్తువులు తయారు చేసి, చైనాకు తరలించవచ్చు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేయవచ్చు అని అన్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ యూనస్ వ్యాఖ్యలపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చైనా పర్యటనలో యూనస్ అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. తీస్తా నదీజలాల నిర్వహణతో సహా నదీ జలాల నిర్వహణ కోసం 50 సంవత్సరాల మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని చైనాను కోరారు. బంగ్లాదేశ్, చైనా, యార్లంగ్ జాంగ్బో జమునా నదిపై జల సమాచార మార్పిడికి సంబంధించిన అవగాహన ఒప్పందంపై చర్చలు జరిపాయి. మొంగ్లా పోర్ట్ ఫెసిలిటీస్ మోడరనైజేషన్ అండ్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్‌లో పాల్గొనడానికి చైనా కంపెనీలను బంగ్లాదేశ్ ఆహ్వానించింది. చిట్టగాంగ్‌లోని చైనా ఎకనామిక్ అండ్ ఇండస్ట్రియల్ జోన్‌ను అభివృద్ధి చేయడానికి చైనాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

## నేపాల్‌లో రాజరిక వ్యవస్థకోసం తీవ్రస్థాయి ఉద్యమం!

**ఖాట్మండు, మార్చి 31:** హిమాలయదేశంలో రాచరిక వ్యవస్థనుప్రవేశపెట్టాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలోనే ఆందోళనలు కూడా రానురాను హింసాత్మకంగా మారుతున్నాయి. హోంమంత్రిత్వశాఖ భద్రతా అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి ఈ హింసాత్మక వాతావరణానికి నేపాల్‌మాజీ రాజు జ్ఞానేంద్ర షాయేకారణమని ఆరోపిస్తూ ఆయన్ను అరెస్టుచేసేందుకు ప్రభుత్వ యాంత్రాంగాన్ని సిద్ధంచేసారు. అంతేకాకుండా నేపాల్ రాజుకు భారీ జరిమానా కూడా విధించారు. ఖాట్మండులోని పలుప్రాంతాల్లో రాచరిక మద్దతుదారులుభద్రతా దళాల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగాయి. నిరసనకారులు బారికేడ్లను బద్దలుకొట్టేందుకు యత్నించారు. దీనితో భద్రతా దళాలు టియర్‌గ్యాస్‌ప్రయోగించాయి.

ఆందోళన కారులు వాణిజ్య సముదాయం, రాజకీయ పార్టీ కేంద్ర కార్యాలయం, ఒక మీడియా హౌస్‌భవనానికి నిప్పుఉపెట్టారు. ఈ ఘటనల్లో 12 మందిపోలీసులు కూడా గాయపడ్డారు. నేపాల్‌ప్రధాని కెపిశర్మ ఓలి నిర్వహించిన అత్యవసర సమీక్షలో మాజీరాజు జ్ఞానేంద్రషాను బాధ్యుడని తేల్చి ఆయన్ను అరెస్టుచేయాలన్న నిర్ణయానికి వచ్చారు. ఖాట్మండులో జరిగిన హింసాయుత ఘటనల కారణంగా త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా మూసివేసారు. రానురాను ఈ ఉద్రిక్తతలుపెరిగిపోయాయి. ఈ ఘర్షణల్లోనే 112 మంది గాయపడ్డారు. 2008లో రాచరిక వ్యవస్థను రద్దుచేసి నేపాల్‌లో లౌకిక సమాఖ్య ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. ఇటీవలికాలంలో రాచరిక పునరుద్ధరణ డిమాండ్‌పెరుగుతూ వస్తోంది. అవినీతి, ఆర్థిక అస్థిరత, తరచూ ప్రభుత్వాలు మారడంపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోంది. ఫిబ్రవరి 19న ప్రజా స్వామ్య దినోత్సవం సందర్భంగా మాజీరాజు జ్ఞానేంద్రషా తన ప్రసంగంలో దేశప్రజలనుంచి మద్దతును కోరినప్పటినుంచి ఈ అల్లర్లుపెరిగాయి. ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చింది. అయితే 2008 నుంచి రాజరికం రద్దయిన తర్వాతనేపాల్‌లో 13 ప్రభుత్వాలు మారినా రాజకీయ స్థిరత్వం రాలేదు.

## ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో రామరాజ్యం..

# నేడు రాష్ట్రంలో రావణకాష్టం

### - మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ విమర్శ

**అనంతపురం, మార్చి 31 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రామరాజ్యంగా రాష్ట్రాన్ని పాలిస్తే నేడు కూటమి పాలనలో రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చారని, మాజీ ఎంపి, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ విమర్శించారు. రాప్తాడు నియోజకవర్గంలో హత్యకు గురైన కురుబ లింగమయ్య మృతదేహాన్ని నివాళులు అర్పించి బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. సిఐలు రాజేంద్రనాథ్ యాదవ్, సాయినాథ్‌ల ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం గోరంట్ల మాధవ్ నివాసానికి చేరుకుని ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. కురుబ లింగమయ్య, మృతదేహం వద్దకు వెళ్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని సహకరించాలని పోలీసులు మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను కోరారు. అయితే తమ కులస్తుడు, పార్టీ నాయకుడు కురుబ లింగమయ్య మృతదేహాన్ని చూసేందుకు అవకాశం ఇవ్వాలని మీతోపాటు తీసుకెళ్లి పూలమాల వేసి వస్తానని పోలీసులను మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ కోరినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతించడం లేదని పోలీసులు పేర్కొనడంతో ఒకానొక దశలో గోడ దూకి వెళ్లేందుకు గోరంట్ల మాధవ్ ప్రయత్నించగా పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గోరంట్ల మాధవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కురుబ లింగమయ్యను దారుణంగా హత్య చేశారని, మృతదేహాన్ని చూసి పూలమాలలు వేయడానికి కూడా వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, దోపిడీలు, దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. హత్యలు, మానభంగాలు, దౌర్జన్యాలు, దాడులు నిత్యకృత్య మయ్యాయని, ఆరోపించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో రాప్తాడు నియోజకవర్గంలో బిసిలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు, హత్యలు అధికమయ్యాయని విమర్శించారు. ఆత్మకూరు మండలంలో కురుబ బాలన్నపై సునీత బంధువులు దాడి చేశారని,రామగిరిలో లాయర్ నాగిరెడ్డిపై దాడి చేశారని, కురుబ లింగమయ్యను హత్య చేశారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో గతంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శాంతి భద్రతలను కాపాడారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని రెడ్ బుక్ రాజ్యాంగంతో పరిపాలన కొనసాగిస్తే రానున్న రోజుల్లో వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. పోలీసులు కూడా చట్టవిరుద్ధంగా వ్యవహరించ వద్దని సూచించారు.

# టోల్ టాక్స్ తగ్గింపు

>> న్నారు. వీటిల్లో అత్యధికంగా పంతంగి టోల్ ప్లాజా వద్ద కార్లు, జీపులు, వ్యాన్‌లకు ఒక వైపు ప్రయాణానికి రూ.15, ఇరువైపులా కలిపి రూ.30, తేలికపాటి ట్రాన్స్‌పోర్టు వాహనాలకు అయితే ఒక వైపు ప్రయాణానికి రూ.25, ఇరువైపులా కలిపి రూ.40, బస్సు, ట్రక్కులకు ఒక వైపు ప్రయాణానికి రూ.50, ఇరువైపులా కలిపి రూ.75 వరకు తగ్గించినట్లు ఎన్‌హెచ్‌ఏఐ పేర్కొంది. అటు ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద అన్ని వాహనాలకు కలిపి ఒక వైపునకు రూ.5, ఇరువైపులా కలిపి రూ.10 చొప్పున మాత్రమే తగ్గించారు. 24 గంటలలోపు తిరుగు ప్రయాణం చేస్తే అన్ని రకాల వాహనాలకు టోల్ రుసుములో 25 శాతం మినహాయింపు లభిస్తుందని ఎన్‌హెచ్‌ఏ ప్రకటించింది. తగ్గించిన టోల్ ట్యాక్స్‌లు ఏడాది పాటు అనగా.. 2026 మార్చి 31 వరకు అమల్లో ఉంటాయి. టోల్ వసూలు చేపడుతోంది. గతేడాది జులై 1 నుంచి టోల్ వసూళ్లు ఎన్‌హెచ్‌ఏఐ చేతికి వెళ్లాయి. అంతకుముందు వరకు కూడా జీఎమ్మార్ సంస్థ టోల్ వసూలు చేసేది. 2024, జులై 1 నుంచి ఈ బాధ్యతను ఎన్‌హెచ్‌ఏఐ తీసుకుని..ఏజెన్సీల ద్వారా గతంలో జీఎమ్మార్ సంస్థ ఉన్నప్పుడు ఏడాదికోసారి టోల్ ట్యాక్స్‌లను పెంచుకునేందుకు ఒప్పందం ఉండేది. ఇప్పుడు టోల్ ట్యాక్స్ వసూలు బాధ్యత ఎన్‌హెచ్‌ఏఐ చేతికి రావడంతో.. ఆ సంస్థ టోల్ రుసుములను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది.

# వడివడిగా 'పోలవరం'

>> వరకు 158.20 మీటర్ల మేర పనులు చేపట్టారు. పోలవరంలో ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు నిర్మించినా వాటి సీపేజీ వల్ల ప్రధాన డ్యాం ప్రాంతంలో నీరు నిండిపోతోంది. ఈ సమస్యతో పనులు చేయడం సవాల్‌గా మారింది. వర్షాలకు ముందు ఏప్రిల్, మే, జూన్ నెలల వరకు ప్రాజెక్టు పనులు వేగంగా చేసేందుకు ఆస్కారం ఉంటుంది. జులై నుంచి గోదావరిలో వరదలు ప్రారంభమవుతాయి. దీంతో ఎగువ కాఫర్ డ్యాం సీపేజీని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకే కొత్తగా బట్రస్ డ్యాం నిర్మాణాన్ని ప్రారంభించారు. దాదాపు 82 కోట్ల విలువతో ఈ పనులు చేపట్టారు. వర్షాకాలంలోపు ఈ కట్టడాన్ని పూర్తిచేయాలి. బట్రస్ డ్యాం నిర్మిస్తే ఎగువ కాఫర్ డ్యాం పునాదుల నుంచి వచ్చే సీపేజిని నియంత్రించొచ్చనేది వ్యూహం. డయాఫ్రం వాల్ నిర్మాణానికి సీపేజి జలాలు ఆటంకం కలగకుండా ప్లాట్‌ఫాం నిర్మిస్తున్నారు. ఆ ప్లాట్‌ఫాంపై మిషనరీ ఉంచి పనులను కొనసాగిస్తారు. వరదల సమయంలోనూ పనులు కొనసాగిస్తూ ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు.

**వచ్చే యేడాది జూన్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యం:**

డయాఫ్రం వాల్ పూర్తయిన తర్వాత ప్రధాన రాతి, మట్టికట్ట నిర్మించాల్సి ఉంటుంది. డీ వాల్ నిర్మాణం కొంత పూర్తయిన వెంటనే గ్యాప్2 ప్రధాన డ్యాం నిర్మించాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం గ్యాప్1 ప్రధాన డ్యాం నిర్మాణ ఆకృతులను సమర్పిస్తున్నారు. దీనికి అవసరమైన మట్టి, రాతి మెటీరియల్ సిద్ధం చేశారు. ఏప్రిల్ రెండో వారంలోనే మొదటి గ్యాప్ ప్రధాన డ్యాం పనులు ప్రారంభించి, 2026 మార్చికి పూర్తి చేయాలనేది లక్ష్యం. గ్యాప్2 ప్రధాన డ్యాం నిర్మాణం డీ వాల్ నిర్మాణంపై ఆధారపడి ఉండటంతో, ప్రధాన డ్యాం పనులు 2025 నవంబరు నుంచి ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. అందుకు తగిన పరీక్షలు, విశ్లేషణలు పూర్తి చేస్తున్నారు. వీటితోపాటు కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులూ పట్టాలకెక్కించారు. వీటిని వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించారు.

గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తాం. ఎపికి జీవనాడి పోలవరం ప్రాజెక్టును డిసెంబర్ 2019లోనూ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే 2020కి ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగిపోయిందనీ స్పష్టం చేశారు. రూ.400 కోట్లతో కట్టిన డయాఫ్రం వాల్ వైఎస్సార్సీ నిర్లక్ష్యం వల్ల కొట్టుకు పోయిందని అన్నారు. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నామని అన్నారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారని సిఎం ఆక్షేపించారు. మొదటి దశ లో 41.15 కాంటూరు వరకూ నిర్వాసితుల పరిహారం, కాలనీల నిర్మాణం కోసం రూ.6270 కోట్ల మేర వ్యయం అవుతుందని అన్నారు. రెండో దశ 45.72 మీటర్ల ఎత్తు వరకు నిర్వాసితులను కూడా గుర్తించే ప్రక్రియ కూడా పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు కూటమి సర్కారు 900 కోట్లకు పైగా పరిహారం చెల్లించి, తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు.. పునరావాస కాలనీలను నిర్మించే కాంట్రాక్టర్లుకు కూ. 216 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో కాలనీల నిర్మాణ పనులు, 45.72 కాంటూరు పరిధిలోని నిర్వాసితుల పరిహారం అందిస్తోందన్నారు.గత ప్రభుత్వ హయాంలో పోలవరం విధ్వంసం జరిగినా కేంద్ర సహకారంతో దీనిని పూర్తి చేస్తామని విశ్వాసం కలిగిందని సీఎం అన్నారు. 2019లో అధికారం మారి పోయి ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించే అవకాశం పోయిందని అన్నారు. ఇప్పుడు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తి చేసే అవకాశం తనకే వచ్చిందని సీఎం వ్యాఖ్యానించారు. ఏటా సముద్రంలోకి వృథాగా పోతున్న 2 వేల టీఎంసీల నీటిలో 400 టీఎంసీల ను వాడుకున్నా రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని సీఎం అన్నారు. వైఎస్సార్సీ హయాంలో జరిగిన విధ్వంసం క్షమించరాని నేరమని అన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రజల ఆస్తిని నష్టపరిచే హక్కు ఎవరికీ లేదని అన్నారు.

## తీరప్రాంతంలో ఆఫ్‌షోర్ మైనింగ్

# పర్యావరణ విఘాతమే

### ప్రధానిమోడీకి రాహుల్‌గాంధీ లేఖ

**న్యూఢిల్లీ, మార్చి 31:** దేశంలోని కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల తీరప్రాంలో ఆఫ్‌షోర్ మైనింగ్‌కు అనుమతి ఇచ్చే టెండర్లను రద్దుచేయాలనికోరుతూ లోక్‌సభలోప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీప్రధాని నరేంద్రమోడీకి లేఖరాసారు. సముద్రజీవులకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొంటూ ఈప్రభావాన్ని పూర్తిగా అంచనావేయకుండాప్రైవేటు ఏజెన్సీలకు ఆఫ్‌షోర్‌మైనింగ్ బ్లాక్‌లు ఇవ్వడం ఆందోళన కరమని అన్నారు. కేరళ, గుజరాత్ అండమాన్ నికోబార్‌తీరప్రాంతాల్లో ఆఫ్‌షోర్‌మైనింగ్‌కు అనుమతులు ఇవ్వాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయం తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాహుల్ తన లేఖలో వివరించారు. పర్యావరణ ప్రభావాన్ని అంచనావేయకుండా ఆఫ్‌షోర్ మైనింగ్ టైండర్లు కోరిన విధానం పునరాలోచన చేయాలని, లక్షలాదిమంది మత్స్యకారులు, తమ జీవనోపాధి, జీవన విదానంపై దాని ప్రభావం గురించి ఇపుడు ఆందోళనలో పడ్డారని రాహుల్ అన్నారు.

పర్యావరణ అధ్యయనం లేకుండా ఇలా అనుమతిలివ్వడం చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు. తీరప్రాంతంలో మైనింగ్‌కు ఇస్తే సముద్రతీరాలు మొత్తంకోతకు గురవుతాయని, పర్యావరణానికి నష్టం కలిగి అంతులేని నష్టం కలుగుతుందని రాహుల్ వివరించారు. శాస్త్రీయ అధ్యయనం అంచనాలు లేకుండా ఇలాంటి కార్యకలాపాలకు అనుమతినివ్వడం ఎంతమాత్రం తగదని వెంటనే ఆ టెండర్లను రద్దుచేయాలని ఆయన తన లేఖలో కోరారు. ఆఫ్‌షోర్‌మైనింగ్‌వల్ల కలిగే అనర్థాలపై అంచనావేసేందుకు కఠినమైన శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహించాలనిపిలుపునిచ్చారు. తీరప్రాంత మత్స్యకారుల జీవితాలు మహాసముద్రాలతో ముడిపడి ఉన్నాయని, అందరికీ స్థిరమైన భవిష్యత్తును అందించేందుకు సమిష్టిగా పనిచేసేందుకు ముందుకురావాలని రాహుల్ ప్రధానికి రాసిన లేఖలో విజ్ఞప్తిచేసారు.

## సిఎం చంద్రబాబు ఆలోచనలు అద్భుతం

>> లోని వైవిధ్యమైన రంగుల స్ఫూర్తితో రూపొందించినట్లు వివరించారు. మరోవైపు ఈ నెల 29న కూడా ఆనంద్ మహీంద్రా ఎక్స్‌లో ఆసక్తికర పోస్టు పెట్టారు. పారిస్‌లో మా రెండో అరకు కాఫీ స్టాల్ అంటూ వీడియో పెట్టారు. దీనిపై సిఎం చంద్రబాబు స్పందించారు. పచ్చని అరకులోయ నుంచి పారిస్ నడిబొడ్డుకు మేడ ఇన్ ఎపి ఉత్పత్తి చేరడం, ప్రపంచవ్యాప్తంగా తగిన గుర్తింపు లభించడం స్ఫూర్తిదాయకమని సిఎం పేర్కొన్నారు.

## ఉష్ణోగ్రతలు తగ్గుదల!

>> కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.ఉరుముతో కూడిన మెరుపులు మరియు బలమైన ఈదురు గాలులు గంటకు 3040 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ తగ్గే అవకాశముంది. బుధవారం రోజున తేలికపాటి నుండిఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశ ముంది.

## నోబెల్ శాంతి బహుమతికి ఇమ్రాన్ నామినేట్

**ఇస్లామాబాద్, మార్చి 31:** ప్రతిష్టాత్మక నోబెల్ శాంతిబహుమతికి పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ నామినేట్ అయ్యారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్యంకోసం చేసిన కృషికి గాను ఆయనకు ఈ నామినేషన్ లభించింది. నార్వేలోని రాజకీయ పార్టీపార్టియట్ సెంట్రం సభ్యులు, పాకిస్థాన్ వరల్డ్ అలయెన్స్ అనే సంస్థతో కలిసి ఈ నామినేషన్‌వేసారు. ఇమ్రాన్‌ఖాన్‌ను నోబెల్‌శాంతిబహుమతికి నామినేట్‌చేయడం గర్వంగా ఉందని పార్టియట్ సెంట్రం సోషల్‌మీడియా ఎక్స్‌లో ప్రకటించింది. దక్షిణాసియాలో శాంతికిచేసిన కృషికిగాను 2019లోనూ నోబెల్ శాంతిబహుమతికి ఇమ్రాన్ నామినేట్ అయ్యారు. నార్వే నోబెల్ కమిటీకి ఏటా వేలాది నామినేషన్లు వసానతయని, ఎనిమిదినెలలసుదీర్ఘ ప్రక్రియ అనంతరం విజేతను కమిటీ ఎంపికచేస్తుం దని దిఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ కథనం రాసింది.

## వారం - వర్జ్యం

తేది : 01-04-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల చవితి రా.2.34
భరణి ఉ.11.09
వర్జ్యం రా.10.00-11.27
దు.ఉ.8.31-9.20, 2) రా.11.15-12.05
శుభసమయం : ఉ.6.30-7.10
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** రుణాలు తీరుస్తారు. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** కొత్త కార్యక్రమాలు చేపడతారు. కుటుంబ సమస్యల నుండి బయట పడతారు. ధనవ్యయం.

**మిథునం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**కర్కాటకం:** మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక ఒడిదుడుకులు అధిగమిస్తారు.

**సింహం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**కన్య :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**తుల :** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు వింటారు. సంఘంలో గౌరవం పొందుతారు. ఆధ్యాత్మిక చింతన.

**వృశ్చికం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఆరోగ్య సమస్యల నుండి బయట పడతారు.

**ధనుస్సు:** కుటుంబంలో చికాకులు ఏర్పడిన అధిగమిస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

**మకరం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించు కుంటారు.

**కుంభం:** రుణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**మీనం :** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. అనారోగ్యం, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



రంజాన్ సందర్భంగా సోమవారం కోల్‌కతాలో ముస్లిం సోదరునుద్దేశించి ప్రసంగిస్తున్న సిఎం మమతా బెనర్జీ

## పాక్‌లో ఉగ్రవాదులను ఏరివేస్తున్న అజ్ఞాత శక్తులు!

**కరాచి, మార్చి 31:** పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అక్కడి ఉగ్రవాదులను గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా కాల్చివేస్తున్నారు. భారత వ్యతిరేక ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేస్తున్నారు. ఎప్పుడు ఎవరు వచ్చి కాల్చి చంపుతారో తెలియక భారత్‌ను వ్యతిరేకించే ఉగ్రవాదులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వారు బయటికి రావాలంటేనే హడలిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా కరాచీలో లష్కరే తోయిబా(ఎల్ఈటీ) సంస్థకు ఫైనాన్షియర్‌గా వ్యవహరిస్తున్న ఖాద్రి అబ్దు రెహమాన్‌ను గుర్తుతెలియని వ్యక్తి కాల్చి చంపాడు.ఈ ఘటన పాక్ వాణిజ్య నగరమైన కరాచీలో జరిగింది. రంజాన్ రోజునే జరిగిన ఈ దాడికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. బైక్‌పై వచ్చిన దుండగుడు రెహమాన్ ఒక దుకాణంలో నిలబడి ఉండగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. అబ్దుల్ రెహమాన్ 26/11 ఉగ్రదాడి సూత్రధారి హాఫీస్ సయీద్‌కు సన్నిహితుడు.రెహమాన్ లష్కరే తోయిబా సంస్థకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉంటూ కీలక పాత్ర పోషిస్తున్నట్టు గుర్తించారు. పాకిస్తాన్, భారత్‌లో ఎన్నో దాడులకు ఈ సంస్థ కారణం. కరాచీలో ఉంటూ నిధులు సేకరించే బాధ్యతను రెహమాన్ చూసుకునేవాడు. ఇదిలా ఉండగా, లష్కరే తోయిబా ఉగ్రవాది అబూ ఖతల్ కూడా గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యాడు. అబూ ఖతల్ 2017 రియాసి బాంబు పేలుడు, 2023 జమ్మూ కాశ్మీర్ యాత్రికుల బస్సుపై దాడి ఘటనలో ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు.

# మరో భారీ ఎన్‌కౌంటర్

>> ఆలియాస్ సరస్వతి మృతిచెందినట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు.ఎన్ కౌంటర్ ప్రాంతంలో ఇన్సాస్ రైఫిల్ తోపాటు ఇతర ఆయుధ మందుగుండి సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.2025 మార్చి 31 వరకు 119 మంది మావోయిస్టులు మృతిచెందారని పదుల సంఖ్యలో లొంగుబాట్లు జరిగాయని తెలిపారు.రేణుక ప్రస్థానం..దండకారణ్యంలోని అడవి ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్ కౌంటర్ లో మావోయిస్టు అగ్రనేత దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్మడివెల్లి రేణుక ఆలియాస్ సరస్వతి ఆలియాస్ భాను మృతిచెందింది.ఆమె తండ్రి స్వస్థలం వరంగల్ ప్రస్తుత (జనగామ) జిల్లా దేవరుప్పల్ మండలం కడవెండి గ్రామానికి చెందిన గుమ్మడివెల్లి సమ్మయ్య వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నాడు.సోదరుడు రాజశేఖర్ న్యాయవాదిగా పనిచేస్తూ ఓ స్వచ్ఛంద సంస్థకు లీగల్ అడ్వైజర్ గా పని చేసి ప్రస్తుతం డిల్లీలోని బిబిసి ( తెలుగు )లో జర్నలీస్టుగా పనిచేస్తున్నట్లు సమాచారం.ముగ్గరిలో రేణుక కూడా ఎల్ ఎల్ బి పూర్తిచేసి ( తిరుపతి )లో న్యాయవాది వృత్తి చేస్తూ మగిళా సంఘంలో పనిచేస్తూ ఉద్యమం పట్ల ఆకర్షితురాలై అప్పటి ఇప్పటి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అలిపిరి ఘటన అనంతరం పూర్తిస్థాయిలో ఉద్యమంలోకి వెళ్లింది.1996 లో పార్టీలో చేరిన ఆమె కొంతకాలం మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కృష్ణతో పనిచేసింది. 2003 డివిజన్ కమిటీ సభ్యురాలిగా 2006 సౌత్ బస్తర్ దిదిలీ దుల్లా దాదా ఆలియాస్ ఆనంద్ తో కొంతకాలం పనిచేసి 2013 లో మాఢ్ ఏరియాకు వచ్చి మావో అగ్రనేత రామన్నతో పనిచేసింది. 2020లో కరోనా కారణంగా రామన్న మృతిచెందటంతో దీరీలీద్రిలీ సెంట్రల్ రీజనల్ బ్యూరో ( సిఆర్ బి) ప్రెస్ టీం ఇంచార్జిగా నియమితురాలైంది. నక్సల్స్ సంస్థ తరుపున ప్రకటనలు జారీచేస్తూ ప్రభాత్ పీపుల్స్ మార్చ్ మహిళా మార్గం అవామి పోడియారో పోల్లో ఝుంకార్ సంఘర్షర్ మహిళా పితూరి మిడంగూర్ భూమ్కర్ సందేశ్ వంటి వివిధ పత్రికలను ముద్రించి ప్రచురించింది. ఉద్యమంలో ఉండగా మావోయిస్టు నేత ఎర్రం రెడ్డి సంతోష్ రెడ్డిని వివాహం చేసుకుంది.సంతోష్ రెడ్డి ఎన్ కౌంటర్ లో చనిపోయిన తర్వాత 2005 లో సెంట్రల్ కమిటీ సభ్యుడు శాఖమూరి అప్పారావు ఆలియాస్ రవి రెండవ వివాహం చేసుకుంది.అతను 2010 లో నల్లమల జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందాడు. మావోయిస్టు ఉద్యమంలో 35 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన రేణుక తాజా ఎన్ కౌంటర్ లో మృతిచెందడం మావోయిస్టు పార్టీకి తీరనిలోటనే చెప్పాలి.సోదరుడు జివికె ప్రసాద్ ఆలియాస్ సుఖదేవ్ ( గుడ్సా ఉసెండి ) 2014 లొంగిపోయాడు. కడవెండి గ్రామం అంటేనే రజకార్లకు పెత్తందార్లకు సైతం గుండెల్లో వణుకు పుట్టేది.విప్లవాల ఖిల్లా గా ఉన్న గ్రామం రేణుక మృతితో విషాధ ఛాయలు అలుముకున్నాయి.రేణుక తల్లిదండ్రులు ప్రస్తుతం హైదరాబాద్ లోని నాగారంలో ఉంటున్నట్లు తెలిసింది.కూతురు మరణవార్త విన్న తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు చత్తీస్‌గఢ్ బయలుదేరినట్లు తెలిసింది.మావోయిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన రేణుక మృతిచెందటంతో ఉద్యమ ప్రస్థానానికి నేటితో తెరపడింది.

# కుర్చీలు వదలని అన్యమతస్థులు

>> తున్నారు. వీరిలో 300మంది వరకు అన్యమత ఉద్యోగులు ఉన్నట్లు నివేదికలు అందినా తొలుత 18మంది ఉద్యోగులపై బదిలీ వేటువేస్తున్నట్లు వెల్లడించారు. అయితే చాలావరకు అలాగే కుర్చీల్లోనే కొనసాగుతున్నారనేది ఉద్యోగుల ఆవేదన. తిరుమల హిందూ పుణ్యక్షేత్రం,టిటిడి హిందూ ధార్మికసంస్థ కావడంతో ఇందులో హిందూ మతస్థులైన ఉద్యోగులే ఉండాలనేది ప్రభుత్వం కూడా నిర్ణయించింది. టిటిడిలో అన్యమత ఉద్యోగులపై బదిలీ వేటువేశామని రెండునెలల క్రిందటే తెలిపారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్న వారిని గుర్తించి 69మందితో ఓ జాబితాను కూడా రూపొందించింది. అయినా బదిలీ చేశామని చెబుతున్న టిటిడి అధికారులు వారిని ఎక్కడకు పంపారు అనేది ఇప్పటికీ తెలియని సమాచారం. బదిలీ చేశామని చెప్పిన అధికారులు మార్చి 24న తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశానికి ఓ అన్యమత అధికారి హాజరుకావడం కొసమెరుపు. మరీ ఇలాంటి వారిని సాగనంపడానికి ఇకనైనా కఠినంగా వ్యవహరించాలనేది టిటిడి ఉద్యోగులు కోరుతున్నారు.

# కాకాణి అరెస్టుకు అంతా సిద్ధం

>> వైసిపి సోషియల్ మీడియాలో విడుదల చేశారు. కానీ కాకాణి పరారయ్యారని వార్తల్ని కొన్ని ఛానల్‌లో వందంతులు సృష్టించాయి. ఇదిలా ఉంటే హైదరాబాదులోనైనా ఖచ్చితంగా అరెస్టు చేయాలనే దృఢసంకల్పంతో పోలీసులు ఇందుకు సంబంధించి అన్ని అనుమతులను పొంది కాకాణి అరెస్టు కోసం ప్రయాణమై హైదరాబాద్ చేరినట్టుగా సమాచారం. ఇందుకోసం ముందుగానే కాకాణి నివాసం వద్ద పోలీసులు సోమవారం పోలీస్ విచారణకు హాజరు కావాలని గోడలకు నోటీసులు అంటించారు. ఇదిలా ఉంటే సోమవారం అర్ధరాత్రిలోపు కాకాణిని అరెస్టు చేయాలనే తెలుగుదేశం పార్టీ హై కమాండ్ పట్టుపట్టినట్లు ఈ మేరకు విస్తృతంగా గాలింపులు చేస్తున్నట్లు తెలుస్తుంది. పొదలకూరు మండలం ఇరువురు గ్రామ సమీపంలో రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వారీ తరలించారని నిబంధనలకు విరుద్ధంగా త్రవ్వకాలు చేపట్టారని అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ సామాన్లు భారీగా లభించడంతో ఈ కేసు నమోదైంది. ప్రస్తుతం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి గతంలో మంత్రిగా కాకాణి ఉన్న సమయంలోనే భారీ అవినీతి దోపిడి జరుగుతుందని గగ్గోలు పెట్టారు. తదుపరి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాకాణిని ఈ కేసులో ముద్దాయిగా చేర్చారు. ఈ విషయమై ఇటీవల జిల్లా అంతటా చర్చనీయాంసంగా మారింది. ఏది ఏమైనప్పటికి కాకాణి అరెస్టు కాయమని తెలుస్తుంది.

# కొడాలి నాని ముంబయికి తరలింపు

>> న్నారు. గుండెకు సంబంధించిన సమస్యతో మాజీ మంత్రి బాధపడుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు ఆయనను తీసుకుని ప్రత్యేక విమానంలో ముంబైకు బయలుదేరి వెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలించినట్లు చెబుతున్నప్పటికీ గుండె సంబంధిత వ్యాధితో పాటు ఇతర డిజీస్‌లు కూడా ఆయనకు సోనినట్లు సమాచారం.

హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో జీర్ణకోస సంబంధిత వ్యాధితో అడ్మిట్ అయ్యారు మాజీ మంత్రి. అయితే ఆయనకు గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెకు సంబంధించి మూడు వాల్వ్ పూడుకుపోయినట్లు తెలుస్తోంది. మాజీ సిఎం జగన్.. హైదరాబాద్‌లోని ఆస్పత్రి వైద్యులతో మాట్లాడిన సమయంలో ఈ విషయాన్ని తెలియజేశారు. దీనిపై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ప్రయత్నాలు చేసినప్పటికీ సఫలీకృతం కాకపోవడంతో ఆయనను వెంటనే ఎయిర్ అంబులెన్స్‌లో ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో హైదరాబాద్ నుంచి ముంబైకి తరలించారు.

ఇటీవల వల్లభనేని వంశీని అరెస్ట్ చేసిన సమయంలో విజయవాడ జిల్లా జైలు దగ్గరకు కొడాలి నాని వచ్చారు. ఆరోజు చాలా యాక్టివ్‌గా ఉన్న నాని.. ఆ తరువాత జీర్ణకోస సంబంధిత వ్యాధి ఉందంటూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. అయితే కొడాలి నానిని పూర్తిగా పరీక్షించిన వైద్యులు.. ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. వెంటనే సర్జరీ చేయాలని భావించారు వైద్యులు. అయితే సర్జరీ క్రిటికల్‌గా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ముంబైకి తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో ఆయనను ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. ముంబైలో ఎలాంటి చికిత్స అందజేస్తారనే దానిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శ్రీరామ బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు



సీతారాముల కళ్యాణ వేదిక వద్ద చర్చిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జెఇఒ వీరబ్రహ్మం,ఎస్పి అశోక్ కుమార్, తదితరులు

## ఒంటిమిట్టలో 11న సీతారామకల్యాణం

## నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**రాజంపేట అర్బన్, మార్చి 31 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వ పండుగ ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పక్కా ప్రణాళికతో చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, టిటిడి జేఈవో వీరబ్రహ్మం వెల్లడించారు. నేడు రామాలయంలో కోయిల్ అల్వార్ తిరుమంజనం జరగనున్న నేపథ్యం, ఈనెల 11న సీతారాముల కళ్యాణం కార్యక్రమం, 5 తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా అధికారులు టిటిడి అధికారులు సంయుక్తంగా సోమవారం పరిశీలించారు. శ్రీ సీతారాముల కళ్యాణానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఏప్రిల్ 5వ వ తేదీ నుండి ఏప్రిల్ 15వ తేదీ వరకు శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయన్నారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా ఎప్రిల్ 11వ తేదీన జరిగే సీతారాములవారి కళ్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్నందున.. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆ మేరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా, టీటీడీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులను నిర్వర్తించాలన్నారు. రాములవారి కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు కళ్యాణవేదిక ముందు ఏర్పాటు చేసిన ఒక్కో గ్యాలరీకి ఒకరిని ఇంఛార్జిగా నియమిస్తామన్నారు. ఎక్కడా కూడా జనం తొక్కిసలాట జరుగకుండా అధికారులు, పోలీస్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రసాదం కౌంటర్ల వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిఒక్కరికీ తాగునీరు, అన్న ప్రసాదం కొరత లేకుండా అందేలా చూడాలన్నారు. కళ్యాణవేదిక వద్దకు భక్తులను తీసుకువచ్చేందుకు ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలని టిటిడి జెఈవో కు తెలిపారు. రాత్రి వేళలో కళ్యాణోత్సవం చేస్తున్నందున విద్యుత్ దీపాలంకరణ తో పాటు.. అత్యంత పటిష్ట చర్యలను కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా విద్యుదీకరణ, తోరణాలు, పుష్పాలంకరణ, స్వాగత ఆర్చిలు, ఎల్ఇడి బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపడతామన్నారు. గతంలో నిర్వహించిన శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు, కళ్యాణోత్సవాల అనుభవాలను గుర్తుంచుకొని.. ఎక్కడా, ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా 2000 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ అధికారులు సంపూర్ణ సహకారాలు అందించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా.. ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పార్కింగ్ ప్రదేశాల వద్ద ప్రత్యేక పోలీసు భద్రతా సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. వాహనల ద్వారా వచ్చే భక్తులకు, బస్సుల ద్వారా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

# రాష్ట్రమంతటా ఘనంగా రంజాన్ వేడుకలు



**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లు 2024 కి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలో భాగంగా అనేక ప్రాంతాల్లో నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈద్గాల వద్దకు చేరుకొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వారికి మజ్జిగ పంపిణి చేశారు. మతసామరస్యం వర్ధిల్లాలని, వక్ఫ్ సవరణ బిల్లు 2024ని వ్యతిరేకించాలని, పాలస్తీనాలో గాజాపై యుద్ధాన్ని ఆపాలని నినాదాలు చేశారు. పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నామే రంజాన్ పర్వదినమన్నారు. ప్రతి ఏడాది హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఇక్కడ రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మతసామరస్యాన్ని చాటుకోవడం స్పూర్తిదాయకమన్నారు. 30 రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఉంటారని తెలిపారు. చక్కగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు.

# పాపాల నిష్కృతికి శరణుజొచ్చే అవకాశం ఈదుల్ ఫితర్ :ముఫ్తి నయిం సాహెబ్



జామియా మస్‌జిద్‌లో ప్రార్థనలు జరుపుతున్న దృశ్యం

**శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త** ఈదుల్ ఫితర్ నమాజు అంటే ముస్లిం సోదరులకు పండగ. ఆ రోజు ఊరవతల ఈద్‌గాహ్‌లలో వేలాది మంది సోమవారం భక్తి శ్రద్దలతో ప్రార్థనలు జరుపుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకాళహస్తి పట్టణంలో రెండు, రేణిగుంట మండలంలో ఒకటి, ఏర్పేడుమండలంలోని పాపానాయుడుపేటలో ఒక ఈద్‌గాహ్‌లు ఉన్నాయి. శ్రీకాళహస్తిలోని రెండు ఈద్‌గాహ్‌లకు వేలాది మంది హాజరై ఈదుల్ ఫితర్ ప్రార్థనలు జరుపుకున్నారు. ఈద్‌గాహ్‌లు కళ కళ లాడాయి. నాయకుల పలకరింపులతో పులకరించారు. కన్నీరుమున్నీరుగా ' కష్టాల నుంచి కాపాడు అల్లాహ్ అంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా జామియా మస్‌జిద్ కు సంబంధించి ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో ముఫ్తినయిం సాహెబ్ మాట్లాడుతూ మనిషి తప్పుల చేసే ఓ బొమ్మ అన్నారు. అయితే చేసిన తప్పులను క్షమించి స్వర్గస్తుల్ని చేసే దయాళువు అల్లాహ్ అన్నారు. అందుకు రంజాన్ మాసం ఓ వేదికగా ఏర్పాటు చేసారన్నారు.రంజాన్ మాసాన్ని మూడు భాగాలుగా విభజించి మొదటి పది రోజులు మనకు సిరి సంపదలుప్రసాదించాలని అలాగేమరో పది రోజులు మన తప్పిదాలను క్షమించమని చివరి పది రోజులు నరకూపం నుంచి కాపాడమని ప్రార్థించుటకు 'దివ్యఖుర్ ఆన్‌ను ప్రతి ఒక్కరు అధ్యయనం చేయాలని ప్రతి ఇంటా చిన్నా పెద్దా, ముసలి ముతక, ఆడ,మగ తేడా లేకుండా అధ్యయనం చేసి సమాజంలో శాంతి సౌభాతృత్వాన్ని నెలకొల్పాలని మత గురువులు రంజాన్ సందర్భంగా పిలుపు నిచ్చారు. ముఖ్యంగా ఐకమత్యం, మహిళలను గౌరవిస్తూ జీవనం గడపాలని కోరారు.తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ఈద్‌గాహ్‌లు శనివారం ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ సందర్భంగా ఈదుల్ ఫితర్ ప్రార్థనలు. ఇక్కడ ఈదుల్ ఫితర్ ప్రార్థనల్ని ముఫ్తి నయిం సాహెబ్ చదివించారు. ఏర్పాట్లను మసీదు కమిటి అధ్యక్షులు అక్రం సాహెబ్,శ్రీకాళహస్తి ఖాజీ మున్నా (షరీఫ్) ఖలీలుల్లా,అంజద్ సాహెబ్,ఉమర్, ఖాజీ మొహిద్దీన్, జామియా మస్‌జిద్ కమిటి సభ్యులు పర్యవేక్షించారు.వేలాది మంది ముస్లిం సోదరులు ఇక్కడ నమాజ్‌ను ఆచరించారు.



జాతీయ యూత్ పార్లమెంటుకు రాష్ట్రం నుంచి ఎంపికైన ఎ.జ్యోత్స్న, లాస్య, శివాని

# జాతీయ యూత్ పార్లమెంటుకు రాష్ట్రం నుంచి ముగ్గురు అమ్మాయిలు ఎంపిక

**విజయవాడ,మార్చి31.ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ యువ పార్లమెంటుకు ఏపీ నుంచి ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. ఏప్రిల్ నెలలో ఇవి జరుగనున్నాయి. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యువజన సర్వీసులు నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో విశాఖపట్నం నోడెల్ ఏజెన్సీకి చెందిన ఎ. జ్యోత్స్న, లాస్య, శివాని ఎంపికయ్యారు. వీరు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి యూత్ పార్లమెంటుకు హాజరయ్యేందుకు అర్హత సాధించారు. నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి జి. మహేశ్వరరావు మాట్లాడుతూ.. విజయనగరం నోడల్ ప్రాంతం నుంచి ముగ్గురు విద్యార్థులు జాతీయ యువ పార్లమెంట్‌కు ఎంపికయ్యారని తెలిపారు. మార్చి 28న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో దాదాపు 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీలో ఈ ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారనీ, వారందరూ విశాఖపట్నం నుంచి ఎంపికయ్యారని మహేశ్వరరావు పేర్కొన్నారు.

# మార్చినెలలోనూ తగ్గని శ్రీవారి భక్తులు

## - రూ.117కోట్లు చేకూరిన హుండీ ఆదాయం

**తిరుమల,మార్చి 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినెలా సరాసరి 23 లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు చేరుకుని ఇష్టదైవాన్ని దర్శించుకుంటున్నారు. మార్చినెలలో సరాసరి 21.10లక్షలమందికిపైగా భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నట్లు తెలుస్తోంది. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి సమర్పించిన ఆదాయం కూడా 117కోట్ల రూపాయల వరకు చేకూరినట్లు సమాచారం. సోమవారం సాయంత్రం వరకు నెలరోజులలో 20,57,236 మంది భక్తులు దర్శనం చేసుకోగా, హుండీ ఆదాయం 113.92కోట్లు రూపాయలు వసూలైంది. వడ్డీకాసుల వేంకటేశ్వర స్వామిని సంతృప్తికరంగా దర్శించు కుంటున్న భక్తుల సంఖ్యకు రెట్టింపుగా, స్వామివారికి కానుకలు రూపంలో హుండీ ఆదాయం అంతకంతకూ రికార్డు సృష్టిస్తోంది. 2025 నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభంనుండి 110కోట్ల రూపాయలు హుండీ ఆదాయం వస్తోంది. టిటిడి చరిత్రలో నెలనెలకో ప్రత్యేకత సంతరించుకుంటోంది. కోట్లాదిమంది హిందు భక్తులు దేశవి దేశాల్లో స్థిరపడి వున్నవాళ్ళంతా ఏడు కొండలకు చేరుకుని తమ ఇష్టదైవాన్ని, కులదైవాన్ని దర్శించుకోవడం జరుగు తోంది. మార్చి నెలకు సంబంధించి హుండీ ఆదాయం గణాంకాలు పరిశీలిస్తే మార్చి 18వతేదీ హుండీ ఆదాయం 4.75కోట్లు రూపాయలు, 16వతేదీ హుండీ ద్వారా 4.46కోట్లు రూపాయలు, 10వతేదీ 4.27కోట్లు రూపాయలు, 9న 4.05కోట్లు, 27న 4.36కోట్లు,28న 4.15కోట్లు రూపా యలు వరకు ఆదాయం లభించింది.ఇక మిగిలిన రోజుల్లో వరుసగా సరాసరి 3.65కోట్ల రూపాయల వరకు ఆదాయం చేకూరింది. నెలవారీగా ఏడుకొండలకు చేరుకుంటున్న భక్తుల సంఖ్య సరాసరి 23 లక్షలమంది వరకు ఉంటుండగా,ఆ భక్తులు సమర్పించు కుంటున్న మొక్కుల ద్వారా వడ్డీ కాసులవాడి ఖజానాకు కాసుల వరద వెల్లువెత్తుతోంది. ఇక రానున్న వేసవి సెలవుల్లో ఏప్రిల్,మే, జూన్ మూడు నెలల వరకు భక్తులు తిరుమలకు భారీగా చేరుకునే అవకాశం వుంది. హుండీ కానుకలు మరింత రెట్టింపయ్యే అవకాశం ఉందని టిటిడి వర్గాలు అంచనావేస్తున్నాయి. కలియుగ ప్రత్యక్షదైవమ్,కోట్లాదిమంది భక్తుల ఇలవేల్పుగా కీర్తింపబడుతున్న ఏడు కొండల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, తమ మొక్కులు తీర్చు కునేందుకు తిరుమలకు సరాసరి నెలవారీగా 23లక్షలమందివరకు భక్తులు వస్తున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య రెట్టింపవుతూ దాని ప్రభావం హుండీపై కూడా గణనీయంగా చూపు తోంది. సాధారణరోజులు, వారాంతపు తేడా లేకుండా సరాసరి 70వేల మందిపైగా భక్తులు తిరుమలకు వస్తు న్నారు. రోజువారీగా భక్తుల సంఖ్యను గమనిస్తే మార్చి 23వతేదీ 84,198 మంది భక్తులు, 16న 82,721మంది భక్తులు, 15వతేదీ 82,580మందికి భక్తులకు వెంకన్న దర్శనం చేయించారు. మార్చినెల 9న 79,478మందికి, 22న 75,428 మందికి, 29వతేదీ 76,005 మంది భక్తులకు, 23వతేదీ 84, 198మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. మిగిలిన రోజుల్లో 65 వేలమందిపైగా చేసుకున్నారు.

# రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షుడిగా నరసింహామూర్తి

**శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త** రాష్ట్ర అర్చక సంఘాధ్యక్షుడుగా శ్రీకాళహస్తికి చెందిన పాలూరు నరసింహామూర్తిని ఎంపిక చేస్తూ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఉత్తర్వులు జారి చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకుడుగా పని చేస్తున్న నరసింహామూర్తి స్థానిక ఉద్యోగ సంఘాధ్యక్షుడుగా పనని చేసారు. ఇక్కడ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలపై స్పందించారు. ఆందోళనలు చేసారు. ముక్కుసూటిగా వ్యవహారించే నరసింహామూర్తి సేవలు గుర్తించిన బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర అర్చక సంఘాధ్యక్షుడుగా నియమించారు.ఆయనకు శ్రీకాళహస్తిలోని పలువురు అభినందించారు.

# ప్రపంచస్థాయి ఆన్‌లైన్ ముగ్గుల పోటీల్లో జగ్గయ్యపేట యువతి మామిడి హార్షిత విజయభేరి

## - రన్నర్‌గా రూ.15 లక్షల నగదు బహుమతి - వెల్లువెత్తిన ప్రశంసలు, అభినందనలు



**జగ్గయ్యపేట, మార్చి 31, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ప్రపంచస్థాయి ఆన్‌లైన్ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన యువతి మామిడి హార్షిత రన్నర్‌గా రూ.15 లక్షల నగదు బహుమతిని సాధించుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా అమెరికాలో జరిగిన ఒక వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ప్రతినిధులు విజేతల వివరాలను ప్రకటించారు. జగ్గయ్యపేట పట్టణంలోని బంగారం కొట్ల కూడలిలోగల తన నివాసంలో మామిడి హార్షిత గత జనవరి నెలలో దాదాపు ఏడు రోజులు శ్రమించి పలు రంగుల సమ్మేళనంతో శ్రీనివాసుని కళ్యాణ ఘట్టాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించారు. ఐదు నెలల క్రితమే వివాహం కాగా తెలంగాణా నుండి ఆంధ్రా కోడలిగా జగ్గయ్యపేటలో అడుగు పెట్టిన హార్షిత అత్తగారింట తన హాబీకి ఆమోదం లభించటంతో అంతర్జాతీయ పోటీలకు ఈరంగవల్లిని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. స్థానిక ఎంఎల్‌ఏ, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జెఆర్‌సి విద్యాసంస్థల ప్రెసిడెంట్ రంగాపురం నరసింహారావు-రుక్మిణి దంపతులు, పలువురు కౌన్సిలర్లు తదితరులు జనవరిలో ప్రాణం పోసుకుంటున్న ఈరంగవల్లిని సందర్శించారు. ఎంఎల్‌ఏ రాజగోపాల్, ఛైర్మన్ రావేంద్ర రంగవల్లిని చూసిన తోడనే మంత్రముగ్ధులయ్యారు. చూడగానే ఇది రంగవల్లిలా అనిపించలేదని, ఒక కళాఖండాన్ని తివాచీపై ముద్రించి రీతిలో ఉన్నదనే భావన కలుగుతోందని వారు అభిప్రాయం వ్యక్తంచేస్తూ హార్షితను అభినందించారు.

# రాజకీయ దుమారాన్ని రేపుతున్న వైఎస్సార్సీ కార్యకర్త లింగమయ్య హత్య

**- మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ హౌస్ అరెస్ట్**

**- ఇది ముమ్మాటికి రాజకీయ హత్య అంటున్న మాజీ ఎంపి గోరంట్ల మాధవ్**

**- ఇది రాజకీయ హత్య కాదంటున్న ఎమ్మెల్యే పరిటాల సునీత**



దాడి గురైన లింగమయ్య కుమారుడు శ్రీనివాసులు

**అనంతపురం, మార్చి 31 ప్రభాతవార్త బ్యూరో** శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైసిపి కార్యకర్త లింగమయ్య(60) హత్య సంఘటన రాజకీయ దుమారాన్ని లేపుతోంది. టిడిపి నాయకుడు రమేష్ కుమారుడు ఆదర్శ్ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు లింగ మయ్యను హత మార్చినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. లింగమయ్య భార్య రామాంజి న మ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదర్శ్ నాయుడుపై రామగిరి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైసిపి కార్యకర్త లింగమయ్య ఆయన కుమారుడు శ్రీనివాసులుపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన లింగమయ్యను ధర్మవరం ఆసుపత్రికి తీసుకొచ్చి అక్కడి నుంచి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. తీవ్రంగా గాయపడిన లింగమయ్య ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత చనిపోయాడు. సోమవారం ఉదయం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి లింగమయ్య మృతదేమాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకొచ్చారు. ఈ నేపత్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు. అనంతపురంలో తన నివాసం వద్ద నుంచి మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ లింగమయ్య మృతదేహాన్ని చూసేందుకు అవకాశం కల్పించాలని గట్టిగా ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు పలు మార్లు అడ్డుకున్నారు. తాను మాజీ పోలీసు అధికారిని, కేవలం పరామర్శించడానికి వెళ్తానని మాజీ ఎంపి అడిగినప్పటికీ పోలీసులు అవకాశం కల్పించలేదు. ఈ నేపథ్యంలో వైసిపి కార్యకర్త లింగమయ్య మృతదేహానికి అనంతపురం పోస్టు మార్టంలో నిర్వహించిన తర్వాత రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఇటీవల రామగిరి మండల ఎంపిపి స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఇందుకు సంబంధించి వైసిపి ఎంపిటిసిలను క్యాంపుకు తీసుకెళ్లే విషయంలో రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన వైఎస్‌ఆర్‌సిపి నాయకుడు జయచంద్రారెడ్డి కీలక పాత్ర వహించారు. రామగిరి ఎంపిపి ఎన్నికలు గతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ ఎన్నికల కోరం లేకపోవడంతో వాయిదా పడ్డాయి. జయచంద్రారెడ్డి ఊరిలో లేనప్పుడు ఎమ్మెల్యే పరిటాల సునీత సమీప బంధువైన రమేష్, ఆదర్శ్‌నాయుడు దాడులు చేశారన్నారు.

# ఎసిబికి చిక్కిన బిఐఎస్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్

**విజయవాడ,మార్చి31.ప్రభాతవార్త ప్రతినిధి:**బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్ రూ.70వేలు లంచం తీసుకుంటూ ఏపీలో ఎసీబీకి చిక్కారు.సిలిండర్ కి బీఐఎస్ మార్క్ కోసం ఒతయారీ కంపెనీ దరఖాస్తు చేసుకోంది.అయితే అందుకు ఆయన అంగీకరించలేదు.లక్ష్మీనారాయణరెడ్డిఅనే వ్యక్తి ద్వారా రమాకాంత్ అరీదారును లంచం కోసం డిమాండ్ చేశారు.దీంతో కంపెనీ ప్రతినిధులు అతడిపై సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు.విచారణానంతరం రమాకాంత్ సాగర్‌ను సీబీఐ అధికారులు పట్టుకున్నారు.కసుతో సంబంధం ఉన్న లక్ష్మీనారాయణరెడ్డి అనే మరోవ్యక్తిని కూడా అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించివివరాలను సీబీఐ అధికారులు విడుదల చేయాల్సి వుంది.

# పాస్టర్ ప్రవీణ్ కుమార్ తన ప్రయాణంలో విజయవాడలో ఎక్కడ ఉన్నారన్న అంశంపై వీడిన మిస్టరీ



**విజయవాడ,మార్చి31 ,ప్రభాతవార్తంప్రతినిది.** రాజమహేంద్రవరం లో ఇటీవల అనుమానస్పద పరిస్థితుల్లో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ కుమార్ తన ప్రయాణంలో విజయవాడలో మూడు గంటల పాటు ఎక్కడ ఉన్నారన్న అంశంపై మిస్టరీ వీడింది. ప్రవీణ్ అలసిపోయి తన ద్విచక్ర వాహనాన్ని రామవరప్పాడు రింగ్‌కు 50 మీటర్లు ముందుగా జాతీయ రహదారిపై ఆపి పక్కన కూర్చున్నట్లు పోలీసులు గుర్తించారు. విజయవాడ రాకముందే రోడ్డు ప్రమాదంలో బుల్లెట్ బండి పాక్షికంగా ధ్వంసమైనట్లూ పోలీసులు నిర్ధారించారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్ బైక్‌పై బయలుదేరిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఈనెల 24న విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం చేరుకున్నారు. పోలీసుల దర్యాప్తులో విజయవాడలో మూడు గంటల పాటు ఆయన ఆచూకీ దొరకలేదు. విజయవాడకు ఆరోజు సాయంత్రం 5 గంటలకే చేరుకున్న ఆయన రాత్రి 8:45కి ఎనికేపాడు దాటినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. ఆ మూడు గంటల పాటు ప్రవీణ్ ఎక్కడికి వెళ్లారనేది పసిగట్టడం పోలీసులకు సవాలుగా మారింది. గత రెండు రోజులుగా మహానాడు జంక్షన్ నుంచి ఎనికేపాడు వరకు సుమారు 200 కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. విజయవాడలోకి ప్రవేశించే ముందే గొల్లపూడి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల్లో బుల్లెట్ బైక్ పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్ బైక్‌పై బయలుదేరిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఈనెల 24న విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం చేరుకున్నారు. పోలీసుల దర్యాప్తులో విజయవాడలో మూడు గంటల పాటు ఆయన ఆచూకీ దొరకలేదు.

విజయవాడకు ఆరోజు సాయంత్రం 5 గంటలకే చేరుకున్న ఆయన రాత్రి 8:45కి ఎనికేపాడు దాటినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. ఆ మూడు గంటల పాటు ప్రవీణ్ ఎక్కడికి వెళ్లారనేది పసిగట్టడం పోలీసులకు సవాలుగా మారింది.

# వక్ఫ్‌బిల్లులపై సర్వత్రా నిరసనలు మద్దతు ఇవ్వవద్దని సిఎంకు వినతులు

## నల్ల బ్యాడ్జిలతో ఈదుల్ ఫితర్ ప్రార్థనలు

**శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్ బిల్లుపై శ్రీకాళహస్తిలోని మైనారిటీలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తిలోని ఈదుల గుంట, అయ్యలనాడు చెరువు, రాజీవ్‌నగర్ ఈద్‌గాహ్, మసీదే తఖ్వా,మహమ్మదీయ మస్‌జిద్‌లలో మైనారిటి ముస్లింలు నల్లబ్యాడ్జిలు ధరించి ఈదుల్ ఫితర్ ప్రార్థనలు జరిపారు. అల్లాహ్ నువ్వే కాపాడాలని మొరబెట్టుకున్నారు.అంతేకాక ఈ బిల్లుకు రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు మద్దతు ఇవ్వరాదని వినతి పత్రాలను స్థానిక నాయకులకు అందజేసారు.ఈదుల గుంటలోని శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించిన ఈద్‌గాహ్‌లో జమియతుల్ ఉలమ అధ్యక్షులు ముఫ్తినయిం సాహెబ్ సారథ్యంలో తెలుగుదేశం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రతి నిధి పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లు మైనారిటి ముస్లింల హక్కులను హరించేదిగా ఉందని వివరించారు. ఇది ముస్లిం షరియత్‌కు విరుద్ధంగా రూపొందించారన్నారు.



టిడిపి నేతకు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం నేతలు

14 సవరణలతో రూపొందించిన ఈ బిల్లు అమలు జరిగితే మసీదులు,మదరాసాలు,ఖాన్‌ఖాలు,శ్మశానాలు అన్ని ప్రభుత్వ అధీనంలోకి వెళతాయని వివరించారు.

# పేదరిక నిర్మూలనకు కేంద్రం కట్టుబడి ఉంది: బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిన నిర్మూలనకు కేంద్ర కట్టుబడి ఉందని,ఆ దిశలో రాష్ట్రానికి సహకరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. దేశంలోని టాప్ 500 కంపెనీలు ఓ కోటి మంది నిరుద్యోగులకు ఉపాధి చూపాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారని ఆ స్ఫూర్తితో రాష్ట్రంలోని పేదలకు ధనవంతులు చేయూత ఇవ్వాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. వైఎస్సార్సీపీ పాలనలో విద్వేషం ఎక్కువై నోరు మెదిపిన వారిపై అక్రమంగా అట్రాసిటీ కేసులను నమోదు చేశారని ప్రజావేదిక కూల్చివేతతో వైఎస్సార్సీపీ తమ విధ్వంస, విద్వేష పాలన ప్రారంభించిందన్నారు. ఒక్క కొత్తపెట్టుబడి కూడా రాష్ట్రానికి రానీయలేదని, బిడ్డలకు ఉపాధి దూరం చేశారని, మద్యం మాఫియాతో వైఎస్సార్సీపీ నేతలు భారీగా డబ్బులు చేసుకున్నారని ఇసుక, మట్టిలోనూ అడ్డగోలుగా వ్యవహరించారని, బీజేపీ ఈ అంశాలపై గళం వినిపించిందన్నారు. లేనెత్తిన అంశాలపై ఇప్పుడు కేసులు నమోదువుతున్నాయని, తమ వాదన నిజం అని నిరూ పితమవుతోందని తెలిపారు. ఎన్నికలకు ముందు మెరుగైన పాలన సాధ్యమని ప్రకటనలను ఆచరణలో సాధ్యం చేస్తున్నామన్నారు.

మెదడుకు మంచీ, చెడు తెలీదు. అన్ని రకాల ఆలోచనల్ని అది ఇస్తుంది. అందులోంచి ఎంచుకునే విజ్ఞత నీదే.

-గోథే

# సంపద కేంద్రీకృతంతో ఆకలి కేకలు!

**ప్రపంచవ్యాప్త కోటీశ్వరుల్లో దాదాపు 40 శాతం మంది అమెరికాలోనే ఉన్నారు. చైనాలో 20 శాతం మంది, జపాన్‌లో ఐదు శాతంమంది ఉన్నారు. ఇలా ప్రపం చంలో మన దేశంలో సామాజిక, ఆర్థిక, అసమానతలతో ఆకలి కేకలు మరోవైపు సంపన్నుల కుబేరుల సంఖ్య పెరు గుతున్న తీరుతో ఆ రుగ్మతను కట్టడి చేయలేని పాలకుల విధానాలతో పేదరికంలో అభాగ్యుల జీవితాల్లోచీకట్లు కమ్ము కున్నాయి. ఈ ఆర్థిక అసమానతలు, ఆకలికేకలు పెరిగిపో తున్నాయి. జరిగిన ఇన్నాళ్ల నిర్లక్ష్యాన్ని ఐక్యరాజ్యసమితి యుద్ధ వాతావరణాన్ని, నివారించడానికి వెంటనే అంతర్జాతీ య స్థాయిలో పరిష్కారానికి పూనుకోవాలి. ప్రస్తుత పరిస్థి తుల తీవ్రత దృష్ట్యా పాలకులు విధానాలు మార్చుకొని ఆకలి కేకలు లేని సమసమాజ స్థాపనకు పూనుకోవాలి.**

మేకిరి దామోదర్

ప్రపంచంలోని అనేక దేశాల్లో ఘర్షణలు,యుద్ధాలు జరుగుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా అక్కడ నివసిస్తున్న ప్రజానీకానికి తినడానికి సరైన తిండి లభించడం లేదు.వారి ఆకలి కేకలను పట్టించుకునే నాధుడే కనిపించడం లేదు. అంతర్జాతీయ సంస్థలు మానవతా సహాయాన్ని పంపుతున్నప్పటికీ అవి బాధితులకు చేరడంలో ఎన్నో అవరోధాలు ఏర్పడుతున్నాయి. కయ్యానికి కాలు దువ్వుతున్న పక్షాలు బయట నుంచి వస్తున్న సాయాన్ని అడ్డుకుంటున్నాయని ఆక్స్‌ఫామ్ నివేదిక తెలిపింది. ఘర్షణలు చెలరేగిన దేశాల్లో ప్రతిరోజూ ఆకలికి తాళలేక పట్టెడు అన్నం కోసం 7వేలనుంచి 21 వేల మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారంటూ ఈనివేదిక చేదునిజాన్ని బయట పెట్టింది. మరోవైపు దుర్భర దారిద్ర్యంలో 110 కోట్లమంది నెట్టి వేయబడుతున్నారు. ఇందులో యుద్ధాలు,దాడులు,ఘర్షణలు నెలకొన్న దేశాల్లోనే సగం మందితోపాటు, భారత్లో అత్యధికంగానే ఉన్నారు. యుద్ధాలు జరుగుతున్న దేశాలు బహుముఖ దారిద్ర్యాన్ని సంబంధించిన అన్ని సూచికల్లోనూ అధిక శాతం లేమిని ఎదుర్కొంటున్నాయని ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం యూఎన్డీపీ ప్రచురించిన సూచీలు పేర్కొంది. 112 దేశాల వ్యాప్తంగా 630కోట్ల మంది ప్రజలపై జరిగిన పరిశోధనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 110 కోట్ల మంది ప్రజలు అత్యంత దారుణమైన రీతిలో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని పేర్కొంది. వీరిలో 45.5 కోట్ల మంది ప్రజలు ఘర్షణల నీడలో జీవిస్తున్నారని మల్టీ డైమెన్షన్ పావర్టీ ఇండెక్స్ పేర్కొంది.ఈ ఆహార సంక్షోభాలు మానవులు సృష్టించినవే. ఘర్షణలో అట్టుడికిపోతున్న గాజా సూడాన్‌లో,రష్యా,ఉక్రెయిన్ లక్షల మందికి ఆహారం అందని దారుణ పరిస్థితులు. ప్రపంచంలో ఏదో మూల యుద్ధ వాతావరణం, ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రపంచ ఆధిపత్యం, సామ్రాజ్యవాదం, కార్పొరేటీకరణ మూలంగా మానవీయ కోణం కనుమరుగవుతుంది. శాంతితోనే పేదరిక నిర్మూలనని ఐక్యరాజ్య సమితి వెల్లడించినప్పటికీ సంపన్న దేశాలు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, సామ్రాజ్య కాంక్షల వైరుధ్యాల ఫలితంగానే ఈ పరిస్థితి. 2030 నాటికి ప్రపంచంలో ఆకలి అనేది లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని సాధించడం ఈ పరిణామాల దృష్ట్యా అసంభవం అవుతుందని ఆక్స్‌ఫామ్ హెచ్చరించింది.అంతర్జాతీయ చట్టం ప్రకారం, ఆకలి నేరాలకు కారకులైన వారిని గుర్తించి బాధ్యులను చేయాలని ఐరాస భద్రతా మండలి సహా అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఆహార భద్రత ఘర్షణలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రపంచ నేతలు ఘర్షణలకు మూల కారణాలైన వలసవాద వారసత్వాలు,అసమానతలు మానవ హక్కులు ఉల్లంఘన, ఆధిపత్యం, సామ్రాజ్యవాదం లాంటి వాటిపై పోరాడాలని ఫార్ సూచించారు. మన భారతావనిలో ఆకలికేకల, సూచికలో దిగజారుతున్న స్థానం. ప్రపంచ ఆకలి సూచిక(జీహెచ్ఐ)లో మన స్థానం నానాటికి దిగజారిపోతుంది. 2024న సంవత్సరానికి సంబంధించిన విడుదలైన 19వ జీహెచ్ఐలో భారత్ 105వ స్థానంలో (మొత్తం 127 దేశాలు) నిలిచింది. పొరుగున ఉన్న నేపాల్, శ్రీలంక, మయన్మార్, పాకిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్ కంటే వెనుకబడి పోయింది. ప్రపంచ దేశాలలో ఆకలిని తగ్గించే విషయంలో 2016 నుండి పురోగతి లేదని నివేదిక పేర్కొంది. 2030 నాటికి ఆకలిని పూర్తిగా నిర్మించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాకపోవచ్చు అని స్పష్టం చేసింది. ఎందుకంటే ఆకలిపై 127 దేశాలలో అధ్యయనం జరుపగా 42 దేశాలు నేటికీ 'తీవ్రత/ఆందోళనకర' స్థాయిలో ఉన్నాయి. ప్రపంచ ఆకలి సూచీలో గతపదేండ్లుగా మన దేశ ర్యాంకు అధోపాతాళానికి పడిపోతున్నది. వజ్రోత్సవాలు జరుపుకున్న స్వతంత్ర భారతదేశంలో ప్రజల పరిస్థితి "అన్న వస్త్రాలు అడిగితే ఉన్నవస్త్రాలు ఊడిపోయినట్లు' గా



మారిపోయింది. 2014లో ఆకలి సూచిలో 55వ స్థానంలో ఉన్న మన దేశం 2024లో 105వ స్థానానికి దిగజారడం విడ్డూరమే. అందునా దక్షిణాసియా దేశాలన్నింటిలోకెల్లా చివరి నిలవడం ఈ దేశ దినస్థితికి పరాకాష్ట.మనం మనకు ఉన్న ప్రకృతి మానవ వనరులను సరిగ్గా ఉపయోగించుకోలేని దుస్థితిలోఉన్నాం. అందుకే నేటికీ దేశంలో ఆకలి మంటలు రగులుతున్నాయి. ప్రపంచంలో తీవ్రమైన 31ఆకలి రాజ్యాలలో భారత్ కూడా ఉండటం కడువిషాదం. ఒకవైపు భగ్గుమంటున్న నిత్యవసరాల ధరలు సెగలకు అసంఖ్యాకులైన సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఇలా పట్టెడు అన్నంకోసం పరితపించే అభాగ్యుల సంఖ్య ప్రపంచమంతా పెరిగిపోవడం నేటి విషాదం. అదే సమయంలో రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రం ఆర్టికల్ 39(ఏ) ప్రకారం దేశంలోని పౌరులందరికీ తగిన జీవన సదుపాయాలు కల్పించాలి. దేశంలోని ప్రతిపౌరునికి నాణ్యమైన ఆహారం అందించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దేశంలో ఆహారాన్ని కొరత లేకపోయి ఉంటే ఆకలి చావుల సంఖ్య శూన్యంగా ఉండాలి కదా!. కానీ నేటికీ దేశంలో ఆకలి చావులు లేని రోజు లేదంటే అతిశయోక్తికాదు. దేశంలో ప్రతిరోజు దాదాపు 19 కోట్ల మంది ఆకలి కడుపుతో నిద్రిస్తున్నారని జాతీయ ఆరోగ్య నివేదిక తెలిపింది. ఇలా ఆకలి చావులు ఎందుకు పెరుగుతున్నాయి అన్న దానికి సమాధానం లేదు?. అది ప్రశ్నగానే మిగిలిపోతుంది. దేశంలో పరిస్థితి అలాగే కొనసాగితే 2025 నాటికి ఐక్యరాజ్యసమితి విధించిన ప్రపంచ పౌష్టికాహార లక్ష్యాన్నిగాని, 2030 నాటికి రెండవ సుస్థిరాభివృద్ధి లక్ష్యమైన 'జీరో హంగర్ను'గాని చేరుకోవడం భారత దేశానికి పెను సవాలే!. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని వ్యవసాయం,ఆహార భద్రత పౌష్టికాహార పంపిణీపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో మనదేశంలో ఇప్పటివరకు మనం పరిశీలించింది ఒకవైపే. మరోవైపు సంపద సంపన్నుల చేతిలో కేంద్రీకృతం అయిపోతుందో పరిశీలిద్దాం. 2024లో నైట్ ఫ్రాంక్ అంతర్జాతీయ స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ నివేదిక మేరకు, 2023లో అధిక సంపద కలిగిన కుబేరులు, కోటీశ్వరులు సంఖ్య (హెచ్‌డబ్ల్యు ఐ) 80,686 మంది ఉంటే 2024లో ఈ సంఖ్య 85,698కు చేరింది. 2028 నాటికి ఈ సంఖ్య 93,7503 చేరొచ్చని అంచనా వేసింది. అధిక సంపద కలిగిన వ్యక్తుల సంఖ్యాపరంగా భారత్ 85,698తో నాలుగో స్థానంలో ఉండగా, అమెరికా 9,05,413 మంది, చైనా 4,71,634 మందితో, జపాన్ 1,22,119 మందితో మూడు స్థానాల్లో ఉన్నాయి. భారత్ 85.698 మందితో నాలుగో, జర్మనీ 69.796 మందితో ఐదో స్థానం, కెనడా 64,982 మందితో ఆరో స్థానం, బ్రిటన్ 55,667తో ఏడో స్థానంలో, ఫ్రాన్సు 51,254తో ఎనిమిదో స్థానంలో, ఆస్ట్రేలియా 42,789తో తొమ్మిదో స్థానంలో, హాంకాంగ్ 42.715 మందితో పదో స్థానంలో ఉన్నాయి. ప్రపంచ వాటాగా గుర్తించింది. 10 మిలియన్ డాలర్ల (రూ 87 కోట్లకు) మించి ఆస్తులు కలిగి ఉన్న వారిని అధిక సంపద కలిగిన వ్యక్తులు, కోటీశ్వరులుగా నివేదిక పరిగణించింది. భారత్లోనూ కుబేరుల బిలియనీర్ కనీసం రూ. 8700కోట్ల సంపద కలిగిఉన్న వ్యక్తుల సంఖ్య కూడా గత ఏడాది పెరిగింది. ప్రస్తుతం 191మంది కుబేర్లకు భారత్ నివాసంగాఉంది. గత ఏడాది 26మంది ఈజాబితాలో చేరారు. 2019లో ఏడుగురే జత చేరారు. దేశంలోని కుబేరులందరి మొత్తం సంపద 950 బిలియన్ డాలర్లు. సుమారు రూ.82.65 లక్షల కోట్లుగా ఉండొచ్చని నివేదిక అంచనా వేసింది. అంతేకాదు భారత్లో అధిక సంపదకలిగిన వ్యక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడానికి దోహదం చేస్తుందని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. అలాగే 2024లో ప్రపంచవ్యాప్తంగా కోటీశ్వరుల సంఖ్య 4.4శాతం పెరిగి23 లక్షలకు చేరింది. ప్రపంచవ్యాప్త కోటీశ్వరుల్లో దాదాపు 40 శాతం మంది అమెరికాలోనే ఉన్నారు. చైనాలో 20 శాతం మంది, జపాన్‌లో ఐదు శాతంమంది ఉన్నారు. ఇలా ప్రపంచంలో మన దేశంలో సామాజిక, ఆర్థిక, అసమానతలతో ఆకలి కేకలు మరోవైపు సంపన్నుల కుబేరుల సంఖ్య పెరుగుతున్న తీరుతో ఆ రుగ్మతను కట్టడి చేయలేని పాలకుల విధానాలతో పేదరికంలో అభాగ్యుల జీవితాల్లోచీకట్లు కమ్ముకున్నాయి. ఈ ఆర్థిక అసమానతలు, ఆకలికేకలు పెరిగిపోతున్నాయి. జరిగిన ఇన్నాళ్ల నిర్లక్ష్యాన్ని ఐక్యరాజ్యసమితి యుద్ధ వాతావరణాన్ని, నివారించడానికి వెంటనే అంతర్జాతీయ స్థాయిలో పరిష్కారానికి పూనుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల తీవ్రత దృష్ట్యా పాలకులు విధానాలు మార్చుకొని ఆకలి కేకలు లేని సమసమాజ స్థాపనకు పూనుకోవాలి. ●

# సాగుకు మహిళా సాయం

వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది.పొద్దస్తమానం చేలో ఉండి అలసట చెందినభర్తకు వేళకింత భోజనం అందజేయడానికి వెళ్లే గ్రామీణ మహిళలు వ్యవసాయ పనులు చక్కపెట్టడంఆధునిక మహిళాతత్వం. విదేశాల్లో స్త్రీలు వ్యవసాయ పనులను పర్యవేక్షించేందుకు వెళ్ళే ఆనవాయితీ ఉన్నా భారతీయ మహిళలు ఇప్పుడిప్పుడే వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పనులు మెరుగుపరస్తున్నారు. ఖాళీ సమయాల్లో భర్తలతో పాటే స్వక్షేత్రాలలో పొలం పనులు చక్కపెట్టేందుకుభార్యలు చేదోడువాదోడుగా పాల్గొంటున్నారు.ఇలాంటిసంస్కృతి నానాటికీ పెరుగుతోంది. దేశీయ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర తక్కువేమీకాదు. సాగుసర్వం మహిళామయమే. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వంఎన్నో విధాలుగా సౌకర్యాలు కల్పిస్తోంది. అంతరిక్షంలో అడుగెట్టక ముందే పంటచేలో పనులకు దిగేవారు. రానురాను వాళ్లే మహిళా రైతులుగా రాణించారు. అతివలు అన్ని రంగాలలో తామే ముందున్నామన్న స్థాయికి ఎదిగారు. పంట చేలో కలుపు తీయడమేకాదు, మాసూళ్ళు, కళ్ళాల్లో ధాన్యం ఎగరబోత, సంచుల్లోకి ఎత్తివేత వంటి అన్ని వ్యవసాయ కార్యకలాపాలకూ అలవాటుపడ్డారు. ఇప్పుడు వ్యవసాయ రంగంలో కూడా మహిళలు తమకు తామే సాటి అనిపించుకున్నారు. వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళను సాధికారికవైపు నడిపించాలని ప్రభుత్వం సంకల్పించింది. వ్యవసాయ యాంత్రీకరణకు అనుబంధంగా, కేంద్ర ప్రభుత్వం మహిళలకు డ్రోన్‌ల నిర్వహణలో ప్రత్యేక శిక్షణనిస్తోంది. తాజాగా డ్రోన్‌ల నిర్వహణలో తర్ఫీదు పొంది డ్రోన్ దీదీలనిపించుకున్నారు. సాగురంగంలో 80 శాతం మంది గ్రామీణ మహిళలు ఉపాధిపొందుతున్నారు. వీరిలో నిరక్షరాస్యత వల్లనే సరైన వేతనాలు అందుకోలేక పోతున్నారనే అపవాదు కూడా ఉంది.ఆర్థిక స్వావలంబన సాధించాలంటే మహిళా సాధికారత అత్యవసరమని ప్రభుత్వాలు గుర్తించాయి. మహిళలకు వ్యవసాయ అనుబంధ రంగాలలో ఉపాధి కార్యక్రమాలు చేపడుతున్నాయి.ఏనాటి నుంచో కాఫీ, టీ తోటల్లో మహిళా కార్మికులు పనిచేస్తున్నారన్న విషయం మనకు తెలిసిందే. వ్యవసాయంలో మహిళా భాగస్వామ్యంపై 2020 మే నాటి అగ్రికల్చరల్ వేజెస్ ఇన్ ఇండియా(ఏడబ్ల్యూఐ) నివేదిక పేర్కొంది. వ్యవసాయ యాజమాన్యంలోకి ఇంతవరకు కేవలం 1.9 శాతం మంది ఉండగా, వ్యవసాయ కూలీలుగా పనుల్లోకి వస్తున్న మహిళలు 64శాతం మంది ఉన్నట్లు ఇటీవల కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇప్పుడు సాధారణ సాగు రంగంలో కూడా మహిళలు అసాధారణ ప్రజ్ఞ కనబరుస్తున్నారు. రోజువారీ వ్యవసాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నేరుగా రైతులు గానే మహిళలు స్వయం సమృద్ధి సాధించారు. ఆర్థిక అభివృద్ధిలో వారికి వారే సాటిని అనిపించుకున్నారు. సన్న చిన్నకారు రైతుల కమతాల్లో మహిళలే వ్యవసాయ కార్యకలాపాలు సొంతంగా నిర్వహిస్తున్నారు. భర్తలు వ్యవసాయ కూలీలుగా ఇతర పొలాల్లో పనులకు వెళ్తుంటే భార్యలు మాత్రం తమ చేలను శుభ్రపరుచుకోవడం దగ్గర నుంచి దున్నడం, విత్తు నుంచి ఉత్పత్తివరకు జరిగే అన్నికార్యక్రమాల్లో వారే పాల్గొంటున్నారు. ఇప్పుడు వారికి జీవనోపాధి కల్పిస్తోంది. దేశంలో ఎన్నో రాష్ట్రాల్లో మహిళా కార్మికులు ఉన్నప్పటికీ ఇటీవల కాలంలో తెలుగురాష్ట్రాల్లో మహిళల వ్యవసాయ కార్యకలాపాలు బాగా పెరిగిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 30లక్షల కమతాలను మహిళలే స్వయంగా సాగు చేస్తున్నారని వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. 2024నాటికి దాదాపు 46లక్షల వ్యవసాయ కమతాల్లో మహిళలు పంటల సాగు చేస్తున్నారని అంచనా. మహిళా యజమాన్యంలోనూ వ్యవసాయం పరిఢవిల్లుతోందన్న మాట. ఈ కాలంలో అధికశాతం మహిళా సాగుదారులే తారసపడుతున్నారు. ఆదాయం పెద్దదా,చిన్నదా అని కాకుండా రైతుకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. కుటుంబ సాగుభూముల భారంలో అత్యధిక భాగాన్ని మోస్తూవారు భారతదేశపు అగ్రి ఎకానమీలో గుర్తింపు పొందారు. దేశంలో కీలకమైన వ్యవసాయరంగం దశాబ్దకాలంగా ఆధునికతను జోడించుకోవడంతో పెద్ద పెద్ద చదువులు చదివిన మహిళలు సైతం సేంద్రియ వ్యవసాయం స్వయంగా చేప డుతున్నారు. సాగు బాట గణనీయంగా వృద్ధి చెందింది. సాగు రంగానికి దేశ జీడీపీలో సుమారు 20శాతం వాటా ఉంది. దేశీయంగా పనిచేస్తున్నవారిలో దాదాపు45శాతం మందికి ఉపాధికల్పిస్తోంది.ఇందులో దాదాపుసగంమంది మహిళలే ఉంటారు. దాదాపు 79 శాతం మంది మహిళలు వ్యవసాయంలోనే ఉంటున్నారు. కుటుంబపు ఆదాయాలను మెరుగుపర్చుకోవడంతో పాటు ఈ మహిళలకు ఇంటి పనులను నిర్వర్తించాల్సిన బాధ్యతలు కూడా ఉంటాయి. ఎంతో కీలక మైన పాత్ర పోషిస్తున్నప్పటికీ లింగపరమైన చిన్నచూపు, సామాజిక ఆంక్షలు, సాంప్రదాయకంగా పోషించాల్సిన బాధ్యతల భారాలు మొదలైనవాటి కారణంగా వ్యవసాయపరిజ్ఞానం, సాంకేతికత మహిళలకు అంతగా అందుబాటులో ఉండ టం లేదు. దీంతో ఉత్పాదకత తక్కువగా ఉం టోంది. 2023-24 పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీ ఎల్ ఎఫ్ఎస్) ప్రకారం 7ఏళ్ళ పైబడిన గ్రామీణ ఆడవారిలో అక్షరాస్యత రేటు 70.4 శాతంగా ఉండగా, గ్రామీణ పురు షుల్లో 84.7 శాతం. పట్టణ ప్రాంత మహిళల్లో 84.9 శాతంగాఉంది. వ్యవసాయమే కాదు వ్యవసాయ సంబం ధిత అనుబంధ ఉత్పత్తులు సాధించడంలోనూ మహిళల పాత్ర తక్కువేమీ కాదు. దేశ ఆర్థికవ్యవస్థను పటిష్టపరిచే మహిళా వ్యవసాయాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంకొన్ని పథకాలను ప్రవేశపెట్టడం అవసరం.

సాధన లేకుండా విజయాన్ని ఆశించడం ఎడారిలో మంచినీళ్ల కోసం వెతకడం వంటిది.



విశ్వేశ్వరయ్య

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.



స్వీడేన్‌బర్గ్

## ప్రజావాక్కు



### ఛార్జీల పెంపును ఉపసంహరించండి

ఈ ఏడాది మే నెల 1వ తేదీ నుండి సామాన్యులు తమకు డబ్బు అవసరమైనప్పుడు దగ్గరలో కనిపించిన ఏటీఎంకి వెళ్లి డబ్బులు విత్‌డ్రా చేయడం అందరికీ భారంగా ఉండవచ్చు. ఇటీవల నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదన, వైట్‌లేబుల్ ఏటీఎం ఆపరేటర్ల ఒత్తిడి మేరకు మే నెల 1వ తేదీ నుంచి ఏటీఎం ఇంటర్‌చేంజ్ ఫీజుల పెంపునకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోద ముద్ర వేసినట్లుగా పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. దీంతో ఇతర బ్యాంకు ఏటీఎంలను ఉపయోగించే కస్టమర్లు నగదును ఉపసంహరించుకోవడం లేదా నగదును చెక్‌చేసుకోవడం వంటి పనులు ఇప్పుడు మరి కొంచెం ఖరీదవుతుంది.అలాగే ప్రస్తుతం అన్నిబ్యాంకుల ఏటీఎంలలో 500 రూపాయల నోట్లు మాత్రమే ఉంటున్నాయి. చిల్లరనోట్లు లభించడం గగనంగా మారింది.

-దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

### పాత పద్ధతులే మేలు

ప్రైవేట్, కార్పొరేట్ టీచర్ల కంటే ప్రతిభ ఎక్కువ నైపుణ్యాలున్న ప్రభుత్వపాఠశాల టీచర్లుతెలుగు మీడియం ప్రోత్సహించడందురదృష్టకరం.ప్రపంచం ఎలాపరుగులు పెడితే మనం అలా పరుగులు పెట్టాల్సిందే. ఆ రోజుల్లో కూడా స్కూల్ అవర్స్ అయిపోయిన తర్వాతవిద్యార్థినివిద్యార్థులు ఉపాధ్యాయుల ఇల్లలోనే ఉండేవారు. ప్రైవేట్ చెప్పడానికి టీచర్లు గ్రామాల్లోఉండేవారు. విద్యార్థినీ విద్యార్థులు రాత్రి పడుకోవడానికి మాత్రమే గ్రామాల్లో ఇళ్లకు చేరుకునేవారు.ప్రతి సబ్జెక్టు వంద మార్కులకు ఉండాలి.

-వీరగంట భాస్కర్ రావు, హైదరాబాద్

### ఉద్యోగాల భర్తీ వేగంగా జరగాలి

రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత స్థాయి సర్వీస్ అయినటువంటి గ్రూప్1తో సహా దాదాపు అన్ని పోటీపరీక్షల్లో వివాదాలు, ఆందోళనలు, వాయిదాలు ఇటీవల సహజమైపోయాయి.దీనివల్ల ఉద్యోగార్థులు తమవిలువైన సమయం, ధనం కోల్పోవల్సి వస్తుంది. నోటిఫికేషన్ సమయంలోనే అన్ని న్యాయపరమైన సలహాలను తీసుకొని రాజ్యాంగ బద్ధ సంస్థ టిజిపిఎస్‌సితో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ నుంచైనా వివాదాలు తలెత్తకుండా ఉద్యోగాల భర్తీ వేగంగా జరగాలి.

-ముత్యంరెడ్డి, సిద్ధిపేటజిల్లా

### హాస్యం ఆరోగ్యం

ఈ మధ్య కునాల్ కమ్రా అనీ స్టేజీ హాస్యనటుడు తాను నిర్వహించే ఒసన్నివేశంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గారిమీద ఓ అసంబద్ధపు వ్యాఖ్యానం చేసాడని దేశమంతా రచ్చరచ్చ అయింది.మనిషికి గౌరవాన్ని తెచ్చేదితోలగించేది వాక్కు మాత్రమేనని ప్రతిపౌరుడు గుర్తెరగాలి. ఈ సత్యాన్ని విస్మరిస్తే అపవాదులను ఎదుర్కొనవలసి వస్తుంది. ముఖ్యంగా సమాజంలో పేరున్న వారు వినయాన్ని అన్నివేళలా పాటించాలి. కునాల్ కమ్రా చేసిన తప్పిదం సంచలనం సృష్టించింది. అయినా ఇటువంటి వ్యాఖ్యలకు ప్రాముఖ్యం ఇవ్వకూడదు. సినిమాల్లో రాజకీయ నాయకులమీద, పోలీసులమీద అనేక సెటైర్లు చూస్తున్నాము.వాస్తవమున్నా ఎవరూ వీటిని సీరియస్‌గా తీసుకోవడం లేదు.తనమీద వచ్చిన కార్టూన్లను చూసి ముసిముసిగా నవ్వుకునేవారట జవహర్ లాల్ నెహ్రూ గారు. కునాల్ కమ్రా కోర్టు కేసులను ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. హాస్యం ఆరోగ్యకరం.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### టాటూలు వద్దు

టాటూలు వేసుకోవడం ఈ రోజుల్లో యువతకు పెద్ద ఫ్యాషన్‌గా మారింది. ఒకర్ని చూసి మరొకరు ఇష్టం వచ్చిన చోట టాటూలు వేయించుకుంటున్నారు. అయితే ఇది ఆరోగ్యానికి హానికరం అంటున్నారు నిపుణులు.టాటూ వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదంఉందని అధ్యయనాలు చెబుతున్నాయి.కాబట్టి టాటూలు జోలికి వెళ్లకుండా ఉండాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

### వికలాంగులకు రాత్రి డ్యూటీలు వద్దు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో గురుకులాలలో 9210 పోస్టులను భర్తీ చేయడం జరిగింది. అందులో వికలాంగుల కోటాలో సెలెక్ట్ అయిన టీచర్స్,లెక్చరర్స్‌కు రాత్రిపూట డ్యూటీలు వేయడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం వికలాంగులకు గురుకులాలలో రాత్రిపూట డ్యూటీలు స్టడీ అవర్ నుండి మినహాయింపు ఇవ్వాలి. అందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ సొసైటీలలో పరిధిలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలకు వికలాంగులను నైట్ డ్యూటీ నుండి మినహాయిస్తున్నట్లుగా వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. వికలాంగులకు ఉదయం సమయంలో డ్యూటీలు మాత్రమే వారికి ఇవ్వాలి.మరొకరి సహాయంతో వారు డ్యూటీలు చేస్తారు.

-రాపాక రవీందర్, జనగాం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpagevaarta@gmail.com)

# ఆందోళన కలిగిస్తున్న భూకంపాలు!

తోట యోగేందర్

ఇటీవల మార్చి 28, 2025న బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలో మయన్మార్‌లో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించింది , దీని వలన పొరుగున ఉన్న థాయిలాండ్‌లో తీవ్ర నష్టం సంభవించింది. థాయిలాండ్‌లో ఆ దేశ ప్రధాని అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. నిజానికి ఈ దేశంలో పర్యాటక రంగం ప్రధానమైంది. వారానికి 2 లక్షల మంది పర్యాటకులు ఆ దేశానికి వస్తారు. ఆ దేశానికి వచ్చే ఆదాయం కేవలం టూరిజం మీదనే. మయన్మార్‌లో రెండవ అతి పెద్ద నగరం మాండలేలో బహుళ అంతస్తుల భవనం ఒక్క సారిగా కుప్ప కూలిపోయింది. అందులో 43మంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారు. మొత్తం మీద భూవిలయం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. అదే విధంగా భారత దేశంలో ఢిల్లీవంటి పట్టణాల్లో కూడా కొన్ని ప్రకంపనాలు సంభవించాయి. మయన్మార్‌లో తీవ్ర ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. ఈ పరిస్థితుల్లో భూకంపాల గురించి సరైన అవగాహన ప్రజల్లో కలిగించడం అవసరం. భూకంపం అనేది భూమి పొరల్లో శక్తి విడుదల అవడం వల్ల జరిగే ప్రకృతి వైపరీత్యం. భూకంపం సుమారు 4000 సంవత్స రాల నుండి మనుషులపై ప్రభావం చూపుతుంది. దాని మూలాలు భూమి లోతైన పొరలలో పటకాలు బలం గా ఉన్న చోట ఉంటుంది. ఈ పటకాలు నిరంతరం కదలి కలతో, ఒకదాని పైన రెండవది కదిలి శక్తి విడుదల అవు తుంది, అదే సమయంలో భూమిపై భూకంపం ఏర్పడు తుంది. భూకంపం ప్రధాన కారణం భూమి లోతైన పొరలలో పటకాలు ఒకదానిపై మరొకటి




పయనం చేయడం. ఈ కదలిక వల్ల భూమి ఉపరితలం పై కదలికలు, కంపనాలు ఏర్పడతాయి. ఇవి తీవ్రమైన విధ్వంసం, ఆస్తి ప్రాణ నష్టం కలిగిస్తాయి. భూకంపం ఏర్పడ డానికి మరొక కారణం అగ్నిపర్వతాలు బద్దలవ్వడం, చెలరేగటం కూడా. ఈ ఘటన వల్ల భూమి పైపొరలలో శక్తి విడుదల అవుతుంది. ఆ శక్తి భూకంపంగా మారుతుంది. భూకంపాల చరిత్ర పూర్వకాలంలోనే ప్రారంభం కావడం కనిపిస్తుంది. 2000 సంవత్సరాల క్రితం మొదటి భూకంపం శాస్త్రీయంగా నమోదైంది. 1000 సంవత్సరాల క్రితం, ప్రాచీన గ్రీక్ రోమన్లు భూకంపాలు సంభవించే విషయాలను అవగతం చేసుకున్నారు. రోమన్ సామ్రాజ్యంలో సంభవించిన భూకంపాలు అనేక శాశ్వత ధ్వంసాలకు కారణమయ్యాయి. ప్రకృతి విపత్తులు నియంత్రించలేనివి కావడంతో, భూకంపాల ప్రభావం అనేక విపత్కర పరిణామాలకు కారణమవుతుంది. అయితే సమకాలీన శాస్త్రీయ పరిశోధనలు భూకంపాల రాకను ముందుగానే అంచనా వేసే పరిజ్ఞానం కలిగి ఉన్నాయి. భూకంపాల గురించి చదివే శాస్త్రం సిస్మాలజీ. శాస్త్రవేత్తలు భూమి కంపనాలను గుర్తించడానికి కొలవడానికి సీస్మోమీటర్లను ఉపయోగిస్తారు. భూకంపాలుఎంత స్థాయిలో సంభవించాయో రిక్టర్ స్కేల్‌పై రీడింగ్ ఆధారంగా శాస్త్రవేత్తలు తెలుపుతారు. భూకంపాల నివారణకు, అర్థం చేసుకోవడం, భవన నిర్మాణాలలో తగిన మార్పులు చేయడం, నూతన మార్గాలను అవలంబించడం శాస్త్రవేత్తలతక్షణ కర్తవ్యం. ప్రభుత్వాలు కూడా ప్రభావిత ప్రాంతాలకు సహాయం అందించాలి. భూకంపం వచ్చే సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించాలి. ●

# 'స్వర్ణాంధ్ర విజన్'తోనే దశ,దిశ మార్పు!

ఎస్. సీతారామయ్య

ప్రపంచంలోనే తెలుగుజాతిని నంబర్ 1గా, దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలపడానికి శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించబడినది. వికసిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు రాష్ట్రం తన విజన్ 2047ను సిద్ధంచేస్తోందని రాష్ట్రం తిరిగి పూర్వవైభవాన్ని సంతరించుకోవటానికి ఏపీబ్రాండ్‌ను నిర్మించేందుకు సరళమైన ప్రభుత్వం, సమర్థవంతమైన పాలన ఈప్రభుత్వ ప్రధానధ్యేయం పేదరికంలేని సమాజం, ఉపాధి కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, సమర్థవంతమైన ఇంధన వనరుల వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు బ్రాండింగ్‌తోపాటు ప్రజలతో సంప్రదింపుల ఆధారంగా, దృష్టిని ముందుకు నడపడానికి ప్రభుత్వం పదిసూత్రాలు ' మార్గదర్శక సూత్రాలను తీసుకుని వచ్చింది. నీతిఆయోగ్‌తోసహా ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో ఈపత్రం అభివృద్ధి చేయబడుతోంది. రాష్ట్రం మొత్తానికి మాత్రమే కాకుండా జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల అభివృద్ధికి కూడా సిద్ధమవుతోంది. ప్రజలతో సంప్రదింపుల ఆధారంగా, దృష్టిని ముందుకు నడపడానికి ప్రభుత్వం 'పదిసూత్రాలు' లేదా 10 మార్గదర్శక సూత్రాలను అభివృద్ధి చేసింది. సాధారణంగా అభివృద్ధిని అంకెల్లో కొలుస్తారు. సాధించిన ప్రగతిని సగటుల్లో చూస్తారు. కానీ,అభివృద్ధిని ఆరోగ్యం, సంతోషం సంపదతో బేరీజు వేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర 2047గా రూపాంతరం చెందించడానికి కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో అడుగులు వేస్తున్నది. అభివృద్ధి అనేది రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) పెరుగుదలలో కనిపిస్తుంది. అప్పుడువిద్య ఆరోగ్యం, పోషకాహారం, గృహవసతి, పారిశుద్ధ్య సౌకర్యాల పరంగా ప్రజల స్థితిగతులు మెరుగవుతాయి. సంక్షేమం అంటే, ప్రజలకు సబ్సిడీల రూపంలో సాయపడటం. నేరుగా నగదు బదిలీచేయడం వీటివల్ల తాత్కాలిక ప్రయోజనమే కలుగుతుంది. సమర్థపాలన ద్వారా అభివృద్ధి సాధిస్తే దీర్ఘకాలిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తరవాత రాజధాని అవసరం ఏర్పడింది. పాత నగరాల్లో ఏదో ఒకదాన్ని రాజధానిగా చేయడానికి బదులు, పూర్తిగా కొత్త రాజధానిని నిర్మిస్తే ఎంతో మేలు జరుగుతుంది. అందుకే అమరావతిని ఎంచుకున్నారు. ఇక్కడ సిద్ధించే అభివృద్ధి ఫలాలు ఇతర ప్రాంతాలకు చేరతాయి. ప్రగతిలో అసమానతలు సమసిపోతాయి. అమరావతి నిర్మాణంతో కూడా ఇతర ప్రాంతాలు అభివృద్ధిలో ముందుకు వెళ్లగలుగుతాయి. 'పేదరిక నిర్మూలన, సమ్మిళిత వృద్ధి,ఉపాధి కల్పన వీటి ప్రధాన లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు




పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యాలతో పాటు మానవ వనరుల అభివృద్ధి, నీటి సంరక్షణ, వ్యవసాయం స్వచ్ఛాంధ్రలో సాంకేతికతను ప్రవేశ పెట్టడం వారి విలువైన సూచనలను పరిగణనలోకి తీసుకుని 17లక్షల మంది భాగస్వాములను చేయడం. పట్టణ ప్రాంతాలలో వృద్ధిని మాత్రమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలను సమానంగా అభివృద్ధిచేయడమే. ఆర్థికవృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అనువదించే సమ్మిళిత పర్యావరణ వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2047 నాటికి సున్నా పేదరికాన్ని సాధించడం మొదటి లక్ష్యం, విజన్ డాక్యుమెంట్‌లో ఉపాధి అవకాశాల కల్పన, మానవ వనరుల నైపుణ్యం తదుపరి దృష్టి కేంద్రాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్ననీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా నీటిభద్రతను సాధించాలన్నది నిర్దేశిత లక్ష్యం. వ్యవసాయంలో సాంకేతికతను అనుసంధానంచేయడం, నీటి భద్రతను నిర్ధారించడం ద్వారా రైతుల ఉత్పాదకత, లాభదాయకత పెరుగుతుంది.ప్రస్తుతం రూ.3,200గా ఉన్న రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయాన్ని 2047కల్లా రూ.43వేలకు పెంచాలని ఏపీ భావిస్తోంది.అది సిద్ధించాలంటే సంక్షేమం,అభివృద్ధి మధ్య సమతూకంసాధించాలి. పేదలకు సంక్షేమం, సబ్సిడీలు అందించాల్సిందేకానీ, వాటిని పెద్దఎత్తున ఇచ్చే ఆర్థికవెసులుబాటు లేదు. 2025-26 రాష్ట్రబడ్జెట్లో కేవలం పాతరుణాలపై వడ్డీ చెల్లించడానికి రూ.30 వేలకోట్లు కేటాయించారు.అది రాష్ట్ర పన్ను వసూళ్లలో 32శాతానికి సమానం. ఉచిత పథకాలు రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో ఉరకలెత్తించడానికి అడ్డుపడతాయి. వెనకాముందూ చూసుకోకుండా నిధులు ఖర్చు పెట్టేస్తే రుణాలు, వడ్డీభారం, బడ్జెట్‌లోటు అలవికాని రీతిలో పెరిగిపోతాయి. వడ్డీలు కట్టడానికే కొత్త అప్పులు చేయాల్సివస్తుంది. ఉచితాలపై మితిమీరిన ఖర్చు, విద్యావైద్యాలకు,మౌలిక వసతులకు నిధులు దొరకని పరిస్థితిని కల్పిస్తుంది.అందుకని అభివృద్ధి, సంక్షేమాల మధ్య సమతౌల్యం పాటించాలి. పథకాల అమలులో సమర్థంగా వ్యవహరించడం ద్వారా ఖర్చును తగ్గించవచ్చు. పన్నులు, పన్నేతర ఆదాయాలను పెంచుకోవాలి. పెట్టుబడి వ్యయం, మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించాలి. దిగువ, మధ్యతరగతి వారి ఆదాయాలను పెంచినప్పుడు వారు వస్తు సేవలను ఎక్కువగా వినియోగించగలుగుతారు. ఆ వినియోగమే ఉత్పత్తికి, ఉపాధిఅవకాశాల వృద్ధికి ఉత్ప్రేరకంగామారుతుంది. విజన్ ప్రణాళికలో అందరూ భాగస్వాములుకావాలి. ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి.రేపటి నుంచి ఆంధ్రావ్యాలీ ఓ సక్సెస్ స్టోరీ అవ్వాలని ఆశిద్దాం.సమ్మిళిత,సుస్థిర అభివృద్ధి సాధన నేటి తారక మంత్రం అన్నసంగతి అందరూ గుర్తుంచుకుద్దాం.ప్రజల తలరాతను, భావితరాల భవిష్యత్తును విజన్ డాక్యుమెంట్‌తో మర్చాడానికి కృషిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి తమ వంతుసాయం అందిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధికి కార్యసాధకులు అవుద్దాం. ●

# మూడోసారి కూడా 'కుర్చీ' నాదే

## ధీమా వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 31:** అమెరికా అధ్యక్షుడుగా మూడోసారి ఎన్నిక కావడానికి తనకు అనేక మార్గాలున్నాయని డొనాల్డ్‌ట్రంప్ పేర్కొన్నారు. తాను మూడోసారి బాధ్యతలు చేపట్టడాన్ని ఆయన తోసిపుచ్చలేదు. ఈ విషయంలో తాను జోక్‌చేయడంలేదని స్పష్టంచేసారు. అయితే దీనిపై ఇప్పుడే ఆలోచించడం తొందరపాటు అవుతుందని అన్నారు. ఎన్బీసీ న్యూస్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడుగా మూడోసారి ఎన్నికకావడాన్ని రాజ్యాంగంలోని 22వ సవరణ అనుమతించదు. చాలా మంది ప్రజలు మూడోసారి ఎన్నిక కావాలని నన్ను కోరుతున్నారు. అయితే అందుకు ఇంకా చాలా సమయం ఉందని వారికి చెప్పానన్నారు. ఇపుడు ప్రస్తుతపరిస్థితులపైనే తాను దృష్టి సారించినట్లు ట్రంప్ చెప్పారు. మరోసారి అధికారం చేపడతారా అన్న ప్రశ్నకు తనకు పని చేయడం ఇష్టమని తెలిపారు. తొలుత జెడివాన్స్ అధ్యక్షుడిగా బాధ్యతలుచేపట్టి తర్వాత దానిని ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యే మీకు బదిలీచేస్తారా అని ఎన్బీసీ ప్రతినిధిప్రశ్నించారు. అది ఒక పద్ధతి అని ట్రంప్ స్పష్టంచేసారు. దీనితోపాటు ఇతర మార్గాలు ఉన్నాయని వివరించారు. అవేమిటని ప్రశ్నిస్తే ఇప్పటికిప్పుడు చెప్పడం వీలు కాదని ట్రంప్ దాటవేసారు.

రెండుసార్లు కంటే ఒక్కరే అధ్యక్షుడగా పనిచేయాలంటే రాజ్యాంగ సవరణచేయాలి. అదిచాలా కష్టంతో కూడుకున్నది. రాజ్యాంగ సవరణ చేయాలంటే కాంగ్రెస్‌లో మూడింట రెండొంతుల మెజార్టీ ఉండాలి. లేదంటే మూడింట రెండొంతుల రాష్ట్రాలు అంగీకరించాలి. ఈ రెండు మార్గాలను నాలుగింట మూడొంతుల రాష్ట్రాలు ఆమోదించాలి. 2028లోనూ ట్రంప్ అధ్యక్షుడిగా పోటీచేస్తే ఎన్నికవుతారని ఆయన అనుయాయుడు స్టీవ్ బానన్ అన్నారు. దీనికోసం మా ముందు రెండు ప్రత్యామ్నాయాలున్నాయని ఆయన వివరించారు.

**ప్రపంచదేశాలన్నింటిపైనా ట్రేడ్‌వార్: ట్రంప్ హెచ్చరిక**

భారత్ చైనాలపై ప్రతీకార సుంకాలను ఏప్రిల్ 2నుంచి అమలులోకి తెస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన మరో కీలక ప్రకటనచేసారు. వాణిజ్య యుద్ధం కేవలం 10–15 దేశాలకు మాత్రమే పరిమితం కాబోదని ప్రపంచంలోని అన్నిదేశాలపైనా సుంకాలు విధిస్తామని అన్నారు. ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. అగ్రరాజ్యం తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందాలంటే ఈచర్యలు తీసుకోక తప్పదని అన్నారు. చాలా ఏళ్లుగా మేం ప్రపంచ దేశాలతో ఉదారంగా ఉన్నామని కానీ చరిత్రలో ఏదేశాన్ని దోచుకోనివిధంగా అమెరికాను దోచుకున్నాయని, వాణిజ్య పాలసీల పరంగా కొన్నిసార్లు అమెరికా మిత్రదేశాలు శతృవులకంటే దారుణంగా వ్యవహరించాయని అన్నారు. దశాబ్దాలుగా వారుమనపై విధించిన వివిధ పేర్లతో దోచుకున్న దానికంటే ప్రస్తుతం అగ్రరాజ్యం తర దేశాలపై విధిస్తున్న సుంకాలు చాలా తక్కువ ఉన్నాయన్నారు. కాబటి ప్రత్యక్షంగా పరోక్షంగా మాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న ప్రపంచదేశాల న్నింటిపైనా మా వాణిజ్య ట్యారిఫ్‌లు అమలవుతాయని ట్రంప్ అన్నారు. ఏప్రిల్2 నుంచి అమలయ్యే ప్రతీకార సుంకాలను తప్పించుకునేందుకు అమెరికా దిగుమతులపై ట్యారిఫ్ కోతలవైపు భారత్ మొగ్గుచూపుతోంది. ఈ రెండుదేశాల మధ్య మొదలయిన ట్రేడ్‌అండ్ ట్యారిఫ్ చర్చల్లో భారత్ ధృడసంకల్పం ప్రదర్శిస్తోంది. కొన్ని వస్తువులపై ట్యారిఫ్‌కోతలకు అంగీకరించినా దేశప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని సుకంకాలు తగ్గించినంత మాత్రాన అమెరికా ఒత్తిడికి లొంగిపోయినట్లు కాదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారి అన్నారు.

అమెరికానుంచి భారత్‌కు వస్తున్న ఉత్పత్తులపై ఇక్కడ ఎంతసుంకం విధిస్తే అమెరికాకు చేరుతున్న భారత్ ఉత్పత్తులపైనా సమాన సుంకం వసూలుచేస్తానని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రపంచవాణిజ్యసంస్థ ప్రకారం భారత్ ఉత్పత్తులపై అమెరికా సగటున 2.2శాతం సుంకం విధిస్తుండగా అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకం సగటు 12శాతంగా ఉంది.



# అణు ఒప్పందానికి నిరాకరిస్తే ఇరాన్‌పై బాంబుదాడులు

## అమెరికా అధ్యక్షుడి హెచ్చరికలు

## అయితే ఎదురుదాడులు తప్పవన్న ఖమేనీ

**తెహ్రాన్, మార్చి 31:** అణ్వాయుధాల ఒప్పందం అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండిపడింది. ఒకవేళ అగ్రరాజ్యం దాడులకు తెగబడితే ఎదురుదాడులు చేసేందుకు వెనుకాడమని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పష్టం చేశారు. ఈ మేరకు అంతర్జాతీయ కథనాలు పేర్కొన్నాయి. ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. అణు ఒప్పందానికి నిరాకరిస్తే బాంబు దాడులు చేస్తామని ఆయన బెదిరిస్తున్నారు. ఒకవేళ అమెరికా అదే పని చేస్తే ఇరాన్ నుంచి ఎదురుదాడులు తప్పవు అని హెచ్చరించారు. ట్రంప్ బెదిరింపులతో టెహ్రాన్ అప్రమత్తమైందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్ వ్యాప్తంగా ఉన్న భూగర్భ ప్రయోగ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులను లాంచ్‌ప్యాడ్‌లపై సిద్ధంగా పెట్టినట్లు వెల్లడించాయి. అత్యవసర పరిస్థితుల్లో అమెరికా సంబంధిత ప్రాంతాలపై దాడులు చేసేందుకు వీటిని వినియోగించుకోనున్నట్లు తెలిపింది. కాగా ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోకుండా అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఒప్పందం కుదుర్చుకోని పక్షంలో ఇరాన్‌పై బాంబు దాడులకు వెనుకాడబోమని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంపై మునుపెన్నడూ ఎరుగని రీతిలో ఇవి జరుగుతాయన్నారు. దాడులతో పాటు ఆ దేశంపై జరిమానాలు కూడా విధిస్తామని అన్నారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన ఇరాన్ సుప్రీంలీడర్ అమెరికాపై ఎదురు దాడులు చేసేందుకు వెనుకాడమని స్పష్టం చేశారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో అణుఒప్పందంనుంచి అమెరికా వైదొలిగింది. ఆ సమయంలో ఇరాన్, అమెరికా సంబంధాలు సాధారణంగానే కొనసాగాయి. నాడు టెహ్రాన్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి ఎన్నోఏళ్లుగా జరిగిన పరోక్షచర్చలు విఫలమయ్యాయి. మరోసారి అణుఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమైనట్రంప్ ఇరాన్‌వినని పక్షంలో దాడులు తప్పవంటూ హెచ్చరికలు చేశారు.



# కేంద్ర మాజీ మంత్రి గిరిజావ్యాస్‌కు తప్పిన ప్రమాదం

**జైపూర్, మార్చి 31:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కేంద్ర మాజీ మంత్రి గిరిజా వ్యాస్ అగ్నిప్రమాదంలో గాయపడ్డారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన నివాసంలో పూజా సమయంలో హారతి నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను అహ్మదాబాద్ తరలించాలని సూచించారు. ఇంట్లో ఆమె హారతి ఇస్తుండగా కింద వెలుగుతున్న దీపంనుంచి మంటలు ఆమె దుపట్టాకు అంటుకోవడంతో ఈప్రమాదంచేసుకున్నట్లు గిరిజావ్యాస్(79) సోదరుడు గోపాల్ శర్మ తెలిపారు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ప్రముఖ కాంగ్రెస్ నాయకురాలయిన గిరిజా వ్యాస్ గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలందించారు. రాజస్థాన్ పిసిసి అధ్యక్షురాలిగా, జాతీయ మహిళా కమిషన్ ఛైర్మన్‌గాను పనిచేసారు.

# రెండునెలల్లోనే 25 లక్షలుదాటిన ఆయుష్మాన్ వయోవందన యోజన కార్డులు

**న్యూఢిల్లీ, మార్చి 31:** కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులందరికీ ఆయుష్మాన్ వాయ్‌వందన స్కీంను అమలుచేస్తోంది. తొలి విడతగా మొత్తం 70 ఏళ్లకుపైబడిన 22 వేల మంది సీనియర్ సిటిజన్లకు 40 కోట్ల విలువైన వైద్యసదుపాయాలు అందుతున్నాయి. ఈ స్కీం రిజిస్ట్రేషన్లలోనే ఇప్పటివరకూ 25 లక్షల కార్డులు వచ్చాయి. కేవలం రెండునెలల్లోనే ఈ స్కీం ప్రారంభించిన తర్వాత 25 లక్షల కార్డులు జారీచేసినట్లు తెలుస్తోంది.

2024 అక్టోబరులో ఈ స్కీంను ప్రవేశపెట్టారు. ఈస్కీం ప్రారంభించిన తర్వాత సుమారు 22 వేల మంది సీనియర్ సిటిజన్లకు కరోనరీ, యాంజియోప్లాస్టీ, హిప్ ఫ్రాక్చర్, రీప్లేస్‌మెంట్, గాల్ బ్లాడర్ రిమూవల్, కాటరాక్ట్ సర్జరీ, ప్రోస్టేట్ రిసెక్షన్, స్ట్రోక్, హీమో డయాలసిస్, ఇతర తీవ్రస్థాయి రుగ్మతలన్నింటికీ చికిత్సలు అందిస్తామని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆయుష్మాన వాయువందన కార్డు ఉన్నవారికి ఐదు లక్షలవరకూ ఉచిత వైద్యం అందుతుంది. సీనియర్ సిటిజన్లు ఎవ్వరైనా సరే వారికి చికిత్స అందుతుంది.

ఎబిపిఎం జెఎవై కింద అదనపు కవరేజి ఐదు లక్షలు వరకూ ఉంటుంది. ఇప్పటికేఈ సదుపాయం పొందుతున్నవారు అంటే సిజిహెచ్ఎస్, మాజీ సైనికులు కంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీం, ఆయుష్మాన్‌సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్‌లలోని వారికి కూడా ఎబిపిఎం జెఎవై పొందే అవకాశం ఉంటుంది. ప్రైవేటు బీమా కింద కవరేజి పొందుతున్నవారు, ఇఎస్ఐ స్కీంలో ఉన్నవారు కూడా ఎబిపిఎం జెఎవై కింద అర్హులని తేల్చింది. మొత్తం రెండువేలకుపైగా వైద్యప్రొసీజర్లను ఈ స్కీంకింద పొందే అవకాశం ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకున్నవారు స్వీయ రిజిస్ట్రేషన్‌చేసుకోవచ్చు.

ఆయుష్మాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా బెనిఫిషియరీడాట్‌ఎన్‌హెచ్‌ఎడాట్ జిఒవిడాట్‌ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లేదా 14555 నంబరుకు డయల్ చేయవచ్చు అదికూడా కాకుండా 1800110770 నంబరుకు మిస్‌కాల్ ఇస్తే చాలు ఈ పథకం పూర్తి వివరాలు పొందవచ్చు.

# రంజాన్ ప్రార్థనల్లోనే 700మంది మృతి

## మయన్మార్ భూకంపంలో వెలుగులోకి వస్తున్న విషాదాలు



**బ్యాంకాక్, మార్చి 31:** మయన్మార్, థాయ్‌లాండ్‌లోసంభవించిన భారీ భూకంపాలు పెనువిషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రకంపనల ధాటికి మయన్మార్‌లోభారీగా ప్రాణనష్టం సంభవించింది. తాజాగా ఈభూ ప్రకంపనలకు సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగుచూస్తున్నాయి. రంజాన్‌శుక్రవారం వేళముస్లింలు ప్రార్థనలుచేస్తుండగా ఈ విపత్తుచోటు చేసుకోవడంతో దేశవ్యాప్తంగా 700 మందికిపైగా శిథిలాల కింద సజీవ సమాధి అయినట్లు అక్కడిముస్లిం ఆర్గనైజేషన్ సోమవారం వెల్లడించింది. మయన్మార్‌లోని రెండో పెద్దనగరం మాండలేలో గత వారం 7.7 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. నగరవ్యాప్తంగా వందల సంఖ్యలో భవనాలు నేలమట్టం అయ్యాయి. ఈ ప్రకంపనలకు 60 మసీదులు కూడా తీవ్రంగా ధ్వంసం అయ్యాయని స్ప్రింగ్ రివల్యూషన్ మైన్మార్ ముస్లిం నెట్‌వర్క్ కమిటీ సభ్యుడు టున్‌కీ వెల్లడించారు. మధ్యాహ్నం ప్రార్థనలు చేస్తుండగా ఈ విపత్తు రావడంతో శిథిలాలకిందనే 700 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు.

అయితే వీరి మరణాలను మైన్మార్ మిలిటరీ ధృవీకరించిందా లేదా అనేది స్పష్టత రాలేదు. ఈ పెను విపత్తుకారణంగా ఇప్పటికే మృతుల సంఖ్య 1700 దాటింది. మరో 3400 మంది గాయపడితే 300 మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు. శిథిలాలకింద చిక్కుకున్నవారికోసం సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఇప్పటికే అంతర్యుద్ధంతో కకావికలమైన మైన్మార్‌ను ఈ భూప్రళం మరింత కుదిపేసింది. ప్రకంపనల కారణంగా కమ్యూనికేషన్ వ్యవస్థ తెగిపోవడం రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నదని స్థానికఅధికారులు వెల్లడించారు. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది.

# 30 లక్షలమంది అఫ్ఘానిస్థానీలపై పాక్ బహిష్కరణ వేటు!

**ఇస్లామాబాద్, మార్చి 31:** అప్ఘానిస్తాన్‌నుంచి వచ్చి పాక్‌లో ఉంటున్నవారిపై ఆదేశం కీలక నిర్ణయం తీసుకుంది. 30 లక్షలమంది ఆప్ఘన్‌దేశస్తులను తమ దేశంనుంచి బహిష్కరించాలని యోచన చేస్తోంది. అప్ఘాన్‌నుంచి శరణార్థులుగా వచ్చినవారు తమ దేశం విడిచి వెళ్లడానికి ఇచ్చిన గడువు నేటితోముగియడంతో ఈచర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం అవుతోంది. తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్న ఆప్ఘనిస్తాన్ వాసులను ఇతర విదేశీయులను తిరిగి పంపడానికి 2023 అక్టోబరు నుంచి పాక్ ఈబహిష్కరణ అస్త్రంప్రయోగిస్తోంది. అనధికార లెక్కలప్రకారం ఏప్రిల్ ఒనుంచి పాక్‌లో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి బహిష్కరించాల్సి ఉంది. అయితే కొన్ని కారణాల రీత్యా బహిష్కరణలను ఈనెల 10వ తేదీకి వాయిదావేసారు ఆ దేశ సిటిజన్‌కార్డు ఉన్నవారు స్వచ్ఛందంగా ఇస్లామాబాద్‌వదిలి వెళ్లాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేసామని అధికారులు తెలిపారు. బహిష్కరణకు గురైనవారు తిరిగి పాక్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. గడచిన 18 నెలల్లో సుమారు 8వేలకుపైగా ఆప్ఘనిస్తాన్‌నుంచి వచ్చిన వలసదారులు పాక్‌ను వీడినట్లు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్‌మైగ్రేషన్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ఆదేశంలో 3 మిలియన్లమంది ఆప్ఘనిస్తాన్ వాసులు ఆశ్రయం పొందుతున్నారని ఎలాంటి పత్రాలు లేకుండా చట్టవిరుద్ధంగామరో మిలియన్‌మంది ఉంటున్నారని వెల్లడించాయి. తమదేశ



పౌరులను బహిష్కరించడానికి పాక్ చర్యలు తీసుకుంటున్న క్రమంలో ఆప్ఘనిస్థాన్ శరణార్థుల మంత్రిత్వశాఖ ప్రతినిధి అబ్దుల్‌ముతాలిబ్ కీలకప్రకటనచేసారు. శరణార్థులు గౌరవంగా తమ దేశానికి తిరిగి రావాలనే తాలిబన్‌ప్రభుత్వం కోరుతున్నదని అన్నారు. తాలిబన్‌ప్రభుత్వానికి, ఐక్యరాజ్యసమితికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పాక్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆయన విమర్శలుచేసారు.

# ప్రధాని మోడీ పిఎస్‌గా ఐఎఫ్‌ఎస్ అధికారిణి నిధి తివారీ!



**న్యూఢిల్లీ, మార్చి 31:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రైవేట్ సెక్రటరీగా ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారిణి నిధి తివారీ నియామకమయ్యారు. కేంద్ర కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమె నియామకాన్ని ఆమోదించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఈవిషయాన్ని అధికారికంగా ప్రకటించింది. వారణాసిలోని మెహమూర్‌గంజ్‌కు చెందిన నిధి తివారీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో 96వ ర్యాంక్ సాధించారు 2014 బ్యాచ్‌కు చెందిన ఆమెగతంలో వారణాసి అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేశారు. 2023 జనవరి 6 నుంచి ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. తొలుత 2022లో ఆమె అండర్ సెక్రటరీగా చేరారు. పిఎంవోలో చేరడానికి ముందు నిధి తివారీ విదేశాంగ మంత్రిత్వశాఖలో పనిచేశారు. ఆమె నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాల విభాగంలో బాధ్యతలు నిర్వర్తించారు. అంతర్జాతీయ సంబంధాల మెరుగుదలలో ఆమెకు ఉన్న నైపుణ్యమే పిఎంవోలో కీలక పాత్ర పోషించే స్థాయికి తీసుకొచ్చింది.

జాతీయ భద్రతా సలహా దారు అజిత్ దోవల్‌కు ఫారెన్ అండ్ సెక్యూరిటీకి చెందిన అంశాలను నేరుగా ఆయనకు నివేదించ డంలో కీలక పాత్ర వహించారామె. ప్రస్తుతం డిప్యూటీ సెక్రటరీగా వ్యవహరిస్తున్న నిధి కొత్త బాధ్యతలను త్వరలో చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన ఆదేశాలు త్వరలో వెల్లడించనున్నామని డివోపిటి ఒక ప్రకటనలో పేర్కొంది.

# ఉక్రెయిన్‌కు ట్రంప్ మరో హెచ్చరిక

## ఖనిజాల ఒప్పందం నుంచి జెలెన్‌స్కీ వైదొలగితే సమస్యలే

**వాషింగ్టన్, మార్చి 31:** ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇవ్వాలని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ పట్టుబడుతున్న విషయంతెలిసిందే. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొంటుందంటే అధ్యక్ష పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమేనని బదులుగా నాటో కూటమి సభ్యత్వాన్ని ఉక్రెయిన్‌కు ఇవ్వాలని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ విషయంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ వారు ఎప్పటికీ నాటోలో సభ్యులు కాలేరని అన్నారు. ఖనిజాల ఒప్పందం నుంచి వైదొలగడానికి ప్రయత్నిస్తే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పెద్ద సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం అనేది ఎప్పటికీ జరగబోదని జెలెన్‌స్కీకి అర్థమై ఉంటుందని అందుకే తమతో ఖనిజ వనరుల ఒప్పందంపై తిరిగి చర్చలు జరపాలని జెలెన్‌స్కీ చూస్తున్నాడని ట్రంప్ పేర్కొన్నారు. పుతిన్‌తో సంబంధాలపై మాట్లాడుతూ కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ తమ మధ్య స్నేహపూర్వక బంధంఉందని అన్నారు. యుద్ధం ముగింపు విషయంలో ఆయన తన మాటను కాదనడని నమ్ముతున్నానని తెలిపారు. ఒకవేళ ఆ విధంగా జరగకపోతే రష్యా చమురుపై అదనపు సుంకాలు విధిస్తానన్నారు. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా చేస్తున్న సహాయానికి బదులుగా కీవ్‌లోని అరుదైన ఖనిజాలలో తమకు వాటా ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించారు.

ఇందులో భాగంగా ఉక్రెయిన్‌తో 500 బిలియన్ డాలర్ల డీల్‌ను ప్రతిపాదించామన్నారు. తొలుత దీనిని వ్యతిరేకించిన జెలెన్‌స్కీ ట్రంప్‌తో వాగ్వాదం తర్వాత అమెరికా సాయం ఆగిపోవడంతో అంగీకరించినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా భద్రత నిమిత్తం ఉక్రెయిన్‌లోని విద్యుత్ ప్లాంట్లను తమకు అప్పగించాలని ట్రంప్ సూచించగా జెలెన్‌స్కీ వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. అయితే అగ్రరాజ్యం ఉక్రెయిన్ నుంచి కోరుతున్న మొత్తం రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ, జపాన్‌లపై విధించిన ఆంక్షల కంటే ఎక్కువని బ్రిటన్ పేర్కొంది.

ఈ ఒప్పందం కుదిరితే ఉక్రెయిన్‌లో భవిష్యత్ పెట్టుబడి ప్రాజెక్టుల నిబంధనలను నిర్ణయించడంలో అమెరికన్ ఫండ్ నియంత్రణ సాధించే అవకాశం ఉన్నట్లు బ్రిటన్ పత్రిక తెలిపింది. ఏ విధంగా చూసినా, దీనివల్ల యుఎస్‌కే ఎక్కువ మేలు చేకూరుతుందని వివరించింది.

# కాశ్మీర్‌లోయలో తొలిసారి వందేభారత్ సర్వీసులు..

## ఏప్రిల్ 19న ప్రారంభించనున్న ప్రధాని మోడీ!

**శ్రీనగర్, మార్చి 31:** కశ్మీర్‌లోయలో తొలిసారి వందేభారత్ రైలు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఏప్రిల్ 19న తొలి వందే భారత్ రైలు కాట్రా నుంచి కశ్మీర్‌కు పరుగులు పెట్టనుంది. ఉదంపుర్, శ్రీనగర్, బారాముల్లా మధ్య 272 కిలోమీటర్ల మేర ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైలు లింక్ ప్రాజెక్ట్ పూర్తయిన నేపథ్యంలో ప్రధాని మోడీ ఈ రైలును ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 19న ప్రధాని మోడీ ఉదంపుర్ వస్తారని ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనను సందర్శించి ప్రారంభిస్తారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. అనంతరం కాట్రా నుంచి వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. జమ్మూరైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నందున జమ్మూ, కాట్రా, శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తొలుత కాట్రా నుంచి ప్రారంభం కానుంది. ఈ రైలు లింక్ ప్రాజెక్ట్ గత నెలలోనే పూర్తయిందని ట్రయల్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించగా రైల్వే సేఫ్టీ కమిషన్ రైలు సర్వీసులు నడిపేందుకు ఆమోదం తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రైలు ప్రారంభోత్సవంలో కాశ్మీర్‌కు ప్రత్యక్ష రైలు అనుసంధానం చేపట్టాలన్న చిరకాల డిమాండ్ నెరవేరినట్లవుతుంది. ప్రస్తుతం కశ్మీర్ లోయలోని సంగల్దాన్, బారాముల్లా మధ్య అలాగే కాట్రా నుంచి దేశంలోని మిగతా గమ్యస్థానాలకు మాత్రమే రైల్వే సర్వీసులు ఉన్నాయి. కశ్మీర్‌ను రైల్వే సర్వీసులతో అనుసంధానించే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు 1997లోనే ప్రారంభమైనప్పటికీ అనేక భౌగోళిక,



వాతావరణ సవాళ్లు, ప్రతికూల పరిస్థితుల కారణంగా జాప్యం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులో మొత్తం 119 కిమీల పొడవునా 38 సొరంగాలు ఉండగా వీటిలో 12.75 కిమీల మేర నిర్మించిన టీ 49 సొరంగం అత్యంత పొడవైనది. అలాగే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో 927 వంతెనలు సైతం ఉన్నాయి. వీటిలో చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన కూడా ఉంది. దీని ఎత్తు 359 మీటర్లు కాగా పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 35 మీటర్లు ఎక్కువ కావడం విశేషం.

# కొత్త యేడాది భారత్ ఆర్థికవృద్ధి 6.5%

## ఎర్నెస్ట్ అండ్ యంగ్ విశ్లేషణ

**న్యూఢిల్లీ, మార్చి 31:** కొత్త ఆర్థికసంవత్సరంలో భారత్ 6.5శాతం రేటుతో ఆర్థికవృద్ధి నమోదు చేస్తుందని ఎర్నెస్ట్ యంగ్ ఎకానమి వాచ్ అంచనావేసింది. ప్రభుత్వ నిధులను వివేకంతో బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ మానవ మూలధన అభివృద్ధికి సహకరించేస్పష్టమైన ఆర్థిక వ్యూహాలను అమలుచేస్తే దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు పెరుగుతాయని ఆసంస్థ తెలిపింది. 2024 ఏప్రిల్ 2025 మార్చి మధ్యకాలంలో భారత్ వాస్తవ జిడిపి వృద్ధి 6.4శాతామని ఈవై ఎకనామి వాచ్ మార్చి ఎడిషన్ స్పష్టంచేసింది. తదుపరి సంవత్సరంలో 6.5శాతం వృద్ధిచెందుతుందని తెలిపింది. రానున్న రెండు దశాబ్దాల్లో భారత దేశం సాధారణ ప్రభుత్వ విద్య, ఆరోగ్య రంగాల్లో వ్యయాలను క్రమంగా పెంచాల్సి ఉంటుందని చెప్పింది. అధిక ఆదాయవనరులున్న దేశాలు చేస్తున్న ఖర్చులకు తగ్గట్లుగానే భారత్‌కూడా వ్యయంచేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పింది. విద్యారంగంలో ప్రస్తుతం భారత్ జిడిపిలో 4.6శాతం వ్యయంగా ఉందని, 2047–48 ఆర్థికసంవత్సరం నాటికి ఈ మొత్తం 6.5శాతానికి పెంచాలనిసూచించింది. దేశజనాభాలో యువత సంఖ్య, పనిచేసే సామర్థ్యం కలవారి అవసరం పెరుగుతున్నందున ఈ పెరుగుదల అవసరం అనిచెప్పింది. 2020–21లో ఆరోగ్యరంగంపై జీడిపిలో 1.1శాతం ఖర్చుచేసారని 2047–48 ఆర్థికసంవత్సరం నాటికి దీనిని 3.8శాతానికి పెంచాలని పేర్కొంది. ఆరోగ్యసంరక్షణ సేవల మెరుగుదల సత్ఫలితాలకోసం ఈ ఖర్చు అవసరమని వివరించింది ఎక్కువ మంది యువత, తక్కువ ఆదాయం గల రాష్ట్రాలకు విద్య, ఆరోగ్య సంరక్షణ అవసరాలకు తగినట్లుగా అదనపు నిధులను అందచేయాలని తెలిపింది.

# వైద్య, డెంటల్, నర్సింగ్ కళాశాలల దరఖాస్తుల పరిశీలనకు కమిటీ

**విజయవాడ మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కొత్త గా ఏర్పాటు చేసే వైద్య, డెంటల్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి సిఫారసు చేసేందుకు నలుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని వ్యవధి మూడేళ్లు అని పేర్కొంది. ఛైర్మన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఉమాపాక దుర్గా ప్రసాదరావు వ్యవహరిస్తారని తెలిపింది. నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ వేమూరు సుధాకర్ ప్రసాద్, ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాల అనాటమీ విభాగం హెడ్, ప్రముఖ ప్లాస్టిక్, మైక్రో వాస్క్యులర్ సర్జన్ ప్రొఫెసర్ ఎన్ఎస్‌బీ పరిమళ, విశాఖకు చెందిన దంత వైద్యుడు బొడ్డేపల్లి రఘు సభ్యులుగా ఉంటారని చెప్పింది. కళాశాలల ఏర్పాటుకు అందిన దరఖాస్తులను ఈ కమిటీ పరిశీలించి ఎసెన్షియల్లీ సర్టిఫికేట్ లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని పేర్కొంది. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా , గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు జిల్లా వైద్య సేవల సమన్వయ కర్తలను నియమిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్‌తెలిపారు.

# చిల్లకూరు పోలీస్ స్టేషన్‌కు మరమ్మతులు

**చెన్నై, మార్చి 31 ప్రభాతవార్త :** అభయ్ ఇస్పాత్ గ్రూపులో భాగమైన విజయలక్ష్మి తులసీదాస్ మెహతా ఫౌండేషన్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీసీఆర్) కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలోని చిల్లకూరు పోలీస్ స్టేషన్ పునరుద్ధరణకు తన ఉదారమైన సహాయాన్ని అందించింది. సమాజ భద్రత మరియు సామరస్యాన్ని కాపాడటంలో, చట్టం అమలు చేయడంలో పోలీస్ స్టేషన్ పునరుద్ధరణకు తన ఉదారమైన సహాయాన్ని అందించింది. సమాజ భద్రత మరియు సామరస్యాన్ని కాపాడటంలో చట్టం అమలు చేయడంలో పోలీస్ వ్యవస్థదే కీలక బాధ్యత ఉందని, అందుకోసం తిరుపతిలోని చిల్లకూరు పోలీస్ స్టేషన్‌ను ఎంచుకుంది విజయలక్ష్మి తులసీదాస్ మెహతా ఫౌండేషన్. అందుకోసం పోలీస్ స్టేషన్‌కు అవసరమైన రూఫింగ్ మెటీరియల్‌ను విరాళంగా ఇచ్చింది. ఈ ప్రాంతంలో ప్రజల భద్రతకు మూలస్తంభంగా ఉన్న చిల్లకూరు పోలీస్ స్టేషన్‌కు కావాల్సిన భవన సదుపాయాలతో సవీకరణను చేపట్టింది.

# సన్ రైజర్స్, హెచ్‌సిఎ వివాదంపై విజిలెన్స్

**విచారణ: సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** ఐపిఎల్‌లో సన్ రైజర్స్ హైద రాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంచేజి, హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)ల మధ్య నెలకొన్న వివాదంపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంపై వెంటనే విజిలెన్స్ విభాగం విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సోమవారం ఆయన ఆదేశిం చారు. ఐపిఎల్ టికెట్లు, పాస్‌ల కోసం హెచ్‌సిఎ తీవ్రంగా వేధిస్తోందని ఎస్ఆర్‌హెచ్ ఆరోపించడం తెలిసిందే. ఈ మేరకు ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధి హెచ్‌సిఎ ప్రతిని ధికి లేఖరాయడం సంచలనం రేపింది. ఒప్పం దం ప్రకారం హైదరాబాద్‌లో హెచ్‌సిఎ ఆధ్వ ర్యంలో వున్న ఉప్పల్ స్టేడియంను వాడుకుం టున్నందుకు హెచ్‌సిఎకు పదిశాతం అంటే 3900 కాంప్లిమెంటరీ టికెట్లు .



సిలికానాంధ్ర ఉగాది ఉత్సవాల్లో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

# విభిన్న భాషలు నేర్చుకోవడం వ్యక్తిగతంగా ఎంతో ప్రయోజనకరం

**- విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్**

## - సిలికానాంధ్రలో ఘనంగా ఉగాది వేడుకలు

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** విభిన్న భాషలు నేర్చుకోవడం వ్యక్తిగతంగా ఎంతో ప్రయోజనకరమన విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. అమెరికా బే ఏరియాలో సిలికానాంధ్ర నిర్వహించిన ఉగాది వేడుకల్లో యార్లగడ్డ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రం జాతీయ ఐక్యతకు సహాయ పడుతుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ ప్రతిపాదనలో హిందీని తప్పనిసరి చేయలేదని, అయితే మాతృభాషతో పాటు మరో భారతీయ భాషను అధ్యయనాన్ని ప్రోత్సహించడమే దీని ఉద్దేశమని ఆయన స్పష్టం చేసారు. ఏ భాషను నేర్చుకోవాలనేది పూర్తిగా తల్లిదండ్రులు, విద్యార్థులు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. భారతీయ సంస్కృతి, తెలుగు సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పరిరక్షణలో ప్రవాసాంధ్రులు చేస్తున్న కృషిని లక్ష్మీప్రసాద్ ప్రశంసించారు. విదేశాల్లో నివసిస్తున్నా, తమ మూలాలను మరవకుండా, యువతరానికి తెలుగు సంస్కృతిని అందించేందుకు సిలికానాంధ్ర చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కుచిభొట్ల ఆనంద్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక అతిథిగా భారత కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి హాజరయ్యారు. వేడుకలలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సిలికానాంధ్ర తెలుగు సంఘం ఘనంగా సత్కరించారు.

గరికిపాటి వెంకట ప్రభాకర్ ప్రదర్శించిన స్వరరాగావధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం అనంతరం అరిటాకు పై సంప్రదాయ తెలుగు విందు ఏర్పాటు చేసి, ఉగాది ఉత్సవాన్ని మరింత ఆనందోత్సాహభరితంగా మార్చారు.

# దుర్గమ్మకు వైభవంగా పుష్పార్చన

**- కొనసాగుతున్న వసంత నవరాత్రులు**



విరాళమందించిన దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, మార్చి 31, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి సోమవారం వైభవంగా పుష్ప అర్చన ను నిర్వహించారు. కనకాంబరాలు, గులాబీ పూలతో దుర్గమ్మవారి పుష్పార్చన జరిపారు. వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా జరిపిన ఈ పుష్పార్చనలో భక్తులు పాల్గొన్నారు.

**- బంగారం గోపురం పనులకు విరాళం:** దుర్గమ్మ ఆలయం గోపుర పనులకు జరుగుతున్న బంగారు తాపడం పనులకు రు.1లక్ష విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన వారణాసి శివరామ శౌరి, సౌజన్య దంపతులు సోమవారం ఆలయాధికారులకు అందించారు. వారికి దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాటు చేసి, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# శ్రీ కళాసుధ ఆధ్వర్యంలో ఘనంగా 'విశ్వావసు' ఉగాది వేడుకలు

**చెన్నై, మార్చి 31 ప్రభాతవార్త :** శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో 'విశ్వావసు' ఉగాది వేడుకలు ఆదివారం రాత్రి చెన్నై, రాయపేటలోని మ్యూజిక్ అకాడమీలో ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకుని 'ఉగాది పురస్కారాలు-మహిళా పురస్కారాలను ప్రదానం చేశారు. ముందుగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అశ్వినీ శాస్త్రి వేదాశీర్వచనం, పంచాంగ పఠనంతో ప్రారంభమైంది. ఆ తర్వాత ఘంటసాల సావిత్రి కుమార్ ప్రార్థనా గీతాన్ని ఆలపించగా, నవదుర్గం బృందం కూచిపూడి నృత్యం, హరిప్రియ, డాక్టర్ మీనాక్షి పలు పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమాన్ని వీజీఎస్ హోమ్స్ డైరెక్టర్, క్రెడాయ్ ప్రెసిడెంట్ పద్మ దేవదాస్ జ్యోతి ప్రజ్వనతో ప్రారంభం కాగా, శ్రీ కళాసుధ అసోసియేషన్ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షోపన్యాసం చేశారు. ఎస్‌బీఐ చెన్నై సర్కిల్ జనరల్ మేనేజర్ ఎంవీఆర్ మురళీకృష్ణ ఆధ్యక్షత వహించిన ఈ వేడుకలో ప్రముఖ నిర్మాత ఏ.ఎం.రత్నం, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి పాల్గొన్నారు. 2024-25 సంవత్సరానికి గాను సినీరంగం నుంచి ఉత్తమ కెమెరామెన్ అవార్డును ఆర్.రత్నవేల్, ఉత్తమ చారిత్రాత్మక చిత్రంగా 'రజాకార్'ను ఎంపిక చేయగా, ఆ చిత్ర నిర్మాత గూడూరు నారాయణ రెడ్డికి ప్రదానం చేశారు. అలాగే, ప్రజాసేవా విభాగంలో విశిష్ట ఉగాది పురస్కారం కింద 'మహిళారత్న' అవార్డును హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త సరోజ వివేకానంద్‌కు, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవికి, 'లతా మంగేష్కర్' పురస్కారాన్ని ప్రముఖ సినీ నేపథ్య గాయని కల్పనకు, 'పీబీ శ్రీనివాస్' పురస్కారాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు ఆర్పీ పట్నాయక్‌కు, సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు, ఉత్తమ సహాయ నటి అవార్డును సినీనటి రోహిణికి, ఉత్తమ నటి అవార్డును ఇంద్రజకు, ఉత్తమ జ్యూరీ అవార్డును నటుడు సంపూర్ణేష్ బాబుకు, ప్రత్యేక పురస్కారాన్ని ప్రముఖ సినీ జర్నలిస్ట్ ఏ.ప్రభుకు ప్రదానం చేశారు. జెమిని సురేష్ సభా నిర్వహణ చేయగా ఇందులో కళాసుధ తెలుగు అసోసియేషన్ సభ్యులు, తెలుగు భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఇంద్రజకు ఉత్తమనటి అవార్డును ప్రదానం చేస్తున్న దృశ్యం




మీడియాతో మాట్లాడుతున్న కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

# కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు: కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్

**అమరావతి, మార్చి 31, ప్రభాతవార్త :** వాణిజ్య సంస్థల్లో పార్కింగ్ అందించేలా జిఓ జారీ చేసిన కూటమి ప్రభుత్వానికి కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ (వినియోగదారుల హక్కుల సంస్థ) జాతీయ అధ్యక్షులు నవీన్ శర్మ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గొర్లె శ్రీనివాస నాయుడులు ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలో సోమవారం జరిగి మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వ బిల్డింగ్ లా ప్రకారం పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న మాల్స్, మల్టీప్లక్సులు తదితర సంస్థలు షాపింగ్ చేసిన బిల్లులు చూపితే, అలాగే సినిమా టికెట్లు చూపితే ఉచిత పార్కింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారని, అలాగే ఎవరైనా సరే ఇకపై మొదటి 30 నిముషాల పాటు పార్కింగ్ చేసుకునే అవకాశం వుందని, దాని కోసం తాము అభ్యర్థన చేయగా కూటమి ప్రభుత్వం పార్కింగ్ సంబంధించిన జీవోను వినియోగదారులకు ఇచ్చేలా జిఓ జారీ చేశారు. ఈ జిఓ 2025 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తుందని ఖచ్చితంగా వాణిజ్యసంస్థలు/మాల్స్, మల్టీప్లెక్స్‌లు, పార్కింగ్ నిర్వహిస్తున్న అన్ని సంబంధిత వ్యక్తులు, ఏజెన్సీలు అమలు చేయాలని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ కార్యదర్శి డా మూల వెంకటరావు, ఏపి స్పోకెన్ పర్సన్ కరణం రెడ్డి నరసింగరావు, కార్యదర్శి రాజా, జాతీయ కార్యవర్గ సభ్యులు దీపక్ వర్మ, జి సునీల్, వైజాగ్ కార్యదర్శి లోగిస గణేష్, మూర్తి, శశి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటితో ముగియనున్న టెన్త్ పరీక్షలు

**13తో ముగియనున్న స్పాట్**

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 21 నుంచి ప్రారంభమైన ఎస్ఎస్‌సి పరీక్షలు రేపటి( ఏప్రిల్ 2, బుధ వారం)తో ముగియనున్నాయి. రాష్ట్రంలో ఎస్ ఎస్‌సి పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2650 పరీక్షా కేంద్రాలనను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతున్నాయి. రేపు(ఏప్రిల్2, బుధవారం) సోషల్ స్టడీస్ పరీక్ష జరగనుంది. దీంతో 10వ తరగతికి చెందిన ప్రధాన పరీక్షలు ముగియనున్నాయి. ఏప్రిల్ 3, 4 తేదిల్లో ఓఎస్ఎస్‌సి లాంగ్వేజెస్ పరీక్షలు జరగనున్నాయి. వీటితో మొత్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు ముగుస్తాయి. అయితే రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమైన 10వ తరగత వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 26 నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నప్పటికీ.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా లాంగ్వేజెస్ పరీక్షలు ముగియగానే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభిస్తున్నట్టుగానే ఈ ఏడాది కూడా 26నే

మూల్యాంకనాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో 19 సెంటర్లలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను కొనసాగించ నున్నారు.

# తిరుమల సమాచారం

## వరుససెలవులతో తిరుమల కిటకిట

**-వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు**



**తిరుమల,మార్చి 31 ప్రభాతవార్తప్రతినిధి:** వరుససెలవులు రావడంతో సోమవారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా మారింది. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమందికిపైగాభక్తులు తిరుమలకు చేరుకోవడంతో ఉదయానికి కొండ కిటకిటలాడు తోంది. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఏటిసి వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం కేటాయించారు. .వరుససెలవులు దృష్టిలోఉంచుకుని టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్దంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. వైకుంఠం కంపార్టుమెంట్లలో ,క్యూలైన్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ శ్రీవారిసేవకులు పంపిణీ చేస్తున్నారు. సోమసాయంత్రం వరకు 43వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

# రంజాన్ వేళ అలిపిరి తనిఖీ కేంద్రంలో ముస్లిం యువకుడు హాల్‌చల్

**- మద్యం సేవించి ఆపై విఐపి గేట్‌లో జొరబడి సంచలనం**

**తిరుమల,మార్చి 31ప్రభాతవార్తప్రతినిధి:** ముస్లింల రంజాన్ పర్వదినం రోజు సోమవారం ఉదయం ఓ ముస్లిం యువకుడు అలిపిరి తనిఖీ కేంద్రంలో హాల్‌చల్ చేశాడు. మద్యం సేవించి ఉన్న అతను ఏకంగా ద్విచక్రవాహనంపై తిరుపతినుండి తిరుమలకు వచ్చేందుకు అలిపిరి తనిఖీ కేంద్రంలో సాధారణ భక్తుల్లాగాక విఐపి గేట్‌లో జొరబడ్డాడు. అక్కడ విధుల్లో ఉన్న విజిలెన్స్,ఎస్‌పిఎఫ్ సిబ్బంది అతనిని ఆపేందుకు అడ్డుకున్నా ఆగకుండా ద్విచక్రవాహనంపై దూసుకెళ్ళాడు. అంతేగాక అతను తనిఖీ కూడా చేసుకోకుండా మోటారుసైకిల్‌పై వెళ్ళడంతో వెంటనే అప్రమత్తమైన విజిలెన్స్ సిబ్బంది వినాయకుని గుడివద్ద ఉన్న భద్రత సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడ ఉన్న సెక్యూరిటీగార్డు ,కొందరు భక్తులు అతనిని ఆపేందుకు ప్రయత్నించినా ఢీకొని ముందుకు ఘాట్‌లో వేగంగా వెళ్ళిపోయాడు. ఈ సమాచారం అలిపిరి విజిలెన్స్ సిబ్బంది తిరుమల జిఎన్‌సి టోల్‌గేట్ సిబ్బందికి తెలిపారు. వెంటనే అప్రమత్తమైన తిరుమల విజిలెన్స్ సిబ్బంది ముస్లిం యువకుడిని టోల్‌గేట్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత అతనిని విచారణ చేశారు. మద్యం సేవించి ఉన్నట్లు , పలు రకాలుగా సమాధానం ఇవ్వడంతో పై అధికారుల ఆదేశాలతో అతనిని తిరుపతికి తరలించారు. తిరుపతి రుయా ఆస్పత్రిలోని మానసిక వార్డుకు తరలించారు. అయితే తాను రంజాన్ వేళ తిరుమలకు వెళ్ళేందుకు ఇలా చేశానని, తాను శ్రీవారిని దర్శించుకోవాలని అనుకున్నానని చెప్పడం మరింత అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా తిరుమలకు ముస్లిం భక్తులు వచ్చి హిందూ సాంప్రదాయం ప్రకారం ఆలయంలోనికి వెళ్ళి స్వామివారిని దర్శించుకోవడం జరుగుతుంది. అయితే తిరుపతి సింగాలగుంటకు చెందిన అమ్జత్‌ఖాన్ (36)సోమవారం ఉదయం నిర్వాకం మాత్రం అంతుచిక్కని విషయంగా మారింది. దీనిపై విజిలెన్స్, అలిపిరి పోలీసులు అతనిని మరింత సమగ్రంగా విచారణ చేస్తేగానీ అసలు విషయం తెలియదని అంటున్నారు.

మరోవైపు అతను మానసిక పరిస్థితి బాగోలేదని, మతిస్థిమితం లేనివాడుగా తెలుస్తోందని విజిలెన్స్ సిబ్బంది నిర్ధారించడం మరింత విశేషం.

ఏదిఏమైనా సోమవారం ఉదయం రంజాన్ పర్వదినాన తిరుమలలో ఎలాంటి ఉపద్రవం చేసివుంటాడనేది భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

# కార్యకర్త హత్యపై జగన్ ఆగ్రహం ప్రజలు దీటుగా జవాబిస్తారని వ్యాఖ్య

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్త ప్రతినిధి:** అధికార దాహంతో తెలుగుదేశం నేతలు హత్యా కాండలకు తెగబడుతున్నారని మాజీ సీఎం వైఎస్ ఆరోపించారు.ఇందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని,వారికి ప్రజలు దీటుగా బదులిస్తారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, బీసీ కార్యకర్త కురబ లింగమయ్యను పొట్టనపెట్టుకున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు."ఎక్స్" వేదికగా ఆయన కురుబ లింగమయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్సీపీ బీసీ కార్యకర్త కురుబ లింగమయ్య హత్యను మాజీ సీఎం, జగన్మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, చట్టబద్ధపాలన లేదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారపార్టీ అన్యాయాలను ప్రశ్నించినందుకు, వారి దాడులను వ్యతిరేకించి నందుకు వైఎస్సార్‌సీపీకి చెందిన బీసీ కార్యకర్తను టీడీపీ నాయకులు పొట్టనపెట్టుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలమీద, నాయకులమీద దాడులు పరిపాటిగా మారాయన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు అధికారపార్టీ నాయకులతో కుమ్మక్కయ్యారని, రాష్ట్రంలో వ్యక్తుల భద్రతకు భరోసా లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రామగిరి మండల ఉప ఎన్నికల్లో జరిగిన అరాచకాల వెనుక పోలీసుల వైఫల్యం తీవ్రంగా ఉందని, అధికార పార్టీ నేతల దారుణాలను అడ్డుకోవడంలో, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో బాధ్యతా రాహిత్యం కారణంగానే ఈ ఘటనకు దారితీసిందన్నారు. రామగిరిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు టీడీపీ నేతల దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురై ఎన్నికలను బహిష్కరించినా, పోలీసులు అధికార పార్టీకి వంతపాడుతూ పైగా వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. బడుగు, బలహీన వర్గాల వారిని కక్ష రాజకీయాలకు బలిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఈ ఘటనకు బాధ్యులైన వారిని కచ్చితంగా చట్టంముందు నిలబెడతామని హెచ్చరించారు. కురుబ లింగమయ్య కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

# యువత పరిశోధనలు, సొంత వ్యాపారాలు ప్రారంభించాలి

**వికసిత్ భారత్ ఎంటర్‌ప్యూనర్ నెట్‌వర్క్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్,మార్చి 31,ప్రభాతవార్త:** ఈ దేశ యువత పరిశోధనలు చేయాలని, సొంత వ్యాపారాలను ప్రారంభించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం వికసిత్ భారత్ ఎంటర్‌ప్యూనర్ నెట్‌వర్క్‌ను ప్రారం భించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ భార తదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో, పారిశ్రా మికవేత్తల అభివృద్ధికి మార్గదర్శనం చేయ డానికి వికసిత్ భారత్ ఎంటర్‌ప్రెన్యూర్ సంస్థను హైదరాబాద్‌లో ప్రారంభించుకు న్నామని అ న్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్టార్టప్‌లను, యువ పారిశ్రామి కవేత్తలను బలంగా ప్రోత్సహిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల నుండి రుణాలు, ఇతర అనుమ తుల క్లియరెన్స్ ప్రక్రియలను సులభతరం చేసిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యువతకు వ్యాపారం ప్రారంభిం చేం దుకు ప్రేరణ కల్పించేందుకు, శిక్షణ ఇవ్వ డానికి వికసిత్ భారత్ ఎం టర్‌ప్రెన్యూర్ సంస్థ దోహదమవుతుంది. లక్షలాది ఉద్యోగ అవకాశాలను సృష్టించడమే ఈ సంస్థ లక్ష్యం అన్నారు. ఈ సంస్థ కోసం పనిచేసిన అమర్ నాథ్,వారిటీంకు హృద యపూర్వక అభినం దనలు తెలియజే స్తున్నాము. ఈ సంస్థ ద్వారా విద్యార్థులు తమ చదువు పూర్తయిన వ్యాపార రంగంలోకి ప్రవేశించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి గొప్ప అవకాశం లభించనుందన్నారు.

# 25న ఇంటర్ ఫలితాలు: 10తో ముగియనున్న మూల్యాంకనం

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్రం లో మార్చి 5 నుంచి ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 25తో ముగిశాయి. ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలను ఈ నెల 25న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 10తో మూల్యాంకనం ముగియనుండగా.. ఆ తరువాత ఇతర పనులను పూర్తి చేసుకొని ముఖ్యమంత్రి అనుమతితో ఈ నెల 25న ఇంటర్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇంటర్ ప్రధాన పరీక్షలు మార్చి 20తో ముగియగా.. మార్చి 21 నుంచే మూల్యాంకనాన్ని ప్రారంభించారు. అయితే అంతకంటే ముందుగానే మార్చి 10 నుంచే సంస్కృతం మూల్యాంకనాన్ని ప్రారం భించారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో మూల్యాంకనాన్ని కొనసాగిస్తున్నారు.

# పాకిస్థాన్‌లో మరో లష్కర్ ఏ తోయిబా ఉగ్రవాది కాల్చివేత

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** భారత్‌లో అనేక నేరాలు,ఘోరాలకు పాల్పడుతూ ఇక్కడ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో వున్న లష్కర్ ఏ తోయిబాకు చెందిన గజ టెర్రరిస్టులు తమకు సురక్షితంగా వున్న పాకి స్తాన్‌లో వరుసగా హత్యలకు గురవు తు న్నారు. తాజాగా సోమవారం రంజాన్ పండగ వేళ పాకిస్తాన్ వాణిజ్య నగరం కరాచిలో అబ్దుల్ రహమాన్ అనే ఉగ్రవాదిని గుర్తు తెలియని వ్యక్తులు తుపాకితో కాల్చి చంపారు. అబ్దుల్ రహమాన్ 26/11 ముంబాయి దాడుల సూత్రధారి పాక్‌లో తలదాచుకున్న హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడుగా చెబు తున్నారు. హతుడు లష్కర్ ఏ తోయిబా ఆర్థిక విభాగం పర్యవేక్షకుడుగా వున్నాడు. రంజాన్ పండగ సమయంలో ఒక దుకాణంలో నిలబడి వున్న రహమాన్‌పై బై క్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సమీపం నుంచి తుపాకితో కాల్చి చంపి నిమిషాల వ్యవధిలో పారిపోయారు.

రహ మాన్ లష్కర్ ఓ తోయిబా ఉగ్రవాదే కాకుండా ఆ సంస్థ కు ఆర్థికంగా మహారాజ పోషకుడు కూడా. ఇదే సమయంలో కరాచిలో ప్రముఖ వ్యాపారిగానూ పేరొందాడు. రహమాన్‌ను కాల్చి చంపిన వీడియో సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది. రహమాన్ హత్యకు నెల రోజుల ముందు అబూ ఖతర్ అనే ఉగ్ర వాదిని కరాచిలోనే గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపడం సంచలనం రేపింది.

# అలహాబాద్ ఐఐఐటిలో నిజామాబాద్ విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రాహుల్(ఫైల్)

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** అలహాబాద్‌లో ఐఐఐటిలో మొదటి సంవత్సరం చదువుతున్న నిజామాబాద్‌కు చెందిన విద్యార్థి రాహుల్ మాదాల చైతన్య (21) తానుండే హాస్టల్ భవనం ఐదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన జన్మదిన వేడుకలకు ఒక్కరోజు ముందు ఇతను ఆత్మహత్యకు పాల్పడడం అందరిని కలచి వేసింది. శనివారం అర్థరాత్రి జరిగిన ఈ ఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలావున్నాయి. నిజామాబాద్‌కు చెందిన రాహుల్ మాదాల చైతన్య ఓబిసి కోటాలో అఖిల భారత స్థాయిలో 52వ ర్యాంకు సాధించి అలహాబాద్ ఐఐఐటిలో సీటు సాధించాడు. అతను మొదటి సంవత్సరం విద్యార్థి. ఇటీవల జరిగిన పరీక్షల్లో అతను ఫెయిల్ అవడంతో అన్యమ నస్కంగా ఉంటున్నట్లు తోటి విద్యార్థులు తెలిపారు. ప్రయా గరాజ్ జాల్వా ప్రాంతంలో అలహా బాద్ ఐఐఐటి ఉంది. శనివారంరాత్రి నిజా మాబాద్‌లోని తన తల్లి స్వర్ణలతతో మాట్లా డిన తరువాత అర్థరాత్రి 11.55 గంటల సమయంలో తానుండే హాస్టల్ ఐదవ అంతస్తు పైనుంచి రాహుల్ కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీనిని గమనించి కొందరు వెంటనే పోలీసులకు, క్యాంపస్ అధికారులకు సమాచారం అందించడంతో రాహుల్‌ను హుటా హుటిన ఆసు పత్రికి తరలించారు. అక్కడ చికిత్స మొదలుపెట్టిన కాసే పటికే అతను చనిపోయాడు. కాగా రాహుల్ ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఎలాంటి లేఖ రాయ లేదని పోలీసులు తెలి పారు. రాహుల్ ఆత్మహత్య గురించి నిజామాబాద్‌లోని అతని తల్లిదండ్రులకు ఐఐఐటి అధికారులు వెంటనే సమాచారం అందించగా ఆదివారం మధ్యాహ్నం వారు క్యాంపస్‌కు చేరుకున్నారు. రాహుల్ ఆత్మహత్యపై తల్లి స్వర్ణలత మాట్లాడుతూ ఆత్మహత్యకు కొద్ది నిమిషాల ముందు తన కుమారుడు తనకు ఫోన్ ద్వారా మెసేజ్ చేశాడని, తమ్ముడిని జాగ్రత్తగా చూసుకోవాలని కోరాడని తెలిపారు.

తన కుమారుడు తనకు మెసేజ్ చేసిన వెంటనే తాను రాహుల్‌కు ఫోన్‌చేశానని, అయితే ఫోన్ స్విచ్ఛాఫ్‌రావడంతో ఇతర విద్యార్థులకు సమా చారం అందించి కుమారుడిని వెతకాలని కోరారని తెలిపారు. పది నిమిషాల తరువాత తోటి విద్యార్థులు ఫోన్ చేసి రాహుల్ భవనం పైనుంచి దూకిన విషయం, తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించిన విషయం చెప్పారని ఆమె ఆవేదనగా తెలిపారు.

# కొడాలి నాని ముంబయికి తరలింపు

**అక్కడే బైపాస్ సర్జరీ జరిగే అవకాశం**

**హైదరాబాద్ (బేగంపేట), మార్చి 31,ప్రభాతవార్త:** వైఎస్సార్సీ సీనియర్ నాయకుడు,మాజీ మంత్రి కొడాని నానిని సోమవారం బేగంపేట విమా నాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ముంబయికి తరలించారు, ఆయన ఆరోగ్యంపై సోమవారం ఉదయం నగరంలోని ఏఐజీ ఆసుపత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.ఈ నెల 26వ తేదీన కొడాలి నాని హార్ట్ ఎటాక్‌కు గురైన విషయం తెల్సిందే.అప్పటి నుంచి ఆయన హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో యాంజియో నిర్వహించిన వైద్యులు ఆయన గుండెలో మొత్తం మూడు వాల్స్ క్లోజ్ అవడంతో క్రిటికల్ సర్జరీచేసి హార్ట్ స్టంట్ లేదా బైపాస్ సర్జరీ చేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు.ఈ మేరకు కొడాలి నానిని బైపాస్ సర్జరీ నిమిత్తం కుటుంబసభ్యులు సోమవారం ఉదయం గం 11.30 సమయంలో బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమా నంలో ముంబయిలోని ఏషియన్ ఇనిసిట్యూట్‌కు తరలించినట్లు సమాచారం. అక్కడ ఆయన హార్ట్‌కు స్టంట్లు వేస్తారా లేక బైపాస్ సర్జరీ చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.



మాజీ మంత్రి మహముద్ అలీ, ఆజం ఆలీ తదితరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న కెటిఆర్. చిత్రంలో నాయక్ ఆలీ తదితరులు

## అలీకి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కెటిఆర్

**హైదరాబాద్ (మలక్‌పేట),మార్చి 31, ప్రభాతవార్త :** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ మలక్ పేట ఆజంపుర లోని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ నివాసంకు విచ్చేసి మహమూద్ అలీ, ఆజం అలీ తదితరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆజాం ఆలీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి అజంపురాకు విచ్చేసిన కేటీఆర్ కు ఘనంగా స్వాగతం పలికారు. మహమూద్ అలీ కుటుంబ సభ్యులతో కలసి కెటిఆర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి లాయక్ అలీ, హైదరాబాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అనితనాయక్, వైస్ చైర్మన్ కోరుడు భూమేష్, మాజీ డైరెక్టర్లు లలిత, ఎజాస్, సాయ భువనేశ్వరి గ్రేటర్ ప్రధాన కార్యదర్శులు మునవర్ ఖాన్, బాబు సుదర్శన్, డివిజన్ అధ్య క్షులు మంచికంటి జగన్, హయ్యత్ హుస్సేన్ హబీబ్ ,చల్లూరి రఘునందన్ రెడ్డి కామేష్, పగిళ్ళ శ్రీనివాస్ రెడ్డి, మారుతి, నాయకులు లలిత గౌర శశిధర్, శ్రీధర్ రెడ్డి,తేల్ల మహేష్ కుమార్, ఫైబర్ టెల్ రాజు, కావేటి ధర్మరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులపై పోలీసు చర్య అమానుషం: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 31 ప్రభాతవార్త:** సెంట్రల్ యూనివర్సిటిలో అక్రమంగా 400 ఎకరాల భూమిని వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలు విద్యార్థి సంఘాలు విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు విద్యార్థులపై విచక్షణా రహితంగా లాఠిచార్జి చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తీవ్రంగా ఖండించారు. యూనివర్సిటి హాస్టల్‌లోని రూంలోకి పోలీసులు వెళ్ళి విద్యార్థులపై అన్యాయంగా దాడి చేసి, గుంజుకుపోయి వారిని వ్యాన్‌లోకి ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించడా దారుణమన్నారు. విద్యార్థులు ఏమైన తీవ్రవాదులా? లేక సంఘ విద్రోహ శక్తులా? అని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందన్నారు. భావి తరాలకు గజం స్థలం కూడా ఉంచకుండా విక్రయించాలనే నిర్ణయం ప్రభుత్వానికి సమర్థనీయం కాదని, భవిష్యత్తు తరాలకు విద్యార్థులకు భవనాల నిర్మాణాలకు, హాస్టల్స్ నిర్మాణాలకు స్థలాలు ఉండాలే కాని అక్రమంగా వందల ఎకరాలు అమ్మితే తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఇద్దరూ రిసెర్చ్ స్కాలర్స్ నవీన్‌కుమార్, డా. రోహిత్‌ల మీద అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.



బిసిల మహాధర్నా కోసం జంతర్‌మంతర్ వద్ద సోమవారం ఏర్పాట్లను పరిశీలిస్తున్న యుగంధర్‌గౌడ్ తదతరులు

## బిసి బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి

### బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్

**హైదరాబాద్(సైఫాబాద్), మార్చి 31 ప్రభాతవార్త:** అవకాశం వచ్చినప్పుడల్లా తాను బిసినని ప్రధాని నరేంద్రమోదీ చెప్పుకోవడం కాదని, బిసిల పట్ట చిత్తశుద్ధి ఉంటే బిసిల రిజర్వేష్లను 42 శాతంకు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం బిల్లును తక్షణమే పార్లమెంట్‌లో అమోదించాలని బిసి పొలిటికల్ జెఎసి ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఏప్రిల్ 2వ తేదీన బిసి సంఘాల ఆధ్వర్యంలో జరిగే 'మహాధర్నా' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం బిసిల రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచుతూ తీర్మానం చేయించడం జరిగిందన్నారు. బిసిలపట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని, బిసిలకు భరోసా కల్పించిన రాహుల్‌గాంధీ, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన బిసి సమాజం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు మేకపోతుల నరేందర్‌గౌడ్, ఆళ్ళ రామకృష్ణ, వట్టికూటి రామారావుగౌడ్, కిరణ్‌కుమార్, పరికిపండ్ల అశోక్, బడేసాబ్, చింతపల్లి సతీష్, వివి గౌడ్, అంజన్నయాదవ్, దేవర శివ, రాఘవేందర్, బిక్షపతి, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం ధన్వాడలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

## యువతకు ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం

### కులగణన ద్వారా బలహీన వర్గాలకు రిజర్వేషన్

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీధర్‌బాబు

**కాటారం, మార్చి 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు 80 శాతం సబ్సిడీతో రుణ ఆర్థిక సహాయం అందించేందుకు రాజీవ్ యువ వికాస పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మంత్రి శ్రీధర్ బాబు స్వగృహం ధన్వాడ గ్రామంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ముస్లిం సోదరులకు మంత్రి శ్రీధర్ బాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గత పదేళ్లలో మైనార్టీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో దేశంలోనే మొదటిసారిగా కులగణన సర్వే చేసి బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో బలహీన వర్గాల సంక్షేమం కోసం రిజర్వేషన్లు కల్పించామన్నారు. గత పది ఏళ్లలో బీసీ కార్పొరేషన్ నిర్వీర్యమైపోయిందని, ఎలాంటి నిధులు రాక సంక్షేమం కుంటుపడిందని శ్రీధర్ బాబు ఆరోపించారు. రాజీవ్ యువశక్తి ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ఏప్రిల్ నెల ఐదో తేదీలోపు దరఖాస్తులు తీసుకొని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లకు సబ్సిడీతో రుణాలు ఇవ్వనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పంతకాని సమ్మయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఓన్న వంశ వర్ధన్ రావ్, యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ అధ్యక్షులు చీమల సందీప్, యూత్ కాంగ్రెస్ కాటారం మండల అధ్యక్షులు చీటూరి మహేష్ గౌడ్, సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు, గంగారం మాజీ సర్పంచ్ తెప్పెల దేవేందర్ రెడ్డి, చీర్ల తిరుపతి రెడ్డి, రాజవీరు, గద్దం కొమరయ్య, శంకరం పల్లి మాజీ సర్పంచ్ అంగజాల అశోక్, మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్‌టిఐ కమిషనర్ నియమాకమెప్పుడు?

### గడువు దాటినా స్పందనేది?

**హైదరాబాద్, మార్చి 31 ,ప్రభాతవార్త :** రాష్ట్రంలో సమాచారం తెలుసుకునే హక్కు ఉన్నాట్టా లేనట్టా అనే విమర్శలు వస్తున్నాయి. ఆర్‌టిఐ కమిషనర్ కార్యాలయానికి రోజులు తరబడి వచ్చేవారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది నెలలుగా ఆర్‌టిఐ ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయక పోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చి సుమారు 15 నెలలు దాటినా ఆయా పోస్టులను భర్తీ చేయక పోవడంతో పలు అనుమానాల వ్యక్తం అవుతున్నాయి . సమాచార హక్కు చట్టం విషయంలో న్యాయస్థానాల తీర్పులను కూడా ప్రభుత్వం పక్కన పెట్టిందనే ఆరోపణలు వస్తున్నాయి. నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. సమాచార హక్కు కమిషనరేట్‌లో ఏ కమిషనర్ లేక దరఖాస్తులు పేరుకు పోతుంటే దరఖాస్తు దారులు మాత్రం సదరు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాన కమిషనర్‌తో పాటు కమిషనర్లను నియమిస్తానంటూ రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వారు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి కమిషనర్ల పదవి కాలం ఫిబ్రవరి 2023 నాటికే ముగిసింది. అప్పటి నుంచి సమాచర హక్కు ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలింది. కమిషనర్లు లేక పోవడంతో సుమారు 30 నుంచి 40 వేల వరకు ఉన్న ఫైళ్ళు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి రాష్ట్ర సమాచార కమిషనర్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వారికి మా చేతుల్లో ఏమి ఉంది అనే సమాధానం ఆర్‌టిఐ కమిషనర్ కార్యాలయ సిబ్బంది నుంచి వస్తోంది. దీంతో ఇదెక్కడి పాలన అంటూ నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు,సుప్రీం కోర్టు ప్రభుత్వాలను ఆదేశించిన ఫలితంగా కమిషనర్ల ఏర్పాటుకు 2023 జూన్ 12న నోటిషికేషన్ విడుదలై,అదే నెల 29 నాటికి దరఖాస్తుల గడువు తేదీ కూడా ముగిసిపోయింది. గత ప్రభుత్వంలో జులై 2023 నాటికి సుమారు 350 మంది ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. పాత,కొత్త దరఖాస్తులన్ని కలిపి సుమారు 800కుపైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సుమారు 60 మందికి పైగా రిటైర్డ్ ఐఎస్ఎస్, ఐపిఎస్ ఆఫీసర్లు కూడా ఉన్నారు.

ఆర్‌టిఐ ప్రధాన కమిషనర్‌ల పోస్టుల కోసం 1:3 చొప్పన షార్ట్ లిస్టును తయారు చేశారు. నియకమాకం విషయంలో ప్రక్రియ కొనసాగుతుందని గత ప్రభుత్వం కోర్టుకు కూడా నివేదించి. ఇందుకు సంబంధించిన నివేదికను కూడా గడువు తేదీ నాటికి అందించింది. గడువు పూర్తయినా ప్రభుత్వం స్పందించక పోవడంతో కోర్టు దిక్కారణ కింద కోర్టు మెట్లు ఎక్కేందుకు పలువురు సిద్ధం అవుతున్నారు.

## ఎంఎంటీఎస్

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మార్చి 31 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంఎంటీఎస్ అత్యాచారయత్న ఘటన బాధితురాలిని కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎంటీఎస్ రైలులో యువతిపై జరిగిన అత్యాచారయత్న ఘటన భాదాకరమని అన్నారు. యువతికి మూడు సర్జరీలు అయ్యాయని క్రమ క్రమంగా ఆమె కోలుకుంటుందన్నారు. గాంధీ ఆసుపత్రి నుండి మెరుగైన వైద్యం కోసం యశోద ఆసుపత్రికి తీసుకువచ్చి ఆసుపత్రిలో అయ్యే ఖర్చులను తామే భరిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిందితుడిని పట్టుకున్నామని చెప్పినప్పటికీ పోలీసులు



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఇంకా నిందితుడి కోసం వెతుకుతున్నామని చెబుతున్నారని, ఈ విషయంలో స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నా నిందితుడిని పట్టుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణలో ఇటీవల మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు చూస్తుంటే మహిళలకు భద్రత కరువైందని స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందంటూ రాష్ట్ర ప్రభుత్వం నెట్టేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## 3న కొత్త ఎక్సైజ్‌స్టేషన్ల ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 31 ,ప్రభాతవార్త:** హైదరాబాద్, రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్‌లో 13 వరంగల్ రూరల్‌లో ఒక కొత్త ఎక్సైజ్ స్టేషన్లను ఏప్రిల్ 1న బదులు ఏప్రిల్ 3న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మూడు కొత్త స్టేషను ప్రారంభించేందుకు ఎక్సైజ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఒకటో తారీఖున కొత్త స్టేషన్ల ప్రారంభం వాయిదా పడినట్లు సమాచారం. కొత్త పోలీస్ స్టేషన్ల ను ప్రారంభించడానికి జిహెచ్‌ఎంసిలో ఎన్నికల కోడ్ ఉన్నందున అనుమతులు తీసుకున్న అనంతరం ఈనెల ఏప్రిల్ 3 కొత్త పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవానికి ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి డివిజన్ లోని గండిపేట కొత్త పోలీస్ స్టేషన్‌ను, సంగారెడ్డి పరిధిలో అమీన్ పుర పోలీస్ స్టేషన్లను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లితో పాటు తోపాటు ముఖ్య కార్యదర్శి ఎస్,ఎం. రిజ్వి,ఎక్సైజ్ కమిషనర్ చెవూరి హరికిరణ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. మిగిలిన ఎక్సైజ్ స్టేషన్లను ఆయా ప్రాంతాల్లో అధికారులు చేతులు మీదుగా ప్రారంభించనున్నారు.

## హెచ్‌సియు భూముల అమ్మకానికి వ్యతిరేకంగా బిజెపి పోరాటం

### ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** భూముల అమ్మకానికి వ్యతిరేకంగా బిజెపి పోరాటం చేస్తోందని ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ గత రెండు వారాలుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గందరగోళ పరిస్థితి కొనసాగుతుందన్నారు. హైద రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మాలని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఈ భూముల్లో ఎన్నో వనరులు ఉన్నాయని, ప్రకృతికి హాని చేసేలా భూములను విక్రయించొద్దని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారన్నారు. హెచ్‌సియు భూముల అమ్మకంపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టులో పిల్ దాఖలైందన్నారు. ప్రభుత్వ భూమిని అమ్ముతామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా విలువైన భూములను విక్రయించింది. రాజేంద్రనగర్, బుద్వేల్ ప్రాంతాల్లో వందల ఎకరాల విలువైన భూములు అమ్మారు. ఇప్పుడు అదే బిఆర్ఎస్ నేతలు ధర్నా చేయడం విడ్డూరంగా ఉంది. ఈ అంశంపై బిజెపి ఎమ్మెల్యేలతో పాటు లాయర్లతో కూడిన ఫ్యాక్ట్ ఫైండింగ్ టీమ్‌ను యూనివర్సిటీకి పంపించనున్నట్లు తెలిపారు. మాజీ ఎంపి సీతారాం నాయక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల భూములను అమ్మడం అంటే, మన భవిష్యత్ తరాలకు చెందిన మూలాధారాన్ని కోల్పోవడమేనన్నారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గుడులు, బడుల భూమిని అమ్మాలని చూశాయని, విద్యార్థుల అవసరాలు తీర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కాని ప్రభుత్వం నడపడానికి యూనివర్సిటీ భూములను అమ్మాలనుకుంటే ఏ విద్యార్థి సహించరు. బిజెపి ఊరుకోదన్నారు.

## హెచ్‌సియు భూములు అమ్మాలన్న ఆలోచన విరమించాలి

### బిజెపి ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హెచ్‌సియు భూములను అమ్మి అప్పులు కట్టాలని నీచమైన ప్రయత్నం చేస్తుందని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రానికే తలమానికం అన్నారు. కొన్ని వేలమంది నిష్ణాతులను తీర్చిదిద్దిదని అన్నారు. భూముల అమ్మకాన్ని విద్యార్థులు అధ్యా పకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చిందన్నారు. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతుందన్నారు. రేవంత్ రెడ్డి ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారు తెలియడం లేదన్నారు. 15 నెలలుగా ప్రతి నిర్ణయం ప్రజాకటకం, ప్రజా వ్యతిరేకమైనదే. అన్నీ తిరోగమన చర్యలు అన్నారు. హెచ్‌సియు విద్యార్థుల మీద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారికి సంఘీభావం తెలుపుతున్నామన్నారు. అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు. విశ్వవిద్యాలయం భూములు అమ్మకూడదని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## నాలుగు వందల ఎకరాల భూమి వర్సిటీదే..

### విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

### నేడు హెచ్‌సియు వద్ద ధర్నా : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సోమవారంనప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జాన్ వెస్లీ తదితరులు

**హైదరాబాద్, మార్చి 31,ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 4వందల ఎకరాల భూమిని టెండర్ల ద్వారా18 వేల కోట్ల రూపాయిలకు అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని దానిని అడ్డుకున్న విద్యార్థులను నిర్భందించి అరెస్టులు చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. ఆభూమి ముమ్మాటికీ సెంట్రల్ యూనివర్సిటీదే అన్నారు. అప్పట్లో ఆ భూమిని సెంట్రల్ యూనివర్సిటీకి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతోనే ఇప్పుడు ప్రభుత్వ భూమని చెబుతున్నారన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థునుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు బాగాలేదన్నారు. ప్రభుత్వ తీరు, విద్యార్థుల నిర్భంధం, అరెస్టులకు నిరసనగా మంగళవారం హెచ్‌సియూ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ విద్యార్థులను నిర్భందించడం ఏడో గ్యారంటీ అవుతుందా అంటూ ప్రశ్నించారు. యూనివర్సిటీల భూములను అమ్ముకుని సొమ్ము చేసు కోవాలనుకోవడం మానుకోవాలన్నారు.

విద్యార్థి సంఘం అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని యూనివర్సిటీ భూమి వేలం ద్వారా అమ్మకం చేస్తానన్న ఆలోచన విరమించుకోవాలన్నారు. సమావేశంలో సెంట్రల్యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు పాలడుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి31:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గంగా జమున తెహజీబ్‌కు తెలంగాణ నిలయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో మైనారిటీల అభివృద్ధికి విశేష కృషి చేశామని తెలిపారు. మత సామరస్యం, లౌకికవాద పాలనతోనే శాంతి భద్రతలు నెలకొంటాయని చెప్పారు. అభివృద్ధికి సామాజిక ప్రశాంతత కీలకమని వెల్లడించారు. బీఆర్ఎస్ విధానాలను కొనసాగిస్తే మరింత ప్రగతి సాధ్యమని తెలిపారు.

# సంస్థాగత బలోపేతంపై బిజెపి దృష్టి

### నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశం

### ఏప్రిల్ 6 నుంచి 12వ తేది వరకు పలు కార్యక్రమాలు: కాసం వెంకటేశ్వర్లు



**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిజెపిని మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో పార్టీ నేతలు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే జిల్లా అధ్యక్షుల నియామకాలను పూర్తిచేశారు. అందులో భాగంగానే సోమవారం కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశనం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు డాక్టర్.కె. లక్ష్మణ్, ఎంపి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్, రాష్ట్ర ఇంచార్జ్ అభయ్ పాటిల్, సంఘటన మంత్రి చంద్రశేఖర్, పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంస్థాగతమైన అంశాలతో పాటు ముఖ్యమైన కార్యక్రమాలపై చర్చించడం జరిగింది. సమావేశ వివరాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మీడియాకు వెల్లడించారు. ఏప్రిల్ 6న బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 6 నుంచి 12 తారీఖు వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ 8, 9 తేదీల్లో మండలాల వారీగా క్రియాశీలక కార్యకర్తల సమ్మేళనాలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో గావ్ ఛలో, బస్తీ ఛలో అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 14 నుంచి అంబేద్కర్ విగ్రహాల వద్ద స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఏప్రిల్ 15, 16న జిల్లా స్థాయిలో చర్చా వేదికలు నిర్వహిస్తాం. రాష్ట్రంలో 40.78 లక్షల బిజెపి సభ్యత్వ నమోదు జరిగడం శుభపరిణామం. 45 వేల క్రియాశీల సభ్యత్వం జరిగిందన్నారు. 22 వేల బూత్ కమిటీలు పూర్తయ్యాయినట్లు తెలిపారు. 15 ఏప్రిల్ వరకు మొత్తం బూత్ కమిటీల నియామక ప్రక్రియ పూర్తవుతుందన్నారు.


# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

### నిందితుల అరెస్టు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** వివాహేతర సంబంధాలు పచ్చని సంసారంలో చిచ్చురేపుతున్నాయి. ఇప్పటికే ఈ తరహా ఘటనలు అనేకం వెలుగు చూడగా తాజాగా నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో ప్రియుడితో కలిసి ఓ ఇల్లాలు భర్తను హత్య చేసింది. దీనిపై రంగంలో దిగిన పోలీసులు నిందితులను కటకటాల్లోనెట్టారు. వివరాలు ఇలావున్నాయి. బాన్సువాడ మండలం నాగారం గ్రామానికి చెందిన విఠల్ రెడ్డి (42)కి 20 ఏళ్ల క్రితం సోమేశ్వర్ గ్రామానికి చెందిన మేనమామ కూతురు కాశవ్వతో వివాహం జరిగింది. మేనమామ కూతురుతో వివాహం అయిన తరువాత విఠల్ రెడ్డి ఇల్లరికం వచ్చి తాపీ మేస్త్రీగా స్థిరపడ్డాడు. వీరికి ముగ్గురు అమ్మాయిలు వుండగా పెద్ద అమ్మాయికి వివాహం అయ్యింది. మిగతా ఇద్దరు అమ్మాయిలకు కూడా వివాహ సంబంధాలు చూస్తున్న తరుణంలో కాశవ్వ తన గ్రామానికే చెందిన మరో వ్యక్తితో కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలిసిన విఠల్ రెడ్డి భార్యను నిలదీయడంతో పాటు మందలించాడు. ఈ విషయమై దంపతుల మధ్య పలుమార్లు గొడవ జరిగింది. అయితే ప్రియుడి మోజులో వున్న కాశవ్వ భర్తను అంతమొందించాలని నిర్ణయించుకుంది. ఇదే అదనుగా గత శుక్రవారం భర్తను గ్రామ శివార్లలో గల పొలానికి తీసుకువచ్చి మద్యం తాగించింది. అనంతరం భర్త మద్యం మత్తులో వుండగా ప్రియుడికి ఫోన్ చేసి రప్పించింది. దీని తరువాత ఇద్దరు కలిసి విఠల్ రెడ్డి మెడకు టవల్ బిగించి స్పృహ కోల్పోయేలా చేసి అనంతరం ఇనుప పైపులతో తలపై బలంగా కొట్టి చంపేశారు. దీని తరువాత కాశవ్వ తన ప్రియుడితో కలిసి భర్త మృతదేహాన్ని స్థానిక కొల్లూరు సబ్ స్టేషన్ సమీపంలో రహదారిపై పడవేసి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. కాగా శనివారం ఉదయం విఠల్ రెడ్డి హత్య విషయం వెలుగు చూడగా ఏమీ తెలియనట్లు కాశవ్వ ఏడుపులు మొదలు పెట్టింది. అయితే కాశవ్వ వ్యవహారంపై పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా నిజం అంగీకరించి తానే ప్రియుడితో కలిసి హత్య చేసి నట్లు చెప్పింది. ఇద్దరు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేవలం వివాహేతర సంబంధం కారణంగానే ఈ హత్య జరిగిందని పోలీసులు తెలిపారు.

# 6న 'పెద్ది' ఫస్ట్ షాట్ రిలీజ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. జాతీయ అవార్డు గ్రహీత, ఉప్పెన ఫేమ్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్ చరణ్ పుట్టినరోజున విడుదల చేసిన టైటిల్, రెండు అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్లు గొప్ప ఇంపాక్ట్ ని క్రియేట్ చేశాయి. పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో, విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్‌పై గ్రాండ్‌గా నిర్మిస్తు న్నారు. ఉగాది సందర్భంగా, మేకర్స్ బిగ్ అప్‌డేట్‌తో చ్చారు. ఈ చిత్రం యొక్క మొదటి షాట్‌ను శ్రీరామ నవమికి ఏప్రిల్ 6న విడుదల చేయ నున్నారు. రామ్ చరణ్ జనసమూహం మధ్య గాలిలోకి దూకుతూ కనిపించిన అనౌన్స్మెంట్ పోస్టర్ ఇంటెన్స్ మూమెంట్‌ని ప్రజెంట్ చేస్తోంది. ఫస్ట్ షాట్ థ్రిల్లింగ్ ఎక్స్ పీరియన్స్‌ని అందిస్తుందని హామీ ఇస్తోంది. రామ్ చరణ్ పెద్ది కోసం కంప్లీట్‌గా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. రగ్గడ్, రస్టిక్ పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ చిత్రంలో జాన్వి కపూర్, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అవార్డ్ విన్నింగ్ టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎఆర్ రెహమాన్



సంగీతం అందిస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ ఆర్. రత్నవేలు ఐఎస్‌సి డీవోపిగా వర్క్ చేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్లా పని చేస్తున్నారు. తారాగణం: రామ్ చరణ్, జాన్వీ కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సానా, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, బ్యానర్: వృద్ధి సినిమాస్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఏఆర్ రెహమాన్, డిఓపి: ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై.ప్రవీణ్ కుమార్.

# 'ఆదిత్య 369' రీరిలీజ్‌కి ప్రిరిలీజ్ వేడుక

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన క్లాసిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ఆదిత్య 369' మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ సినిమా ఏప్రిల్ 4వ తేదీన రీరిలీజ్ అవుతోంది. భారతదేశ సినిమా చరిత్రలోనే టైమ్ ట్రావెల్ అనే పాయింట్ మీద రూపొందిన మొట్టమొదటి సినిమా 'ఆదిత్య 369'. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో, సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. నందమూరి బాలకృష్ణ ఈ సినిమాలో కృష్ణకుమార్ అనే యువకుడిగా, శ్రీకృష్ణదేవరాయలుగా అద్భుతమైన నటన ప్రదర్శించారు. 1991లో విడుదలై సంచలన విజయాన్ని సాధించిన ఈ



సినిమాను, 34 సంవత్సరాల తర్వాత 4కె డిజిటలైజేషన్, 5.1 సౌండ్‌తో మరింత అధునాతనంగా మళ్ళీ ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రి రిలీజ్ వేడుక తెలుగువారి పర్వదినం ఉగాది నాడు హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమం ప్రారంభంలో 'గౌతమీ పుత్ర శాతకర్ణి' సినిమాకి సంబంధించిన ఒక సన్నివేశాన్ని ఎ.వి.గా ప్రదర్శించారు. 'గౌతమీ పుత్ర శాతకర్ణి' సినిమాలో ఉగాది పర్వదినం గురించి చెప్పిన డైలాగ్‌ని ప్రదర్శించినప్పుడు అభిమానులు 'జై బాలయ్య' అని నినాదాలు చేశారు. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు చెన్నై నుంచి డిజిటల్ మాధ్యమం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా సంగీతం శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'ఈ సినిమాలో బాలకృష్ణ పోషించిన శ్రీకృష్ణ దేవరాయలు పాత్ర బాగా హైలైట్ అయింది. శ్రీకృష్ణ దేవరాయల పాత్ర నాకు చాలా ఇష్టం. ఇక ఆ పాత్ర ఎవరు వేయాలని ఆలోచిస్తున్నప్పుడు.. ఒకేఒక వ్యక్తి మదిలో వచ్చారు. నాడు రామారావు వేసిన శ్రీకృష్ణదేవరాయల పాత్రలో నేడు అంతే అద్భుతంగా రాణించాలంటే బాలకృష్ణకు మాత్రమే సాధ్యమవుతుందని నేను నిర్ణయించుకున్నాను. ఆ తర్వాత ఆయన్ను సంప్రదించడం, కథ చెప్పడం.. బాలకృష్ణకి స్టోరీ బాగా నచ్చి సినిమా చేద్దామని వెంటనే ఒప్పుకోవడం చకచకా జరిగిపోయాయి. కృష్ణదేవరాయలు అనుకున్న తర్వాత బాలకృష్ణ మినహా అప్పుడు ఎవరూ లేరు..ఇప్పుడూ ఎవరూ లేరు. ఆయన ఎవర్‌గ్రీన్‌అన్నారు. 'ఆదిత్య 369' మూవీ రీరిలీజ్‌కి సంబంధించిన ట్రైలర్ని దర్శకులు బాబీ, అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు బాబీ మాట్లాడుతూ, "ఈ సినిమా విడులైనప్పుడు నేను నాలుగో, ఐదో చదువుతున్నాను. గుంటూరులో చూశాను. ఈ సినిమాని రీరిలీజ్ చేస్తున్న కృష్ణప్రసాద్ గారికి కృతజ్ఞతలు. ఈ తరం వారికి ఈ సినిమాని చూపించాలన్న ఆలోచన రావడం చాలా గొప్ప విషయం. నేను బాలకృష్ణ గారితో రూపొందించిన 'డాకూ మహారాజ్' సినిమా కేరెక్టర్‌కి ఇన్‌స్పిరేషన్ 'ఆదిత్య 369'. రీరిలీజ్‌లో కూడా ఈసినిమా ఘన విజయం సాధిస్తుందన్న నమ్మకం వుంది" అన్నారు.దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ, "ఈ సినిమాని అద్దంకి శ్రీరామా థియేటర్‌లో చూశాను. అప్పుడు నాకు 9 సంవత్సరాలు. ఈ సినిమా వాల్ పోస్టర్ చూసి, బాగా ఆకర్షితుడణ్ణి అయ్యాను. సినిమా చూస్తుంటే ఇక మరో ప్రపంచంలోకి వెళ్లిన అనుభూతి కలిగింది. ఆ క్లాసిక్ మూవీని ప్రింట్ నుంచి డిజిటల్‌కి తీసుకురావడం అద్భుతం. ఇలాంటి సినిమాలను సేవ్ చేయడం అవసరం. బాలకృష్ణగారు చెప్పినట్టు ఇది రీరిలీజ్ కాదు.. ప్రిరిలీజ్.. అఖండ2 ముందు ఇది ఈ సినిమా బ్లాక్ బస్టర్ అవుతుంది. ఆరోజుల్లో ఈ సినిమా చూసే అదృష్టం మా జనరేషన్‌కి కలిగింది.

# హీరో నవదీప్ అడ్వెంచర్ ట్రిప్..

హీరో నవదీప్ సినిమాలే కాదు, ఇన్నోవేటివ్ బిజినెస్ మేన్ కూడా, అందరి ఆలోచనలకు భిన్నంగా అడ్వెంచర్ టూరిజమ్‌ను ప్లాన్ చేశాడు. అతడు ప్రపంచ సాహసికుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. అతడితో పాటు అడ్వెంచర్ ట్రిప్స్‌లో భాగం కావాలనుకునే ఔత్సాహిక సాహికులకు అతడు గొప్ప అవకాశం కల్పిస్తున్నాడు. బేర్ గిల్స్‌తో మరో అడ్వెంచర్ టూర్‌లా నవదీప్‌తో అడ్వెంచర్ ట్రిప్‌కి మీరు సిద్ధం కండి. ఇది ఎన్.ఎస్ 4 ట్రిప్. ఈ ఇనిషియేషన్ పేరు నవ్, లెట్స్ గో డీప్. ఇది టూరిస్టులను ఊరిస్తోంది. అతడు అడ్వెంచర్ టూర్‌లో భాగంగా కొన్ని ప్రదేశాలను ఎంపిక చేస్తాడు. అక్కడ సాహసికులు ఆకాశమే హద్దుగా చెలరేగే అవకాశం కల్పిస్తాడు. ఎవరెస్ట్ ఎక్కకపోయినా, దానికి ముందే ఉన్న లధఖ్‌కి ఎలా చేరుకోవాలో నవదీప్ వెంటే డేర్ చేస్తే తెలుస్తుంది. హిమాలయాలను, అక్కడి అందాలను, అక్కడి ఎక్స్‌పీరియన్స్‌ను ఈ ట్రిప్ ద్వారా పొందవచ్చు. ప్రకృతి అందాలను ఆస్వాధించవచ్చు. క్యూరేటెడ్, విలాసవంతమైన సాహసయాత్రలకు తీసుకెళుతూ అతడు మజాను అందిస్తాడు. లడఖ్ కఠినమైన ప్రకృతి దృశ్యాల నుండి ఐలాండ్‌లోని ఘాఢమైన అందాల వరకూ.. ఆఫ్రికా అభయారణ్యంలో క్రూర జంతువుల వరకూ ప్రతి ప్రయాణంలో సాహసాలను ఆస్వాధించాలంటే నవ్ డీప్ టూర్‌లో అడుగుపెట్టాల్సిందే. జీవితంలో ఒకే ఒక్కసారి.. ఒకవేళ ఇదే మొదటిసారి లేదా ఇదే చివరి అడ్వెంచర్ కూడా కావచ్చు. ప్రతి ప్రయాణం గమ్మత్తయిన అనుభవాన్ని మిగులుస్తుంది. నవదీప్ స్వయంగా మీ సహప్రయాణికుడిగా కొనసాగుతాడు. బహుశా ఇలాంటి సాహసాల కథలతో హాలీవుడ్‌లో చాలా సినిమాలొచ్చాయి. వాటిలో అడ్వెంచర్ ట్రిప్‌లో థ్రిల్స్ ఎలా ఉంటాయో అద్భుతంగా చూపించారు.



# 'శర్వా38' రెగ్యులర్ షూటింగ్

చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ మేకర్ సంపత్ నంది, కెకె రాధామోహన్, శ్రీ సత్యసాయి ఆర్ట్స్ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా ప్రాజెక్ట్ శర్వా38 రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ నుంచి ప్రారంభం బాలీవుడ్ స్టైలిస్టులు ఆలిమ్ హాకీమ్, పట్టణం రషీద్ సూపర్ విజన్‌లో శర్వా ఇన్క్రెడిబుల్ మేకోవర్ చార్మింగ్ స్టార్ శర్వా తన మొట్టమొదటి పాన్ ఇండియా ప్రాజెక్ట్ శర్వా38 ప్రారంభించడానికి సిద్ధంగా వున్నారు. ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కొలాబరేషన్ శర్వా, దర్శకుడు సంపత్ నంది ఇద్దరికీ ఒక ముఖ్యమైన మైల్ స్టోన్ ని చూస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. 1960ల చివరలో ఉత్తర తెలంగాణమహారాష్ట్ర సరిహద్దులో సెట్ చేయబడిన శర్వా38 ప్రేక్షకులను మరపురాని అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రం హైస్టేక్స్ పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోంది. శర్వా పాత్రను ప్రత్యేకంగా నిలబెట్టడానికి, టీం బాలీవుడ్ స్టైలిస్టులు ఆలిమ్ హాకీమ్, పట్టణం రషీద్‌ల నైపుణ్యాన్ని ఉపయోగించుకుంది. శర్వా మేకోవర్ ఇప్పటికే సంచలనం సృష్టిస్తోంది. తన న్యూ, బోల్డ్ హెయిర్‌స్టోను సినిమా 1960ల కాలపు స్టయిల్ని ప్రజెంట్ చేస్తోంది. శర్వా38కి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు, సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్. ఈ చిత్రం యొక్క రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో సహా పలు భాషలలో సినిమా విడుదల కానుంది. నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: సంపత్ నంది, నిర్మాత: కేకే రాధామోహన్,బ్యానర్: శ్రీ సత్యసాయి ఆర్ట్స్, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, డిఓపి: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ కుమార్ మన్నె, పిఆర్ఓ: వంశీ శేఖర్.



# రామాయణ మహాకావ్యం ఓ ఎపిక్ విజువల్ వండర్

ప్రముఖ నిర్మాత అభిషేక్ నామ ఎక్స్ ట్రార్డినరీ కథలను ప్రేక్షకులు ముందుకు తీసుకు రావడంలో పేరుపొందారు. ఇప్పుడు, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ సేతు నిర్మించేందుకు సిద్ధమ య్యారు. హరి కృష్ణ ఈ చిత్రానికి మరొక ప్రత్యేకతను జత చేస్తూ, సేతు ప్రేక్షకులను అలరించేలా మాత్రమే కాకుండా అద్భుతమైన క్యాలిటీతో విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నారు. పాపులర్ విజువల్ ఎఫెక్ట్స్ ఆర్టిస్ట్ హరి కృష్ణ, పుష్ప, దసరా వంటి బ్లాక్‌బస్టర్లకు తన అద్భుతమైన గ్రాఫిక్స్‌తో గుర్తింపు పొంది, ఇప్పుడు దర్శకుడిగా మారి ప్రేక్షకులను చారిత్రక గాథల్లోకి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. ఆయన అప్ కమింగ్ సినిమా సేతు, రామాయణ కథాప్రపంచాన్ని అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో బ్లెండ్ చేస్తూ ఒక కొత్త అనుభూతిని అందించనుంది. 15 సంవత్సరాలుగా విఎఫ్ఎక్స్ పరిశ్రమలో పని చేసిన హరి కృష్ణ, సినిమాటిక్ కలలను విజువల్ వండర్‌గా ఆవిష్కరించడంలో నైపుణ్యాన్ని సాధించారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన పలు చిత్రాలకు విశేషమైన విజువల్ ఎఫెక్ట్స్ అందించిన ఆయన, ఇప్పుడు సేతు ద్వారా దర్శకుడిగా మారి భారతీయ ఎపిక్ సినిమాలకు కొత్త నిర్వచనాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. సేతు భారతీయ పురాణాలలో ప్రసిద్ధమైన సంఘటనల ఆధారంగా రూపొందిన ఇప్పటివరకూ వినని కల్పిత కథ. రామాయణంలోని యుద్ధాలు, వీర గాథలు, త్యాగం, ధర్మబద్ధత వంటి అంశా లను ఈ కథలో ప్రతిబింబించనున్నారు. ప్రేక్షకులు యుద్ధ దృశ్యాలు, విస్తృతమైన ప్రకృతిదృశ్యాలు, పురాణ గాథలస్ఫూర్తిని అందించే విలక్షణమైన పాత్రలతో ఒక గొప్ప అనుభూతిని పొంద నున్నారు. ప్రేక్షకులు సేతు విడుదలను ఆసక్తిగా ఎదురు చూస్తుండగా, ఎపిక్ కథనాన్ని ఆధునిక టెక్నాలజీ ద్వారా మళ్లీ విన్నూత్నంగా ఎక్స్ పీరియన్స్ చేసే అవకాశం ఈ చిత్రంలో లభించనుంది. ఇదికేవలం సినిమా మాత్రమే కాదుహరి కృష్ణ, అభిషేక్ నామ కలిసి భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ఘనంగా ప్రజెంట్ చేసే ఒక విజువల్ వండర్. సేతు ఖచ్చితంగా ఒక చిరస్మరణీ యమైన చిత్రంగా నిలవనుంది.





ఫారియా అబ్దుల్లా నయా లుక్

# 'నా నీడ వెళుతుందా' లిరికల్ వీడియో విడుదల

సువిక్షిత్ బొజ్జ, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శని'. కార్తికేయ కొమ్మి దర్శకుడు. వారాహ మూవీ మేకర్స్ పతాకంపై బి.సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. 1990వ నేపథ్యంలో అందరి హృదయాలను హత్తుకునే ప్రేమకథగా ఈ చిత్రం రూపొందుతుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టైటిల్ టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి నా నీడ వెళుతుందా అనే లిరికల్ వీడియోను సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ నటించిన విరూపాక్ష చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకుని, ప్రస్తుతం యువ సామ్రాట్ నాగచైతన్యతో ఓ ప్రతిష్టాత్మక చిత్రాన్ని తెరకెక్కిస్తున్న కార్తీక్ దండు విడుదల చేశారు. అనురాగ్ కులకర్ణి, సునీత ఆలపించిన ఈ బ్యూటిఫుల్‌సాంగ్‌కు నారాయణ ఆవుల సాహిత్యం అందించారు. ఆనంద్ గుర్రాన బాణీలు సమకూర్చారు. దర్శకుడు మాట్లాడుతూ, ఈ సినిమా అందరిని 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాల్ని గుర్తుకు తెస్తుంది. అందరికి వాళ్ల వాళ్ల ప్రేమ కథలు కూడా గుర్తుకు వస్తాయి. తాజాగా విడుదలైన ఈ లిరికల్ వీడియో అందరి హృదయాలకు హత్తుకుంటుంది. ప్రేవలోని గాఢతను వర్ణించే ఈ సాంగ్‌ను ప్రముఖ నేపథ్య గాయకులు అనురాగ్ కులకర్ణి, సునీత తమ గాత్రంతో ప్రాణం పోశారు. త్వరలోనే విడుదల తేదిని కూడా ప్రకటిస్తాం అన్నారు. కథానాయకుడు సువిక్షిత్ మాట్లాడుతూ, 1990వ నేపథ్యంలో అందరికి కనెక్ట్ అయ్యే కథ ఇది. బ్యాక్‌డ్రాప్‌కు తగ్గ నటీనటులతో, లోకేషన్స్‌తో ఎంతో సహజంగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమా కోసం ఎంతో రీసెర్చ్ చేసి దర్శకుడు చిత్రాన్ని రూపొందించాడు. తప్పకుండా చిత్రాన్ని అందరూ ఎంతో బాగా ఎంజాయ్ చేస్తారు"అని తెలిపారు. సువిక్షిత్ బొజ్జ, గీతిర రతన్, భద్రం, కృష్ణారెడ్డి, కిట్టయ్య, చలపతి రాజు, జెమిని సురేష్, జి.భాస్కర్, భద్రమ్, లావణ్య రెడ్డి, తేజ చిట్టూరు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ: నారాయాణ ఆవుల, డైలాగ్స్: కాకర్ల చరణ్, లక్ష్మణ్.కె, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: జె.సుబ్బా రెడ్డి, సంగీతం: ఆనంద్ గుర్రాన, పీఆర్‌ఓ: ఏలూరు శ్రీను, మడూరి మధు.



# 'ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మ్యాడ్ స్క్వేర్'

వేసవిలో వినోదాన్ని పంచడానికి థియేటర్లలో అడుగుపెట్టిన మ్యాడ్ స్క్వేర్ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ, భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. బ్లాక్ బస్టర్ చిత్రం మ్యాడ్‌కి సీక్వెల్‌గా రూపొందిన ఈ మ్యాడ్ స్క్వేర్‌లో నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. భీమ్స్ సిసిరోలియో పాటలను స్వరపరచగా, తమన్ నేపథ్య సంగీతం అందించారు. భారీ అంచనాల నడుమ మ్యాడ్ స్క్వేర్ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లలో నవ్వులు పూయిస్తున్న ఈ చిత్రం.. మూడు రోజులలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.55.2 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టింది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన దర్శకుడు కళ్యాణ్ శంకర్ తన ఆనందాన్ని పంచుకున్నారు.

**మ్యాడ్‌కి రెట్టింపు వినోదం మ్యాడ్ స్క్వేర్‌తో అందిస్తామని చెప్పారు. ఆ మాట నిలబెట్టుకున్నాం అనుకుంటున్నారా?** ఖచ్చితంగా. స్వయంగా కొన్ని థియేటర్లకు వెళ్ళి చూశాం. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ సినిమా చూసి బాగా ఎంజాయ్ చేస్తున్నారు. మ్యాడ్ ఎక్కువగా యువతకి చేరువైంది. కానీ, మ్యాడ్ స్క్వేర్ చిత్రాన్ని యువతతో పాటు, కుటుంబ ప్రేక్షకులు కూడా ఆదరిస్తున్నారు.

**ఈ స్థాయి స్పందన ముందే ఊహించారా?** లేదండి. సినిమాకి మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది కానీ, మ్యాడ్1 ఫుల్ రన్ కలెక్షన్స్‌ని మొదటి రోజే రాబట్టే స్థాయిలో మ్యాడ్ స్క్వేర్ పై అంచనాలు ఉన్నాయని అసలు ఊహించలేదు.

**"పెద్ద కథ ఆశించి సినిమాకి రాకండి, సరదాగా నవ్వుకోవడానికి రండి" అని ముందే చెప్పడం ఎంతవరకు ప్లస్ అయింది?** చాలా ప్లస్ అయింది. మన సినిమా ఎలా ఉండబోతుందో ముందే చెబితే, ప్రేక్షకులకు అందుకు తగ్గ అంచనాలతోనే థియేటర్‌కి వస్తారు. రాజమౌళి గారు కూడా సినిమా మొదలుపెట్టే ముందే కథ ఇలా ఉండబోతుంది అని చెప్తుంటారు. అలా చెప్పడం వల్ల ప్రేక్షకులను మనం ముందే ప్రిపేర్ చేసినట్టు అవుతుంది.

**సెకండ్ హాఫ్ డల్ అయిందనే మాటలు కొన్ని వినిపించాయి కదా?** మొదటి షోకి కొందరు అలా అన్నారు కానీ, తర్వాత షోల నుంచి ఫస్ట్ హాఫ్ కంటే సెకండ్ హాఫ్ ఇంకా ఎక్కువ ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా సెకండ్ హాఫ్‌లో సునీల్‌కి, మురళీధర్‌కి మధ్య వచ్చే సన్నివేశాలను చూసి ఫ్యామిలీ ఆడియన్స్ బాగా నవ్వుకుంటున్నారు.

**మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటి..?** మా ఫ్రెండ్ వాళ్ళ మదర్ థియేటర్‌లో సినిమా చూసి 15 ఏళ్ళు అవుతుంది. అలాంటావిడ మ్యాడ్ స్క్వేర్ టీజర్ చూసి, సినిమాకి తీసుకెళ్లమని అడిగారట. సినిమా చూస్తూ నవ్వి నవ్వి కళ్ళలో నీళ్లు తిరిగాయి అన్నారట. ఆ వయసు వాళ్ళు నా సినిమా చూసి, అంతలా నవ్వుకున్నామని చెప్పడాన్ని.. నేను బెస్ట్ కాంప్లిమెంట్‌గా భావిస్తున్నాను.

**నిర్మాత చినబాబు గురించి?** చినబాబు



దర్శకుడు కళ్యాణ్ శంకర్

మొదటి నుంచి మాకు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు.

**ఎడిటర్ నవీన్ నూలి గురించి?** ఈ సినిమా ఇంత బాగా రావడంలో ఎడిటర్ నవీన్ నూలి పాత్ర ఎంతో ఉంది. సినిమా అంతా తీయడం అయిపోయిన తర్వాత ఎడిటింగ్ చేయడం కాకుండా, షూటింగ్ దశ నుంచి మాతో ట్రావెల్ అయ్యారు. ప్రతి షెడ్యూల్‌కి ముందు ఆయనతో చర్చించి, క్రిస్ప్ రన్ టైం వచ్చేలా చేశాము.

# నారి నారి నడుమ మురారి ఫస్ట్ సింగిల్

చార్మింగ్ స్టార్ శర్వా హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ నారి నారి నడుమ మురారి. సామజవరగమన ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యే దశలో ఉంది. అనిల్ సుంకర ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి నిర్మించిన ఈ చిత్రంలో సాక్షివైద్య, సంయుక్త కథానాయికలుగా నటించారు. ఇప్పటికే, సినిమా నుండి ఫస్ట్ లుక్, ఇతర పోస్టర్లు మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు మేకర్స్ సినిమా ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా మ్యూజిక్ జర్నీ ఏప్రిల్ 7న విడుదల కానున్న శర్వా, సంయుక్త నటించిన దర్శనమే అనే పాటతో ప్రారంభమవుతుంది. విశాల్ చంద్ర శేఖర్ సంగీతం అందిస్తున్నారు. సాంగ్ పోస్టర్‌లో శర్వా, సంయుక్త రొమాంటిక్ బైక్ రైడ్ ఆస్వాదిస్తున్నారు. శర్వా క్యాజువల్ టీషర్ట్, బ్లాక్ ప్యాంటులో చాలా స్టైలిష్‌గా కనిపిస్తుండగా, సంయుక్త తన సాంప్రదాయ దుస్తులలో అందంగా వుంది.ఈ చిత్రానికి జ్ఞాన శేఖర్ వి.ఎస్, యువరాజ్ సినిమాటోగ్రఫీ నిర్వర్తిస్తున్నారు. భాను బోగవరపు కథను రాశారు, నందు సావిరిగణ సంభాషణలను అందించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. అజయ్ సుంకర సహ నిర్మాతగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తారాగణం: శర్వానంద్, సంయుక్త, సాక్షివైద్య, సాంకేతిక సిబ్బంది: స్క్రీన్ ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు, నిర్మాతలు: అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర.



# తొట్టిలో ఖర్బూజా..

**వేసవిలో దాహార్తిని తీర్చి, తియ్యటి రుచితో నోరూరించే పండు ఖర్బూజా. దీన్ని మన పెరట్లోనే సులువుగా పెంచుకో మీకు తెలుసా? లేదంటే చదివేయండి.**



ఖర్బూజా పండ్లనే మాస్క్ మెలన్ అని కూడా పిలుస్తారు. మెలన్ రకాల్లో మాస్క్ మెలన్ (కుకుమిస్) కూడా ఒకటి. పెద్ద పెద్ద ఆకులు, పసుపు రంగు పూలతో ఉంటుంది. పండ్లమీద పొర వల్ల డిజైన్ చేసినట్లే కనిపిస్తుంది. ఈ పండు తియ్యటి సువాసనలు వెదజల్లుతుంది కాబట్టే మాస్క్ మెలన్ అనే పేరొచ్చిందట. మాస్క్ అంటే పర్షియన్ భాషలో పరిమళం అని అర్థం. మెలోనియం(మెలన్)కు లాటిన్ మూలం. ఇది గార్డ్ జాతికి చెందినది. గుమ్మడి, స్క్వాష్ పుచ్చకాయ వంటివన్నీ ఈ తరహాలోనే వీటిని వేల సంవత్సరాలుగా ఆసియాలో సాగు చేయడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి.

**ఎలా పెంచాలంటే...** ఖర్బూజా పాదుని నేలలోనే కాదు కుండీల్లోనూ పెంచుకోవచ్చు. అయితే, అది విస్తరించేందుకు తగిన స్థలం అవసరం. కుండీల్లో సారవంతమైన మట్టి నింపి తగిన ఆధారం ఇస్తే చాలు. ఏంచుకునే తొట్టె వెడల్పుగా, లోతు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఈ పాదుకి స్లో రిలీజింగ్ ఫెర్టిలైజర్ ఇవ్వాలి. నీళ్ల క్రమం తప్పకుండా పోయాలి. తేమ కోల్పోకుండా పాదు. మొదట్లో మల్చింగ్ చేసుకోవాలి. అయితే, ఆకుల్ని మాత్రం తడపొద్దు. ఆరేడు గంటల ప్రత్యక్ష కాంతి అవసరం. కాయలు వచ్చాక... జారిపోకుండా, మొక్కపై భారం పడకుండా ఆధారం ఇస్తే మంచిది.



ముఖ్యంగా కాండం దెబ్బతినకుండా చూసుకోండి. విత్తనాలను సీడింగ్ ట్రేల్లో పెట్టి మొలకెత్తాక దాన్ని కుండీల్లోకి మార్చుకోవాలి. దీన్ని తెల్లదోమ, ఈగలు, ఆకుతొలిచే పురుగులు... వేధిస్తాయి. ఇలాంటప్పుడు బేకింగ్ సోడా, సర్ఫ్ వాటర్ మిశ్రమాన్ని తీగపై పదిహేను రోజులకోసారి పిచికారీ చేస్తే సరి. సమస్య దూరమవుతుంది. నిండుగా పండ్లూ వస్తాయి.

# పాత్ర ఒకటి, పనులనేకం



గ్రేటర్లు, స్లైసర్లూ ఎప్పట్నించో ఉన్నవే. కానీ వాటితో పళ్లెంలోకి తురుముతాం. అది బెసికిపోతుంటుంది. అలాంటి ఇబ్బంది లేకుండా మల్టీ ఫంక్షనల్ గ్రేటర్ బౌల్ అందుబాటులోకి వచ్చింది. కొబ్బరి లాంటి వాటిని మూత మీద తురిమితే.. కింద బౌల్‌లో పడుతుంది. స్లైసులూ చేయొచ్చు. ఈ పాత్రలో కూరగాయల్ని కడగొచ్చు. ఉడికించవచ్చు, ముక్కల్ని భద్రం చేయొచ్చు కూడా. ఇంటింటా ఉండాల్సిన సాధనమిది.

# పేదవారికి ఉపాధి కల్పిస్తూ..

**అక్స్ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా. విదేశీ సంస్థలో ఉద్యోగం. అంతర్జాతీయ అవార్డులు ఇస్తున్నారు. త్వరలో ప్రమోషన్... ఇంతకన్నా ఏం కావాలి అనిపిస్తుంది. ఎవరికైనా. కానీ బిందు మాత్రం.. నాకు కావాల్సింది ఇదేనా అని ప్రశ్నించారు. ఆ ప్రశ్న ఇప్పుడు వందల జీవితాలను మారుస్తోంది.**




బిందు వినోదని బెంగళూరు. పెరిగిందేమో ముంబయి. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ నుంచి. ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పట్టా పొందారు. తర వాత డిస్నీ వరల్డ్ చేరారు. తన పనితనంతో ఎన్నో హోదాలు, గ్లోబల్ అవార్డులూ అందుకున్నారు. త్వరలో ఎక్స్ పీరియన్స్ ఆఫీసర్ అయ్యే అవకాశం అప్పుడు 'నాకు కావాల్సింది ఇదేనా?' అన్న ప్రశ్న ఎదురైంది. దీంతో ఉద్యోగం వదిలి బెంగళూరుకు చేరుకున్నారు. బిందు. ఒక ప్రణాళిక లేదు... ఏం చేయాలన్నా స్పష్టత లేదు. అందుకని సెక్స్ వర్కర్లకు రిహాబిలి టేషన్, ఉపాధి అందించే ఓ ఎన్‌జిఓలో చేరారు. అప్పుడే ఏం చేయాలన్న స్పష్టత వచ్చిందామెకు దాని ఫలితమే 2017లో ప్రారంభమైన మోన ధ్వని' మహిళల మోనం వెనక చెప్పలేని సంఘర్షణ ఉంటుంది. దానికి గుర్తుగానే సంస్థకు 'మోన ధ్వని' అని పేరు పెట్టింది. వలంటీరుగా చేస్తున్నప్పుడు పేదరికం, పిల్లల అక్రమరవాణా, బాండెడ్ లేబర్... ఇలా పడుపు వృత్తిలోకి రావడానికి బోలెడు కారణాలు కనిపించాయి. వాటిని మార్చాలని ఒడిశాలోని చూలియాపోసి గ్రామాన్ని ఎంచుకోవచ్చు. ఇక్కడ రోడ్లు, స్కూలు, ఆసుపత్రి తాగునీరువంటి కనీస సౌకర్యాలు లేవు. యువత పనికోసం నగరాలకు వలస వెళ్లేవారు. లేదా తాగుడికి బానిసలై అప్పులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకునేవారు. దాంతో మహిళలు వెట్టి చాకిరీలోకి వెళ్లాల్సి వచ్చింది. తినడానికి తిండి ఉండదు. పిల్లలు అకస్మాత్తుగా మాయమయ్యేవారు. రేపటి గురించి ఆలోచించే ఓపిక కూడా లేని ఊరదిఖి అంటారు బిందు. ఆ జిల్లో కొన్నాళ్లు గడిపాక.. అది సంతాలీ నేతకి పెట్టింది పేరని తెలుసుకున్నారామె. దానిలోనే ఉపాధి కల్పించాలనుకుంటే బెదిరింపులొచ్చాయి. 'కర్రలు, రాడ్లతో దాడి చేశారు. మావోయిస్టు 'అనుకుని పోలీస్ స్టేషన్' కి తీసుకెళ్లారు. నిజం చెప్పొద్దు... చాలా భయపడ్డా. అన్నీ వదిలేసి వెళ్లిపోదామనుకున్నా. ఇంతలో ఆ ఊరి వృద్ధుడు కొంతమంది మహిళలతో వచ్చాడు. నువ్వు మళ్లీ వస్తావు కదా తల్లీ అని ఆత్రంగా అడిగాడు. వాళ్లనలా చూశాక ఉండి పోవాలని నిశ్చయించుకున్నా అంటారు బిందు.

**ఉపాధి... ఆరోగ్యం...** దశాబ్దాల క్రితం కనుమరుగైన సంతాలీ చేనేతను తిరిగి వృద్ధిలోకి తీసుకురావడానికి రెండేళ్ల రికార్డులు తిరగేస్తూ, మ్యూజియంల చుట్టూ తిరుగుతూ గడిపారు. అప్పుడే 60శాతం పని మహిళలదే అయినా మగవాళ్లకే నాయకులకే గుర్తింపు రావడం గ్రహించారు. ఓవైపు మేకల పెంపకం చేయిస్తూ, నేత వృత్తిలోకి వచ్చేలానూ ప్రోత్సహించారు. వారి పనికి స్టైపెండ్ ఇచ్చేవారు. ఎవరైనా దాడికి వచ్చినా మహిళలు ఉమ్మడిగా ఎదురుతిరగడం మొదలు పెట్టారు. దీంతో దాడులు తగ్గాయి. అక్కడివారిలో



పోషకాహారాన్ని గ్రహించి 'నైవేద్య' పేరుతో కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించి పోషకాహారాన్ని అందించారు. ఆ ఊరికి తొలి టాయ్లెట్, స్కూలు వచ్చాయి. నేనే మహిళల సంఖ్య 800కి చేరింది. ఒక్క గ్రామంలో మొదలైన 'మోన ధ్వని' రెండు మూడు గ్రామాలకో సెంటర్ చొప్పున 21 సెంటర్లకి చేరింది. సంతాలీ చీర తెలుపు, ఎరుపు రంగులోనే ఉంటుంది. వాటిని ఇతర రంగుల్లోకి తెస్తున్నాం. జీఐ. ట్యాగ్ కోసమూ ప్రయత్నిస్తున్నాం. చీరల తోపాటు టేబుల్ క్లాత్, కుషన్ కవర్లు వస్తువుల గిఫ్టింగ్‌కి పనికొచ్చేన్నో తయారు చేస్తున్నాం. వాటిని 'కుక్మా' పేరుతో అమ్ముతున్నాం. వీళ్ల కథ వింటే ఎవరికైనా జాలి వేయాల్సిందే. కానీ దాన్నిబట్టి కాదు, వాళ్ల కళబట్టి కొనుగోళ్లు జరగాలి. నేతకి కావాల్సిన పత్తినీ సొంతంగా పండించాలని ఆలోచన. భవిష్యత్తులో నా అవసరమే లేకుండా వాళ్లు ఎదగాలని నా కోరిక అనే బిందు ఈ ప్రాజెక్టుకోసం తన ఇంటినీ, ఆస్తినీ అమ్మేశారు. తన టీమ్కి, జీతాలివ్వడానికి నెలలో రెండువారాలు ఉద్యోగమూ చేస్తున్నారు.

# కడుపు నొప్పికి కారణం

**సాధారణంగా మహిళల్లో నెలసరి సమయంలో పొత్తికడుపులో నొప్పి వస్తుంటుంది. అయితే ఇలా పిరియడ్స్ సమయంలోనే కాకుండా.. అప్పుడప్పుడూ కూడా కడుపునొప్పి రావడం. గమనిస్తుంటాం ఇది చిన్న సమస్యే కదా అని అశ్రద్ధ చేసే వారూ లేకపోలేదు. కానీ ఈ నొప్పి వివిధ రకాల అనారోగ్యాలకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు.** కాబట్టి నొప్పి వచ్చే ప్రదేశాన్ని బట్టి అది ఎలాంటి ఆరోగ్య సమస్యను సూచిస్తుందో తెలుసుకోవడం ముఖ్యమంటున్నారు.



**ఇన్ఫెక్షన్ కావచ్చు.** మూత్రనాళంలో మొదలై పొత్తికడుపు వరకు నొప్పి చేరుకొంటే దాన్ని మూత్రనాళ సంబంధిత ఇన్ఫెక్షన్లకు సూచనగా భావించాలంటున్నారు నిపుణులు. కడుపు నొప్పితో పాటు యూరిన్కి వెళ్లేటప్పుడు మంట, నొప్పి కూడా యూరిన్ ఇన్ఫెక్షన్ లక్షణాలే అంటున్నారు. కొంతమందిలో మూత్రంతో పాటు రక్తం కూడా పడుతుంటుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. ఇన్ఫెక్షన్ ప్రభావం కిడ్నీల వరకు వ్యాపిస్తుంది. అప్పుడప్పుడూ మూత్ర వ్యవస్థలో కణితులు ఏర్పడటం వల్ల కూడా ఇలా నొప్పి వచ్చే అవకాశం ఉంటుంది! కాబట్టి ఇలా మూత్రనాళం నుంచి పొత్తికడుపు వరకు నొప్పి వస్తున్నట్లయితే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించడం మంచిది. మూత్రపరీక్ష ద్వారా వైద్యులు మూత్ర సంబంధిత ఇన్ఫెక్షన్ ఉందో, లేదో తెలుసుకొని.. దాన్ని బట్టి చికిత్స చేస్తారు.

పొత్తికడుపు మధ్యభాగంలో... కొంతమంది మహిళలకు పొత్తికడుపు మధ్య భాగంలో నొప్పి వస్తుంటుంది. అంటే. గర్భాశయం, ఫెలోపియన్ ట్యూబ్స్, అండాశయాల్లో.. ఏదో ఒక దానిలో నొప్పి వస్తున్నట్లు భావించాలి. ఇది ఎండోమెట్రియోసిస్, ఫైబ్రాయిడ్స్, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ డిసీజ్, అండాశయాల్లో సిస్టులు.. వంటి సమస్యలకు సూచనలు కావాలన్నారు. నిపుణులు. వీటిని నిర్లక్ష్యం చేస్తే గర్భస్రావం జరగ డం. లేదా ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ (పిండం గర్భాశయం బయట పెరగడం) వంటి క్లిష్టమైన సమస్యలు ఎదురుకావచ్చు. కాబట్టి పొత్తికడుపు మధ్య భాగంలో నొప్పి వస్తుంటే మాత్రం వైద్యులను సంప్రదించి అసలు సమస్యేంటో నిర్ధారించారు.

**బొడ్డు దగ్గర మొదలైతే..** కొన్ని సందర్భాల్లో కడుపు నొప్పి బొడ్డు దగ్గర మొదలై ఛాతీ వరకు పాకుతుంది. దానితో పాటు కడుపులో మంటగానూ అనిపిస్తే అది సెప్టిక్ అల్సర్కి సూచనగా భావించవచ్చంటున్నారు. నిపుణులు. ముఖ్యంగా ఇది రాత్రివేళల్లో ఇబ్బంది పెడుతూ ఉంటుంది. దీనితో పాటు ఒక్కసారిగా బరువు తగ్గడం, ఆహారం జీర్ణం కాకపోవడం, వాంతులవడం, ఛాతీ నొప్పి, వంటి ఇతర లక్షణాలూ ఈ సమస్య ఉన్నవారిలో కనిపిస్తాయట.

**కడుపుబ్బరంతోపాటు:** కడుపుబ్బరంతో పాటు తరచూ నొప్పి వేధిస్తుంటే.. అది ఉదర సంబంధత క్యాన్సర్లకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి ఆలస్యం చేయకుండా సమస్యకు తగిన చికిత్స తీసుకోవాలి.

# పర్యావరణాన్ని కాపాడుతూ..

ఈరోజు మీరు ఆ తూర్పు దిక్కుగా వెళ్లండి మీ బృందం ఇక్కడే ఉండి ఏం జరుగుతోందో గమనించండిఖి... అంటూ తమ టీమ్లన్నింటికీ బాధ్యతలు అప్పగిస్తున్నారు వైస్ ప్రెసిడెంట్ మామీ స్వైయిన్ తమ విధేంటో తెలియగానే చేతిలో క్యారేజీలు పట్టుకుని అడవి వైపుగా కదులుతున్నాయా బృందాలు. ఏ ఫారెస్టు ఆఫీసర్లో అనుకునేరు. అడవిని రక్షి ంచుకుంటున్న బృందాలు. ఏ ప్రభుత్వమో, ప్రభుత్వ సంస్థ నియమించలేదు. తమకు తాముగా తయారైన మహిళా సైన్యమది. వీళ్లంతా ఒడిశాలోని కంతేపల్లికి చెందిన మహిళలు. పెద్దగా చదువుకున్నవాళ్లు కాదు. కానీ ప్రకృతి విలువ తెలిసినవాళ్లు. అందుకే మా భూమి కాదుగా ఏమైపోతేనేం అనుకోలేక పోయారు. అడవి పచ్చగా కళకళ లాడితేనే జీవితాలు బాగు పడతాయని నమ్మారు. ఇంకేం కర్రలు చేతపట్టారు. ఖివన సురక్షా సమితిఖిగా ఏర్పడి అడవిని కాపాడు కుంటున్నారు. చెట్లను కొట్టనివ్వరు. జంతువులను వేటాడితే ఒప్పుకోరు. ఉదయాన్నే ఎనిమిదింటికల్లా ఇంటి పనులు ముగించుకుని, అయిదుగురు చొప్పున బృందంగా ఏర్పడి ఈ మహిళలు అడవంతా తిరుగు తారు. ఆరేళ్లుగా క్రమం తప్పకుండా ఓ యజ్ఞంలా కొనసాగిస్తున్నారు. మరి లాభం... 200 హెక్టార్ల అటవీభూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడారు. వేసవిలో కార్చిచ్చు ఎలా కమ్మేస్తుందో తెలుసుగా! వాటినీ వీళ్ల సకాలంలో ఆపగలుగుతున్నారు. వన్యప్రాణుల ఉనికీ కనిపిస్తోంది. ఆటవీ సంపదతో ఉపాధినీ పొందుతున్నారు. ఇందుకు ఒడిశా అటవీశాఖ తగ్గ సాయాన్నీ అందిస్తోంది. 75 గడపలున్న చిన్న ఊరు. కనీసం ఇంటికొక మహిళ అనుకుని వందమంది బృందంగా ఏర్పడి పర్యావరణాన్ని కాపాడుతూ ఉపాధినీ పొందుతున్నారు. ఎంత గొప్ప స్ఫూర్తిదాయక ప్రయాణం వీళ్లది !



# చర్మాన్ని మెరిపించే 'ఓట్స్'

ఓట్స్, పోషకాహారంగా దీనికి పేరుంది. అయితే దీన్ని సౌందర్య పోషణలోనూ భాగం చేసుకోవడం వల్ల అందం ఇనుమడిస్తుందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాంరండి..

**ముఖ కాంతికి....** ఓట్మీల్ మంచి ఫేస్ వాష్ గానూ పనిచేస్తుంది. గోరువెచ్చటి నీటిలో కొన్ని ఓట్లు వేసి పేస్ట్ చేసు కోవాలి. దీనికి టీస్పూన్ తేనె కలిపి.. ఈ మిశ్రమంతో ముఖంపై మునివేళ్లతో గుండ్రంగా రుద్దాలి. చర్మం పోయి చర్మం పేరుకున్న దుమ్ము, ధూళి ముఖం శుభ్రపడుతుంది. అలాగే తేనెలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల కాంతివంతమవుతుంది.

**తేమ నిలిచి ఉండేలా...** మనం రోజూ ఎన్నో పనులతో అలసిపోతాం. ఇలాంటి సమయంలో గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేస్తే ఎంతో హాయిగా ఉంటుంది. అయితే ఇందులో ఒక కప్పు ఓట్లు, కొన్ని చుక్కల లావెండర్ నూనె వేయాలి. ఈ మిశ్రమంతో స్నానం చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇందులో ఉపయోగించిన ఓట్స్ చర్మాన్ని శుభ్రం చేయడంతో పాటు తేమ నిలిచి ఉండేలా చేస్తుంది. అలాగే లావెండర్ చర్మాన్ని సువాసనభరితం చేస్తుంది.



**అలర్జీ తగ్గడానికి....** కొంతమందికి చర్మం పొడిబారి పోయి దురద పెడుతూ ఉంటుంది. దీనికి కారణం చర్మంలో తేమ శాతం తగ్గిపోవడం, పీహెచ్ స్థాయులు పెరగడం. కాబట్టి స్నానం చేసే నీటిలో ఓట్లు కలుపుకోవ డం వల్ల చర్మం తేమను సంతరించుకోవడంతో పాటు, పీహెచ్ స్థాయులు బ్యాలన్స్ అవు తాయి. దీనివల్ల చర్మంపై దురద, అలర్జీ.. క్రమంగా తగ్గుముఖం పడతాయి.

# మార్కండేయుడు

ఆధ్యాత్మికం

**మృకండ మహర్షికి** హరిహారులు వరం ప్రసాదించగా మార్కండేయుడు జన్మించాడు. కొడుకు వరప్రసాది అయినా పదహారేళ్లే జీవిస్తాడని తెలిసి ముని దంపతులు మథన పడుతున్నారు. ఒకరోజు ఆశ్రమానికి వచ్చిన నారదుడు 'మహర్షీ' కొడుకు అల్పాయుష్కుడని బాధపడకు. కైలాసవాసుడు తలరాతను కూడా మార్చగలడు. మార్కండేయుడు మహేశ్వరుణ్ణి మెప్పించి పూర్ణాయుష్షును పొందుతాడు అని ఆశీర్వదిం చాడు. నారదముని ఆశీస్సులతో చాల మార్కండేయుడు శివభక్తుడయ్యాడు. తల్లిదండ్రులు కూడా కొడుకు కోసం నిత్యం శివార్చన చేస్తుండేవారు. వారి అనుమతితో బాలకుడిగా ఉన్నప్పుడే మార్కండేయుడు అడవులకు వెళ్లి ఆ పరమేశ్వరుని కోసం తపస్సు చేయసాగాడు. శివపూజలో ఏళ్లు గడిచాయి. మార్కండేయుని ఆయ ర్దాయం తీరిపోగా, అతడి ప్రాణా ల్ని తీసుకువెళ్లేందుకు యమ ధర్మరాజు వచ్చాడు. 'బాలకా! నీ ఆయువు ముగిసింది, బయల్దేరు!' అని తొందర పెట్టాడు. 'శివపూజలో ఉన్నాను! ఇప్పుడు రాలేను!' అన్నాడు ఆ బాలకుడు. అయినా యముడు పట్టువదలక తన యమపాశాన్ని విసిరాడు. అప్పుడు మార్కండేయుడు ఆర్తిగా శివ లింగాన్ని ఆలింగనం చేసుకున్నాడు. యముడు విసిరిన కాలపాశం బాలభక్తుడితో పాటు భక్తవశంకరుణ్ణి కూడా చుట్టుకుంది. తన భక్తుని హింసిస్తున్నందుకు త్రినేత్రుడు. అగ్రహోదగ్రుడై యమధర్మరాజునే నేలకూల్చాడు. తర్వాత దేవతలు ప్రార్థించగా యముడికి ప్రాణభిక్ష పెట్టాడు. తన భక్తుల జోలికి వెళ్లకూడ దంటూ ఆజ్ఞాపించాడు. మార్కండేయుని ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ 'నాయనా మార్కండేయా! నువ్వు చిరంజీవివై చిరకీర్తిని పొందుతావు' అని ఆశీర్వదించాడు. కాలగమనంలో జ్ఞానసంపదను ఆర్జించి, ఆధ్యాత్మిక సాధనలు చేసి బాల మార్కండేయుడు, మార్కండేయ మహర్షిగా కీర్తిపొందాడు. మహాభారతంలో ఈ మహర్షి ప్రస్తావన వస్తుంది. ధర్మరాజు క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు మార్కండేయ మహర్షి జ్ఞానబోధ చేశాడు. కలియుగంలో మనుషుల ప్రవృత్తి ఎలా ఉంటుందో, ఎంత అప్రమత్తంగా ఉండాలో వివరించాడు. అలాగే వ్యాసమహర్షి శిష్యుడైన జైమిని కూడా మార్కండేయ ఆశ్రమానికి వచ్చాడని, తన మనసులో ఉన్న ఎన్నో సంశయాలను నివృత్తి చేసుకున్నాడని పురాణ కథనం. అల్పాయుష్కుడై జన్మించినా పరమేశ్వరుని కృపతో చిరంజీవిగా నిలిచి పోవచ్చని చాటిన మహానుభావుడు మార్కండేయుడు.

# లింగవివక్ష తగ్గుతుందని..

భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తేనే... ఏ ఆర్థిక ఇబ్బందులూ లేకుండా ఆ సంసారం సజావుగా నడు స్తుంది. అంత వరకూ ఒకే... కానీ, అమ్మయ్యే సమయానికి ఆడవాళ్లకి అసలు సవాళ్లు మొదలవు తాయి. మాతృత్వాన్ని ఆస్వా దించడానికి మెటర్నిటీ లీవ్నున్నా వాళ్లపైన కనిపించని ఒత్తిడి ఉం టుంది అది తగ్గాలంటే మగవాళ్లకు ఇచ్చే పెటర్నిటీ లీవులు కూడా పెరగాలని అంటోంది ఒహాయో యూనివర్సిటీ పరిశోధన, అమ్మకంటే బోలెడు బాధ్యతలు ఉంటాయి... నాన్నకు ఏముంటాయి? అతనికెందుకు సెలవులు అనుకోవచ్చు. అది తెలుసుకునేందుకే పరిశోధకులు 200మంది దంపతులతో ప్రసవానికి ముందూ, తర్వాత... వివిధ సమయాల్లో మాట్లాదారు సంస్థలు ఇచ్చే సాధారణ పెటర్నిటీ లీవ్ తీసుకుని ఓ వారం రోజులు పిల్లల గడిపే తండ్రులున్న కుటుంబాల తోనూ, ప్రత్యేకంగా పెటర్నిటీ లీవ్ తీసుకుని భార్యకు సాయంగా ఉన్న వారి కుటుంబాలలోనూ పరిశోధకులు మాట్లాడారు. ప్రత్యేకించి సెలవు తీసుకుని భార్యకు తోడుగా ఉన్న కుటుంబాల్లో అమ్మలపైన ఒత్తిడి అంతగా లేకపోవడంతో పాటూ, వాళ్ల ఆలోచనా తీరులోని మార్పుని ప్రధానంగా గమనించారు. సాధారణంగా తల్లులు బిడ్డ ఆలనాపాలను గురించి మాకు మాత్రమే తెలుసు అన్న భావనలో ఉంటారట. కానీ ఇక్కడ అమ్మలు పిల్లల పెంపకంలో తండ్రి సాయం తీసుకోవడంతో పాటూ, వాళ్ల ప్రాధాన్యాన్ని గుర్తిస్తున్నారు. అన్నింటినీ మించి పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ఇద్దరూ భాగస్వాములు కావడంవల్ల భవిష్యత్తులో లింగవివక్ష తగ్గుతుందని పరిశోధకులు నమ్ముతున్నారు.



# గ్రిల్డ్ వంటకాలు


తక్కువ నూనెతో, చక్కగా ఉడికే గ్రిల్డ్ వంటకాలంటే అందరికీ ఇష్టమే. కానీ, వాటిని ఇంట్లో చేయడమే కష్టం. ఎందుకంటారా? చేపల్నో, చికెన్నో అటూ ఇటూ తిప్పుతూ కొంతవరకూ కాల్చొచ్చు. కానీ, అప ఏ కూరగాయ ముక్కల్నో, పండ్ల ముక్కల్నో రోస్ట్ చేయాలంటే మాత్రం వీలు కుదరదు. కింద పడిపోతాయి. వాటిని కదపడమూ కష్టమే మనలాంటి వారి ఇబ్బందుల్ని గమనించే తయారీదారులు తాజాగా ఈ స్టెయిన్‌లెస్ స్టీల్ గ్రిడ్‌ని తీసుకొచ్చారు. నాలుగైదు చెక్క ముక్కల్ని కాల్చి పైన వేసినా, గ్రిల్ మీద పెట్టినా ఎంచక్కా మీ పని త్వరగా పూర్తయిపోతుంది.



# ప్రయాణాల్లో మినీ మాల్..



పెదాలు పగలకుండా లిప్బామ్.. నిత్యం రాస్తున్నా, మరేదైనా బాగుందనగానే ఓ సారి ప్రయత్నిద్దాం అనిపిస్తుంది. తీరా కొని వాడటం మొదలుపెట్టాక నచ్చకపోవచ్చు. మనకి పడకపోవచ్చు. అలాంటప్పుడు డబ్బులు వృథా అయ్యాయే అనిపిస్తుంది. అవే చిన్న ప్యాక్‌ల్లో దొరికితే ఎంత బాగుండును అనిపించడం సహజమే. ఎందుకంటే ఓసారి వాడి చూశాక నచ్చకపోతే వదిలేయొచ్చు. ఈ అభిప్రాయాన్ని సౌందర్య ఉత్పత్తుల సంస్థలు పసిగట్టాయో ఏమో. కానీ, వినియోగదారులను మెప్పించడానికి, మార్కెట్లోకి చొచ్చుకుపోవడానికి మినీ ప్రొడక్ట్స్ ఎంచుకుంటున్నాయి. ప్రాథమిక చర్మ, కేశ సంరక్షణ ఉత్పత్తులే కాదు... ఫౌండేషన్, సీరమ్, లిప్స్టిక్ వంటి మేకప్ ఉత్పత్తులూ చిన్న ప్యాక్ వచ్చేస్తున్నాయి. మినీ పీల్, మీ ఫస్ట్ వంటి వెబ్‌సైట్లు ప్రత్యేకంగా వెలిశాయి. అంతర్జాతీయ బ్రాండ్ బాబీ బ్రౌన్, దేశీ బ్రాండ్ నైకా వంటివీ దీన్ని ఫాలో అయిపోతున్నాయి. వీటిని ప్రయాణాల్లో తీసుకెళ్లడమూ సులువే .





# ఐపిఎల్ హిస్టరీలో.. ఫాస్టెస్ట్ ఫిఫ్టీలు

## స్పీడ్‌గా హాఫ్ సెంచరీలు చేసిన హీరోలు

### అగ్రస్థానంలో యశస్వి జైస్వాల్





**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అంటేనే పరుగుల సునామీ. ఒక్క బాల్‌ను వేస్ట్ చేసినా బ్యాటర్లు బాధపడిపోతుంటారు. ప్రతీ బాల్ బౌండరీ, సిక్సర్ కొట్టడమే బ్యాటర్ లక్ష్యం. అయితే ఐపీఎల్ చరిత్రలోనే కొందరు ఆటగాళ్లు తమ దూకుడు ఆటతో వేగంగా అర్ధ సెంచరీ సాధించిన ఆటగాళ్లు కూడా ఉన్నారు. ఐపీఎల్ హిస్టరీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ సాధించిన పలువురు హీరోలు ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసి రికార్డు సాధించిన రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు యశస్వి జైస్వాల్ పేరిట ఉంది. 2023 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై జరిగిన మ్యాచ్‌లో కేవలం 13 బంతుల్లో అర్ధ సెంచరీ నమోదు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఇన్నింగ్స్‌లో యశస్వి తన దూకుడు బ్యాటింగ్ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. అలాగే కేఎల్ రాహుల్ 2018లో పంజాబ్ కింగ్స్ తరఫున ఢిల్లీ క్యాపిటల్స్ పై 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేశాడు. పాట్ కమ్మిన్స్ ఒక ఫాస్ట్ బౌలర్ అయినప్పటికీ బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. కమ్మిన్స్ 2022లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ముంబై ఇండియన్స్ పై అద్భుత ఇన్నింగ్స్ ఆడి 14 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. ట్రావిస్ హెడ్ 2024 ఐపీఎల్ సీజన్లో సునామీలా బ్యాటింగ్ చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌పై 16 బంతుల్లో రెండు సార్లు అర్ధ సెంచరీలు సాధించాడు. ఇది అతని అద్భుతమైన ఫామ్‌కు నిదర్శనం. ఐపీఎల్లో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ రికార్డును ట్రావిస్ హెడ్ తన ఖాతాలో వేసుకున్నాడు. నికోలస్ పూరన్ 2023లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆర్సీబీ పై 15 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. జాక్ ఫ్రేజర్ మెక్గుర్క్ 2024లో ముంబై ఇండియన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్‌పై 2024 సీజన్లో 15 బంతుల్లో రెండు సార్లు అర్ధ సెంచరీ చేశాడు. సునీల్ నరైన్ 2017లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 15 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. యూసుఫ్ పఠాన్ 2014లో సన్ రైజర్స్ హైదరాబాద్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున 15 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసి ఆల్రౌండర్‌గా తన సత్తా చాటాడు.

# ఆస్ట్రేలియా పర్యటనకు భారత్

## ఇరు జట్ల మధ్య మూడు వన్డే, ఐదు టి20లు

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజను 18 మూడ్‌లో ఉన్న భారత క్రికెట్ అభిమానులకు మరో శుభవార్త. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే ఆసియా కప్ (టీ20) తర్వాత భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది.



అక్కడటీమ్‌ఇండియా ఆసీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. ఈ మేరకు క్రికెట్ ఆస్ట్రేలియా 2025-26కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 19వ తేదీ నుంచి మొదలు కాబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ అదే నెల 23న ముగియనుంది. వన్డే సిరీస్ ముగిసిన తర్వాత, నాలుగు రోజులకు ధనాధన్ క్రికెట్ మజా మొదలవుతుంది. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 08 వరకూ ఐదు టీ20లను నిర్వహించనున్నారు. మూడు వన్డేలు డే అండ్ నైట్ మ్యాచ్‌లు కాగా, టీ20 సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు రాత్రే జరుగుతాయి. ఇక అమ్మాయిల ఆల్ ఫార్మాట్ సిరీస్ కూడా ఖరారైంది. పురుషులతో పాటు భారత మహిళల జట్టు సైతం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. 2026 ఫిబ్రవరి, మార్చిలో భారత్‌కు ఆస్ట్రేలియాకు మధ్య వన్డే, టీ20 సిరీస్‌లు జరగనున్నాయి. వీటిలో 3 టీ20లు, 3 వన్డేలు, ఒక టెస్టు ఆడనుంది. ఫిబ్రవరి 15వ తేదీ నుండి 21వ తేదీ మధ్య టీ20 సిరీస్ జరగాల్సి ఉండగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 01 దాకా వన్డే సిరీస్ జరుగనుంది. మార్చి 6 నుంచి పెర్త్‌లోని వాకా మైదానంలో ఏకైక టెస్టు (పింక్) ఆతిథ్యమివ్వనుంది.




## ఆర్ఆర్ కెప్టెన్ రియాన్‌కు

# రూ.12 లక్షల జరిమానా



**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ (ఆర్ఆర్) స్టాండ్ ఇన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ ఫైన్ వేశారు. ఉత్కంఠభరితంగా సాగిన ఆ మ్యాచ్‌లో ఆరు పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్ఆర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 182 రన్స్ చేసింది. అయితే భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 రన్స్ మాత్రమే చేసింది. చెన్నై ఛేజింగ్ చేస్తున్న సమయంలో ఆర్ఆర్ జట్టు తమ ఓవర్ల కోటాను పూర్తి చేసేందుకు ఎక్కువ సమయం తీసుకున్నది. దీంతో ఈ యేడాది ఐపీఎల్‌లో ఆర్ఆర్ జట్టు తొలి ఉల్లంఘనకు పాల్పడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఓవర్ రేట్ స్లోగా ఉన్న కారణంగా, కెప్టెన్ పరాగ్‌కు 12 లక్షల జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఆర్ తన తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ చేతిలో ఓడిన విషయం తెలిసిందే. ఇక తన తదుపరి మ్యాచ్‌ను ఏప్రిల్ 5వ తేదీన పంజాబ్ కింగ్స్‌తో ఆడనున్నది.

# మయామి టెన్నిస్ క్వీన్ సబలెంకా

## వరల్డ్ నాలుగో ర్యాంకర్ జెస్సికాపై గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రపంచ నంబర్ 1 ర్యాంకర్, బెలారస్ టెన్నిస్ స్టార్ సబలెంకా తన కెరీర్‌లో 19వ సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. ఫ్లోరిడాలో ముగిసిన మయామి ఓపెన్ ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటీఏ)-1000 లెవెల్ టోర్నర్ సబలెంకా తొలిసారి ఛాంపియన్‌గా అవతరించింది. 88 నిముషాల పాటు జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సబలెంకా 7-5, 6-2తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, అమెరికాకు చెందిన జెస్సికా పెగూలాపై గెలిచింది. టైటిల్ గెలిచే క్రమంలో సబలెంకా తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం గమనార్హం. సబలెంకా సాధించిన 19 టైటిల్స్‌లో 17 టైటిల్స్ హార్ట్ కోర్టులపై రావడం విశేషం. కాగా విజేతగా నిలిచిన సబలెంకాకు 11,24,380 డాలర్ల (9 కోట్ల 61 లక్షల రూపాయలు) ప్రైజ్ మనీతో పాటు, 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. అలాగే రన్నరప్‌గా నిలిచిన పెగులాకు 5,97,890 డాలర్లు (5 కోట్ల 11 లక్షల రూపాయలు) ప్రైజ్ మనీ, 650 ర్యాంకింగ్ పాయింట్లు వచ్చాయి.



## ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# చివరి రోజు భారత్‌కు 3 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా సీనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజున భారత్‌కు మూడు పతకాలు లభించాయి. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో 92 కేజీలకు సంబంధించి దీపక్ పునియా, 61 కేజీల్లో ఉదిత్ ఇరువురూ రజత పతకాలను సాధిచంగా, 125 కేజీల విభాగంలో దినేశ్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే ఫైనల్స్‌లో దీపక్ పునియా ఇరాన్‌కు చెందిన అమీర్ హుస్సేన్ చేతిలో 0-10 పాయింట్ల తేడాతో పరాజయం చెందడంతో రెండో స్థానంలో నిలిచి రజతాన్ని పొందాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ చరిత్రలో 25 ఏళ్ల దీపక్ పునియాకు ఇది ఐదో పతకం కావడం విశేషం. 2021, 2022లలో రజతాలు నెగ్గిన దీపక్, 2019, 2020లలో కాంస్య పతకాలను దక్కించుకున్నాడు. కాగా జపాన్‌కు చెందిన టకారా సుడాతో జరిగిన హోరా హోరీ గేమ్‌లో ఉదిత్ 4-6 తేడాతో ఉదిత్ ఓడిపోయి రజతంతో ముగించాడు. అలాగే కాంస్య పతక బౌట్‌లో దినేష్ తుర్క్‌మెనిస్తాన్ రెజ్లర్ సవరోవ్‌ను ఓడించాడు.

# వాణిజ్యం

# రెపోరేట్లలో ఈ సారైనా మార్పులుంటాయా!

**ముంబై, మార్చి 31:** మందగిస్తున్న ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు, అయిదేళ్లలోనే తొలిసారిగా కీలక రేట్లను తగ్గిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ యేడాది ఫిబ్రవరిలో ప్రకటించింది. తాజాగా కేంద్ర బ్యాంకు మరోసారి పరపతి విధాన కమిటీ సమీక్ష నిర్వహించనుంది. ఈ సారి కూడా రేట్ల కోత ఉండొచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే ఎంత తగ్గిస్తారనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రెపో రేటును 50బేసిస్ పాయింట్లు తగ్గిస్తే మంచిదని కొందరు ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'అమెరికా ఫెడరల్ రిజర్వ్ గతేడాది సెప్టెంబరు నుంచి వడ్డీరేట్లను 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. అదే సమయంలో భారత రెపో రేటు



మాత్రం 25 బేసిస్ పాయింట్లు మాత్రమే దిగొచ్చింది. ప్రస్తుతం ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతోంది. బ్యాంకుల ద్రవ్యలోటు కూడా మెరుగుపడుతోంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేలా వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించాల్సిన అవసరం ఉంది అని పిరామల్ గ్రూప్ చీఫ్ ఎకనమిస్ట్ దేబోపమ్ చౌదరి అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఏప్రిల్ సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రెపో రేటు 6.25 శాతంగా ఉంది. ఈ యేడాది చివరికి దీన్ని 5.5 శాతానికి తీసుకొచ్చే అవకాశాలున్నాయని బ్యాంకు ఆఫ్ అమెరికా గ్లోబల్ రీసెర్చ్ అధ్యయనం వెల్లడించింది. ఏప్రిల్‌తో పాటు జూన్, అక్టోబరు నెలల్లో నిర్వహించే సమీక్షల్లోనూ 0.25శాతం చొప్పున ఆర్‌బిఐ రేట్ల కోత విధిస్తుందన్నది అంచనా వేసింది. రానున్న కొన్ని నెలల పాటు రిటైల్ ద్రవ్యోల్బణం 4శాతం దిగువనే ఉండొచ్చని ఈ రీసెర్చ్ అంచనా వేసింది. ఏప్రిల్7-9 మధ్య ఆర్‌బిఐ ద్వైపాక్షిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహించనుంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఏప్రిల్ 9న ఆర్‌బిఐ గవర్నర్ ప్రకటించనున్నారు.

# బ్యాంక్‌టెక్‌లో బిలియన్ డాలర్ల పెట్టుబడులు


**న్యూఢిల్లీ, మార్చి 31:** బ్యాంక్‌టెక్ రంగంలోకి పెట్టుబడులు 2027 నాటికి బిలియన్ డాలర్లకు సుమారు రూ.8,600 కోట్లు చేరతాయని వెంచర్ కేపిటల్ సంస్థ 'సెడార్- ఐబిఎస్‌ఐ కేపిటల్' తన అంచనాను వెల్లడించింది. 2023 నాటికి భారత్ 7 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించే క్రమంలో వృద్ధిని నడిపించడంలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషించనున్నట్లు తెలిపింది. విప్లవాత్మక టెక్నాలజీలు భారత్‌లో బ్యాంకింగ్ సేలను సమూలంగా మార్చేస్తున్నట్లు సెడార్ ఐబిఎస్‌ఐ వ్యవస్థాపకుడు, ఎండి సాహిల్ ఆనంద్ తెలిపారు. సంప్రదాయ బ్యాంకింగ్ సేల్లో 80శాతాన్ని ప్రస్తుతం డిజిటల్‌గా నిర్వహిస్తున్నట్లు ఓపరిశోధన వివరాలను గుర్తు చేశారు. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. వీటి ఫలితంగా మారుమూల ప్రాంతాల్లోని వారికీ బ్యాంకింగ్ సేవలు అందుతున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగాన్ని డిజిటల్‌గా మార్చడంలో క్లౌడ్ కంప్యూటింగ్ కీలకంగా పనిచేస్తోందంటూ, సేవల విస్తరణ, చురుకు



దనం, వ్యయాల కట్టడి ప్రయోజనాలు దీంతో లభిస్తున్నట్లు వివరించారు. సురక్షితమైన, పారదర్శకమైన లావాదేవీలకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ సాయపడుతున్నట్లు ఆనంద్ వెల్లడించారు. ముఖ్యంగా సప్లయ్ చైన్ ఫైనాన్స్, గుర్తింపు నిర్వహణలో ఇది ఎంతో మార్పును తీసుకొస్తున్నట్లు చెప్పారు. సెడార్-ఐబిఎస్‌ఐ కేపిటల్ ఇప్పటికే బ్యాంక్‌టెక్ రంగంలో రెండు లావాదేవీలతో మొత్తం రూ.240 కోట్ల పెట్టుబడులు పెట్టిందని, తమ పోర్ట్‌ఫోలియోని 10-15 స్టార్టప్‌లకు విస్తరించనున్నట్లు ఆనంద్ ప్రకటించారు.

# ఫిబ్రవరిలో తగ్గిన క్రెడిట్ కార్డుల జారీ..

**ముంబై, మార్చి 31:** దేశంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు జారీచేసే క్రెడిట్ కార్డుల వృద్ధి ఫిబ్రవరిలో మందగించింది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా డేటా ప్రకారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బిఐ కార్డ్స్, ఐసిఐసిఐ బ్యాంకుతో సహా ప్రముఖ ఆర్థికసంస్థలు కొత్తగా జారీచేసే కార్డుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. యాక్సిస్ బ్యాంకు, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఆర్‌బిఎల్ బ్యాంకు వంటి ఇతర ప్రముఖ బ్యాంకులు కూడా తమ క్రెడిట్ కార్డుల జారీ తగ్గిపోయిందని ఆర్‌బిఐ తెలిపింది. భారతదేశ క్రెడిట్ కార్డ్ విభాగంలో అధికంగా వినియోగదారులున్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఫిబ్రవరిలో1,78,000 కార్డులను జోడించింది. దాంతో మొత్తం కార్డుల సంఖ్య 23.6 మిలియన్లకు చేరింది. ఇది దేశంలో అతిపెద్ద క్రెడిట్ కార్డు జారీదారుగా తన స్థానాన్ని సుస్థిరం చేసినప్పటికీ, వృద్ధి గత నెలతో పోలిస్తే క్షీణించింది. జనవరిలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 3,00,000 కోట్ల కార్డులను జారీచేసింది. ఫిబ్రవరిలో జారీ చేసిన కార్డుల కంటే



జనవరిలో ఇష్యూ చేసిన కార్డులు చాలా ఎక్కువ. ఎస్‌బిఐ కార్డ్స్, ఐసిఐసిఐ బ్యాంకులు కూడా ఫిబ్రవరిలో మందకొడిగానే కార్డులను జారీ చేశాయి. ఆర్‌బిఐ డేటాలో సదరు బ్యాంకుల నెలవారీ కార్డుల చేర్పులకు సంబంధించిన కచ్చితమైన గణాంకాలు వివరించనప్పటికీ, రెండు సంస్థలు గతంలో కంటే తక్కువ కార్డులనే జోడించాయని పేర్కొంది.

# కొత్త లోన్ రూల్..నేటి నుంచే..

**ముంబై, మార్చి 31:** ఎడాపెడా అప్పులు చేసే ధోరణిని కట్టడి చేసే కొత్త నిబంధన ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తోంది. దేశ రుణ వితరణ వ్యవస్థను మార్చే ఈ నియమం మూడు కంటే ఎక్కువ రుణదాతల నుంచి రుణాలు తీసుకోకుండా రుణగ్రహీతలను కట్టడి చేస్తుంది. అధిక వినియోగాన్ని అరికట్టడం, బాధ్యతాయుతమైన రుణాలను ప్రోత్సహించడమే ఈ నిబంధన లక్ష్యం. మైక్రోఫైనాన్స్ రంగం అణగారిన వర్గాల సాధికారతలో కీలక పాత్ర పోషించినప్పటికీ, రుణగ్రహీతలు బహుళ వనరుల నుంచి రుణాలు పొందడం చూసింది. ఇది నిర్వహణకు సాధ్యంకాని రుణానికి దారితీస్తుంది. ఈ మితిమీరిన వినియోగం, కొన్ని సంస్థల దూకుడు రుణ విధానాలు వ్యవస్థలో బలహీనతలను సృష్టించాయి. రుణగ్రహీతలను మూడు రుణదాతలకు పరిమితం చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించాలని, డిఫాల్టర్ల ప్రమాదాన్ని తగ్గించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం మూడు కంటే ఎక్కువ సంస్థల్లో రుణాలు తీసుకుంటున్న 45 లక్షల మంది రుణగ్రహీతలకు, ఈ నియమం సవాలుగా మారుతుంది. వీరు తరచుగా వర్కింగ్ కేపిటల్, అత్యవసర అవసరాలు, రోజువారీ మనుగడ కోసం అతివ్యాప్త రుణాలపై ఆధారపడతారు. మూడు బ్యాంకుల పరిమితితో, రుణగ్రహీతలులిక్విడిటీ కొరతను ఎదుర్కోవచ్చు. ఇది వారి ఆర్థిక వ్యూహాలను పునఃసమీక్షించు కునేలా, ఖర్చులను తగ్గించుకునేలా చేస్తుంది. అంతేకాకుండా క్రెడిట్ మదింపులు కఠినంగా మారతాయి. ముఖ్యంగా అధిక రిస్క్‌గా భావించే రుణగ్రహీతలకు రుణ తిరస్కరణలు పెరగవచ్చు. ఇది కొంతమందిని అధిక వడ్డీలు ఉండే అనధికారిక రుణ మార్గాలవైపు నెట్టవచ్చు. కొత్త రూల్ రుణదాలతకూ అనేక సవాళ్లను కలిగిస్తుంది. మైక్రోఫైనాన్స్ సంస్థలు తమ పోర్ట్‌ఫోలియో వ్యూహాలను సర్దుబాటుచేయాల్సి ఉంటుంది. దీంతో స్వల్పకాలంలో వారి కస్టమర్ బేస్ ఎంతో కొంత కోల్పోయే అవకాశం ఉంది. అంతేకాకుండా సంస్థలు రుణ వితరణ విషయంలో మరింత క్షుణ్ణమైన ప్రక్రియలను పెంపొందించుకోవాలి. రుణగ్రహీతలు మూడురుణదాతల పరిమితినిమించకుండా చూసుకోవాలి. ఇందుకోసం బలమైన వ్యవస్థలు, సమన్వయం అవసరమవుతాయి. వాస్తవానికి ఈ నిబంధన జనవరి 1 నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా, సజావుగా జరిగేందుకు ఏప్రిల్ 1కి వాయిదా పడింది. ఈ జాప్యం వాటాదారులకు సన్నద్ధం కావడానికి సమయం అందించినప్పటికీ, రుణగ్రహీతలు, రుణదాతలు ఈ ముఖ్యమైన మార్పుకు ఎలా అలవాటు పడతారనేది అసలైన పరీక్ష.





# ఇండస్ ఇండ్‌పై ఆర్‌క్యాప్ రుణదాతల పిటిషన్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ, మార్చి 31:** జాతీయ కంపెనీ లా అపీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌ఎటి)లో ఇండస్ ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్‌ఎల్)పై దాఖలు చేసిన పిటిషన్‌ను రిలయన్స్ కేపిటల్ రుణదాతల కమిటీ (సిఒసి) ఉపసంహరించుకుంది. పూర్తిగా చెల్లింపులు జరిపి ఇందుకు సంబంధించి నిర్దిష్ట ప్రణాళికను అమలు చేసినందున, ఐఐహెచ్‌ఎల్‌పై పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు అపీలేట్ ట్రిబ్యునల్‌కు ఆర్‌క్యాప్ సిఒసి తెలిపింది. సిఒసి పిటిషన్‌ను జస్టిస్ యోగేష్ ఖన్నా, జస్టిస్ అజయ్ దాస్ మెహ్రోత్రాలతో కూడిన ట్రిబ్యునల్ ద్విసభ్య ధర్మాసనం ఆమోదించింది. కేసు వివరాల్లోకి వెళితే, దివాలా కోడ్ చట్టం కింద ఐఐహెచ్‌ఎల్ ఆర్థిక సేవల సంస్థ రిలయన్స్ కేపిటల్ కొనుగోలుకు 2023 ఏప్రిల్‌లో రూ.9,650 కోట్లతో అత్యధిక బిడ్‌ను నమోదు చేసింది. దీని ప్రకారం దివాలా పరిష్కార ప్రణాళికలను ఐఐహెచ్‌ఎల్ 2024 మే 27లోపు పూర్తి చేయాల్సి ఉంది. అటు తర్వాత ఈ కాల పరిమితిని 2024ఆగస్టు 10 వరకూ పొడిగించడం జరిగింది.




# స్టాక్ మార్కెట్ సెలవులు..

**ముంబై, మార్చి 31:** ఇటీవలి రోజుల్లో స్టాక్ మార్కెట్లపై జనంలో ఆసక్తి పెరిగింది. చాలా మంది మార్కెట్ పెట్టుబడుల వైపు వస్తున్నారు. దీంతో రోజువారీ ట్రేడింగ్‌ను గమనించేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఏయే రోజులు పనిచేస్తాయి, సెలవులు ఎప్పుడెప్పుడు ఉంటాయన్నది తెలుసుకుందాం. మార్చి 31 సోమవారం ఈద్-ఉల్-ఫితర్(రంజాన్) రోజున భారత్ స్టాక్ మార్కెట్‌కు సెలవు. మూడు రోజుల వారాంతం




తర్వాత 2025 ఏప్రిల్ 1న మంగళవారం ట్రేడింగ్ పునఃప్రారంభమవుతుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్ఇ), బాంబే స్టాక్ ఎక్ఛేంజ్ (బిఎస్ఇ) రెండూ స్టాక్స్, డెరివేటివ్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ లోన్ (ఎస్‌ఎల్బీ) విభాగాల్లో ట్రేడింగ్, సెటిల్‌మెంట్‌కు తెరిచి ఉండవు. అయితే 2025 మార్చి 31న మల్టీ కమోడిటీ ఎక్ఛేంజ్ (ఎంసిఎక్స్) మాత్రం పాక్షికంగా తెరిచి ఉంది. దీనికి విరుద్ధంగా భారతదేశపు అతిపెద్ద వ్యవసాయ కమోడిటీ ఎక్ఛేంజ్ అయిన నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్ఛేంజ్ సోమవారం పూర్తిగా మూసి ఉంటుంది. ఏప్రిల్‌లో స్టాక్ మార్కెట్ సెలవులు: పండుగలు, విశేష దినోత్సవాలు, వారాంతపు సెలవులతో కలుపుకొని ఏప్రిల్ నెలలో స్టాక్ మార్కెట్లు మొత్తంగా 11 రోజులు మూసి ఉంటాయి. ఆయా రోజుల్లో స్టాక్ ఎక్ఛేంజీలు ట్రేడింగ్‌కు అందుబాటులో ఉండవు. అదనపు సెలవులు: ఏప్రిల్ 10- మహావీర్ జయంతి, ఏప్రిల్ 14- డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతి, ఏప్రిల్ 18- గుడ్ ఫ్రైడే.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.